www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 25-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 148 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: విదియ మ.12.35 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తర తె.3.50 తదుపరి హస్త; వర్జ్యం: ఉ.9.49-11.32; దుర్ముహూర్తం: మ.12.42-1.31, మ.3.11-4.01; అమృతఘడియలు: రా.8.06-9.49; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.30 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అండాల కోసం ఆందోళన!



సంతాన అవసరార్థులు వేలల్లో.. దాతలు పదుల్లో!

ఈ పరిస్థితులతో యథేచ్ఛగా దళారుల దందా

ఒక్కో అండానికి రూ. 25 వేల నుంచి రూ.30 వేలు

చట్టవిరుద్ధంగా కాలేజీ యువతులపై దళారుల వల

15-20 శాతం మందిలో అండాలే ఉండట్లేదు

వీరంతా దాతలపై ఆధారపడాల్సి వస్తోంది: వైద్యులు

ఎగ్‌ఫ్రీజ్ చేయిస్తున్న ప్రముఖులు, ఐటీ ఉద్యోగులు

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆలస్యంగా వివాహాలు జరగడం.. కాలుష్యం.. జీవనశైలిలో మార్పులు.. రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ వంటి రుగ్మతలు.. పని ఒత్తిడి.. కారణాలేమైనా.. ఇవన్నీ ఇప్పుడు సంతానసాఫల్యానికి అడ్డంకిగా మారుతున్నాయి. పురుషుల్లో వీర్యకణాల సంఖ్య, కదలికల్లో

మిగతా 3వ పేజీలో...



గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే

ఎక్కడ్నుంచి..?

'హైదరాబాద్-అమరావతి' రహదారి ఎంట్రీ పాయింట్లపై సమాలోచనలు

త్వరలో ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ.. అందులో ఎంట్రీ పాయింట్ల ఖరారు

3 ప్రతిపాదనలతో ప్రాథమిక రూట్‌మ్యాప్!.. వాటిని సీఎంలు ఓకే చేస్తే కేంద్రానికి..

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే వ్యవహారం ఎటూ తేలడం లేదు. ఈ రహదారి అలైన్‌మెంట్‌పై కసరత్తు జరుగుతోంది. కానీ, ఏపీలోని అమరావతి, తెలంగాణలోని ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర ఎంట్రీ పాయింట్ల (రోడ్డు నిర్మాణం ఎక్కడి నుంచి మొదలుపెట్టాలి? ఎక్కడ అనుసంధానించాలి?)ను నిర్ధారించలేదు. ఈ విషయం తేలితేనే దీనికి సమాంతరంగా నిర్మించాలని భావిస్తున్న హై స్పీడ్ రైలు మార్గానికి కూడా లైన్ క్లియర్ అవుతుంది. ఎంట్రీ పాయింట్లపై త్వరలోనే ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య కీలక సమావేశం ఉంటుందని అధికార వర్గాలు అంటున్నాయి. ఆ సమావేశంలోనే ఇరు రాష్ట్రాల్లో ఎక్కడి నుంచి రోడ్డును నిర్మించాలనే విషయం ఖరారవుతుందని అధికారులు చెబుతున్నారు. చంద్రబాబు, రేవంత్‌ల సమావేశం తర్వాత మార్గం పూర్తి స్వరూపం తెలుస్తుందని, దాంతో అలైన్‌మెంట్ కూడా ఖరారవుతుందని అంటున్నారు. ప్రస్తుతం రంగారెడ్డి, నల్లగొండ జిల్లాకు కుడివైపుగా ప్రాథమికంగా మూడు రకాల ప్రతిపాదనలతో కూడిన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ మ్యాప్‌పై సీఎంలు సుముఖత వ్యక్తం చేస్తే, ఆ వివరాలను కేంద్రానికి పంపనున్నట్లు సమాచారం. ఆ తర్వాత సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) పనులు ప్రారంభమవుతాయని పేర్కొంటున్నారు. ఏపీ, తెలంగాణ విభజన చట్టంలో హైదరాబాద్-విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలనే హామీ ఉంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేతో పాటు ఇదే ప్రాంతంలో నిర్మించాలని భావిస్తున్న డ్రైపోర్టు నుంచి మచిలీపట్నం పోర్టు వరకు

మిగతా 13వ పేజీలో...

భార్యను ముక్కలు చేసి మూసీలో

పారేశాడు

5 నెలల గర్భిణిని హతమార్చిన భర్త

హైదరాబాద్ బోడుప్పల్‌లో దారుణం

ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం

పెళ్లయిన మూడు నెలలకే గొడవలు, గృహహింస కేసు

భార్య పుట్టింటికి వెళ్తానని అడిగినందుకు మళ్లీ గొడవ

పథకం ప్రకారం హత్య

శవాన్ని ముక్కలు చేసి, 3 విడతల్లో నదిలోకి.. ఇంట్లోనే ఉన్న మొండెం

భార్య కనిపించడం లేదని ఠాణాకు..

విచారణలో హత్యను పసిగట్టిన పోలీసులు.. నిందితుడి అరెస్టు

14

భార్యకు నిప్పంటించి హత్య

అదనపు కట్నం కోసం భర్త దురాగతం

జుట్టు పట్టి ఈడ్చుకెళ్లి.. థిన్నర్ చల్లి నిప్పంటించిన భర్త, అత్తమామలు

చికిత్స పొందుతూ బాధితురాలి మృతి

హత్య వీడియో వైరల్.. భర్త విపిన్, అత్త అరెస్టు.. పరారీలో మామ, మరిది

సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో.. ఇన్‌స్పెక్టర్ పిస్టల్ లాక్కొన్న విపిన్

నిందితుడి కాలిపై పోలీసుల కాల్పులు

నేను నిప్పంటించలేదు: నిందితుడు

2



ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసిన సినీ దర్శకులు, నిర్మాతలు

వ్యవస్థల్ని నియంత్రిస్తే

ఊరుకోం

అందరూ చట్టపరిధిలో పని చేయాల్సిందే

సినీ నిర్మాతలు, దర్శకులతో సీఎం రేవంత్‌రెడ్డి

అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన తెలుగు సినిమా

ఇలాంటి పరిస్థితుల్లో వివాదాలు ఉండకూడదు

త్వరలో సినీ కార్మికులను పిలిచి మాట్లాడతా

స్కిల్ యూనివర్సిటీలో సినీ పరిశ్రమకు అవసరమైన ఏర్పాట్లు చేస్తాం: సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమలో వ్యక్తులు.. వ్యవస్థలను నియంత్రిస్తామంటే ప్రభుత్వం సహించబోదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అందరూ చట్టపరిధిలో పనిచేయాల్సిందేనని తేల్చిచెప్పారు. తెలుగు సినీ పరిశ్రమను అంతర్జాతీయ స్థాయిలో ఉంచడమే తన ధ్యేయమని చెప్పారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో తెలుగు సినీ నిర్మాతలు, దర్శకులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినీ పరిశ్రమకు పర్యవేక్షణ

మిగతా 13వ పేజీలో...

మన మేధస్సు.. మన కోసం!

సొంత మనుషులకు సాయపడేలా వాడుకోవాలి

పరిశోధనలకు అవసరమైన చారిత్రక డాటా అందిస్తాం

విద్యాసంస్థలతో పరిశోధకులను అనుసంధానం చేస్తాం

రాష్ట్రం నుంచి ఆవిష్కరణలకు ఇది సరైన సమయం

ఆసియా-పసిఫిక్ బయో డిజైన్ సదస్సులో రేవంత్

13



ఎగిరి వెళ్లే శవపేటికలు

శత్రువులపై ఆత్మాహుతిదాడులకు మిగ్-21 విమానాలు

డీకమిషన్ చేస్తున్న మిగ్-21లను కమికాజే డ్రోన్లుగా మార్చే యోచన?

టార్గెట్ డ్రోన్లుగా.. శత్రు రేడార్లను మభ్యపెట్టే విమానాలుగా వాడకం!

గూఢచర్యానికి ఉపయోగించే ప్రతిపాదనలపై విస్తృత చర్చ

2

అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ పరీక్ష విజయవంతం

డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన ఐఏడీడబ్ల్యూఎస్

2

ఎయిర్ డ్రాప్ పరీక్ష సక్సెస్

'గగన్‌యాన్'లో మరో ముందడుగు



జెలెన్‌స్కీకి మోదీ ఆహ్వానం

ఉక్రెయిన్ అధ్యక్షుడి భారత పర్యటన తేదీ ఖరారు కాలేదు

ఆ దేశ రాయబారి వెల్లడి

2

కేంద్రం నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత

కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావు

11 ఏళ్లుగా లేని యూరియా కొరత.. ఇప్పుడెందుకు వచ్చిందో తెలియదా?

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

13

దొంగ ఓట్లతోనే 8 మంది గెలిచారు

రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు గెలిచిందలాగే..

ఓట్ చోరీతోనే మోదీ అధికారంలోకి వచ్చారు

బీసీల్లో ఉన్న దేశ్‌ముఖ్.. బండి సంజయ్

బీసీలపై ఒక్క సారైనా ఆయన మాట్లాడారా?

దేవుడి పేరుతో ఓట్లడిగే బిచ్చగాళ్లు.. బీజేపీ నేతలు

3 ముక్కలైన బీఆర్ఎస్.. త్వరలోనే కనుమరుగు

వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి తీరుతాం

జనహిత పాదయాత్రలో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

ఓట్ చోరీపై ప్రజలు ఉద్యమానికి సిద్ధం కావాలి

పేదల కళ్లలో ఆనందమే మా ధ్యేయం: మీనాక్షి



కరీంనగర్ జిల్లా గంగాధరలో పాదయాత్రలో మహేశ్‌గౌడ్, పొన్నం, మీనాక్షి

గంగాధర/కరీంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓట్ చోరీతోనే దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. దేశంలో ఓట్ చోరీ జరిగిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ రుజువులతో సహా నిరూపించారన్నారు. ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే ప్రధాని పదవికి మోదీ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో ఆదివారం ఆయన జనహిత పాదయాత్ర నిర్వహించారు. అదే మండలంలోని

మిగతా 13వ పేజీలో...





సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

సురవరానికి తుది వీడ్కోలు

ప్రజల సందర్శనార్థం సీపీఐ ఆఫీసులో భౌతిక కాయం

రేవంత్, చంద్రబాబు, వెంకయ్య సహా ప్రముఖుల నివాళి

అధికార లాంఛనాలతో అంతిమ యాత్ర

గాంధీ వైద్య కళాశాలకు భౌతిక కాయం అప్పగింత

సురవరం పేరు నిలిచిపోయేలా చేస్తాం: సీఎం రేవంత్

సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు: ఏపీ సీఎం చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వం అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలికింది. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి నుంచి ఉదయం 10 గంటలకు హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌కు ఆయన భౌతిక కాయాన్ని తీసుకువచ్చారు. అక్కడ ప్రజలు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు,

మిగతా 12వ పేజీలో...

విమెన్ 'జస్టిస్'లో తెలంగాణ టాప్

- తెలంగాణ హైకోర్టులో 30లో 10 మంది మహిళా న్యాయమూర్తులు
- సిక్కింలో ముగ్గురు జడ్జిల్లో ఒకరు మహిళ.. తొమ్మిదో స్థానంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు
- 8 హైకోర్టుల్లో ఒక్కొక్కరే మహిళా జడ్జిలు.. మరో 3 హైకోర్టుల్లో మహిళలు సున్నా



- సుప్రీంలో మహిళా జడ్జిలు 6.06శాతమే.. మహిళా సీజే నిల్
- తొలి మహిళా సీజేఐగా 2027లో జస్టిస్ బీవీ నాగరత్న
- 'సెంటర్ ఫర్ లా అండ్ పాలసీ రిసెర్చ్' నివేదిక

3

బీసీ కోటాకు న్యాయమెలా?

నేడు ఢిల్లీకి వెళ్లనున్న మంత్రుల కమిటీ

జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో సంప్రదింపులు

ప్రముఖ న్యాయకోవిదులు, నిపుణులతోనూ

సీఎం రేవంత్ కూడా హాజరయ్యే అవకాశం!

నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి.. రేపు బిహార్‌కు..

రాహుల్ పాదయాత్రలో పాల్గొననున్న సీఎం

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఉన్న అవకాశాలపై న్యాయకోవిదుల సలహా కోరేందుకు మంత్రుల కమిటీ సోమవారం ఢిల్లీకి వెళ్లనుంది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీ.. ఢిల్లీలో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని సంప్రదించనుంది. ఆయనతోపాటు ఢిల్లీలోని ప్రముఖ న్యాయ కోవిదుల అభిప్రాయాలనూ

మిగతా 13వ పేజీలో...

అంతరిక్షంలోకి వెళ్తాననుకోలేదు

» చిన్నప్పుడు చాలా బిడియస్థుడిని: శుభాన్షు శుక్లా

» గగన్‌యాన్ యాత్రికులకు రాజ్‌నాథ్ సన్మానం



న్యూఢిల్లీ, ఆగస్టు 24: బాల్యంలో తాను చాలా బిడియస్థుడినని, ఎవరితోనూ కలిసేవాడిని కాదని భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా తెలిపారు. అంతరిక్షంలోకి వెళ్తానని కలలో కూడా అనుకోలేదని చెప్పారు. ఆదివారం భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నతనంలో రాకేశ్‌శర్మ అంతరిక్ష ప్రయాణానికి సంబంధించిన కథలు వింటూ పెరిగానని గుర్తుచేసుకున్నారు. అయితే అప్పట్లో నింగిలోకి వెళ్లాలనే ఆలోచన లేదన్నారు. మరోవైపు, గగన్‌యాన్ వ్యోమగాములు శుభాన్షు శుక్లా, పి.వి. నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సన్మానించారు. అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ఆకాంక్షలకు ప్రతీకలుగా నిలిచిన వీరు మన దేశానికి గర్వకారణమని ప్రశంసించారు. "నాది లఖ్‌నవూ పార్లమెంట్ నియోజకవర్గం. శుభాన్షు శుక్లా అక్కడివాడే. అతను కూడా మా ఓటరు" అని రాజ్‌నాథ్ అన్నారు.

అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ, ఆగస్టు 24: భారత రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన అత్యాధునిక సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ (ఐఏడీడబ్ల్యూఎ)ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. శనివారం అర్ధరాత్రి 12:30 గంటలకు ఒడిశా తీరంలోని దీన్ని పరీక్షించినట్టు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'ఐఏడీడబ్ల్యూఎస్ (ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్) అనేది డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థ. దీనిలో స్వదేశీయంగా అభివృద్ధి చేసిన క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (క్యూఆర్‌ఎస్ఏఎం), అడ్వాన్స్‌డ్ వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (వీఎస్‌హెచ్ఓఆర్ఏడీఎస్) మిస్సైల్స్, హైపవర్ లేజర్-బేస్డ్ డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ (డీఈడబ్ల్యూ) ఉన్నాయి' అని రాజ్‌నాథ్ సింగ్ ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా, సముద్ర తీరప్రాంత గస్తీని బలోపేతం చేసుకోవడంపై భారత నేవీ దృష్టి పెట్టింది. దీనికోసం 76 నావల్ యుటిలిటీ హెలికాప్టర్లు (ఎన్‌హెచ్‌యూ) కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 'సమాచారం కోసం అభ్యర్థన' (రిక్వెస్ట్ ఫర్ ఇన్ఫర్మేషన్)ను జారీ చేసింది. నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచిన వివరాల ప్రకారం ఈ 76 హెలికాప్టర్లలో 51 నావికా దళానికి, మిగిలిన 25 హెలికాప్టర్లను కోస్ట్‌గార్డ్‌కు కేటాయించనున్నారు.

వినియోగదారుల ఫోరమ్‌ల అధికారాల పునరుద్ధరణ

» అన్ని రకాల ఆదేశాలను అమలు చేసేలా సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ, ఆగస్టు 24: వినియోగదారుల ఫోరమ్‌ల అధికారాలను పునరుద్ధరిస్తూ సుప్రీంకోర్టు తాజాగా కీలక తీర్పు వెలువరించింది. వాటి అన్ని తుది, మధ్యంతర ఆదేశాలను సివిల్ కోర్టు డిక్రీలుగా పరిగణిస్తూ అమలు చేసే అధికారాన్ని కల్పిస్తూ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ రాజేశ్ బిందాల్ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిర్ణయం వేలాది మంది వినియోగదారులకు అనుకూలమైన తీర్పులు వచ్చినప్పటికీ.. నిజమైన ఉపశమనం లభించని దాదాపు 18 ఏళ్ల చట్టపరమైన లొసుగుకు ముగింపు పలికింది. 'ప్రతి ఆర్డర్' అనే పదం స్థానంలో 'మధ్యంతర ఆర్డర్' అని మారుస్తూ వినియోగదారుల పరిరక్షణ చట్టానికి (సీపీఏ) 2002లో చేసిన సవరణ.. ఫోరమ్‌ల అధికారాలను నీరుగార్చిందని ధర్మాసనం అభిప్రాయపడింది. వాటి సొంత తుది తీర్పులను కూడా అమలు చేయకుండా నిరోధించిందని పేర్కొంది. 1986 చట్టంలోని సెక్షన్ 25 'ఏ ఆదేశాన్ని' అయినా అమలు చేసే అధికారాన్ని ఫోరమ్‌లకు కల్పిస్తుందని పేర్కొంది.

జెలెన్‌స్కీని భారత్‌కు ఆహ్వానించిన మోదీ

» తేదీ ఇంకా నిర్ణయం కాలేదన్న రాయబారి

న్యూఢిల్లీ, ఆగస్టు 24: భారతదేశానికి రావాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ప్రధాని మోదీ ఆహ్వానించారు. భారత్‌లో ఉక్రెయిన్ రాయబారి అలెగ్జాండర్ పొలిష్చుక్ తాజాగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఉక్రెయిన్ జాతీయ పతాక దినోత్సవం సందర్భంగా శనివారం ఢిల్లీలో ఒక ఆంగ్ల వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ జెలెన్‌స్కీ రాక కోసం ఇరుదేశాల అధికారులు పనిచేస్తున్నారని చెప్పారు. 'జెలెన్‌స్కీ భారత్‌కు వస్తారని మేం ఆశిస్తున్నాం. మన ద్వైపాక్షిక సంబంధాల్లో ఇదొక గొప్ప కార్యం కానుంది. తగిన తేదీకి అంగీకరించేందుకు మేం ప్రయత్నిస్తున్నాం' అన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడంలో భారత్ మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. రష్యాతో భారత్‌కు ఉన్న సుదీర్ఘ సంబంధాల దృష్ట్యా.. శాంతి చర్చల్లో భారత్‌ను కీలక పాత్రధారిగా తాము భావిస్తున్నామన్నారు. శాంతి, కాల్పుల విరమణను సమర్థిస్తున్న మోదీని ఆయన ప్రశంసించారు. భారత్ తటస్థమైనది కాదని, శాంతి, దౌత్యం, రాజకీయ చర్చలను అది దృఢంగా సమర్థిస్తోందని అన్నారు.

'సర్' తర్వాతా పాక్ మహిళలకు బిహార్‌లో ఓటు

భగల్పూర్, ఆగస్టు 24: బిహార్ ఓటరు జాబితాపై ఏదో ఒక వివాదం వెలుగు చూస్తోంది. తాజాగా బిహార్‌లోని భగల్పూరులో ఇద్దరు పాక్ వృద్ధ మహిళలకు ఓటరు కార్డు జారీచేయడం కేంద్ర ప్రభుత్వాన్నే నివ్వెరపరచింది. ఆ ఇద్దరి ఓటరు కార్డులను వెంటనే రద్దుచేయించి, సమగ్ర విచారణ జరపాలని భగల్పూరు కలెక్టరు, ఎస్పీలను కేంద్ర హోంశాఖ తాజాగా ఆదేశించింది. ఆ వివరాల్లోకి వెళితే.. ఇమ్రానా, ఫిరదౌసియా అనే ఇద్దరు పాక్ మహిళలు 1956లో విజిటర్ వీసాపై భారత్‌కు వచ్చి తిరిగి వెళ్లలేదు. ప్రస్తుతం వీరు భగల్పూరులోని ఇషాక్‌చక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భికన్‌పూర్ గుమ్టి నం. 3లోని ట్యాంక్ లేన్‌లో నివాసం ఉంటున్నారు. ఇమ్రానా 3నెలల కోసం, ఫిరదౌసియా మూడేళ్ల కోసం ఈ వీసా తీసుకున్నారు. అయితే, ఇటీవల నిర్వహించిన సమగ్ర ఓటరు సవరణ(ఎస్ఐఆర్) తర్వాత కూడా వీరి ఓట్లను ఈసీ తీసివేయలేకపోవడం గమనార్హం.

ఓట్ల తారుమారుకు మోదీ యత్నం: రాహుల్

అరారియా, ఆగస్టు 24: ఓటర్ల జాబితాలను తారుమారు చేసేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. బిహార్లో జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా పేదల ఓట్లు దొంగిలించాలని ఆయన అనుకుంటున్నారని విమర్శించారు. చిన్న పిల్లలు సైతం 'ఓట్ల దొంగా.. గద్దె దిగు' అంటున్నారని.. ఈసీ వారితో మాట్లాడాలని సూచించారు. ఆయన చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర' ఆదివారం అరారియా చేరుకుంది.ఓటర్ అధికార యాత్ర సందర్భంగా రాహుల్, తేజస్వి బుల్లెట్‌పై కాసేపు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి భద్రతావలయాన్ని ఛేదించుకుని వచ్చి రాహుల్ ఎడమ భుజంపై ముద్దుపెట్టాడు. వెంటనే భద్రతాసిబ్బంది అతడిని కొట్టి సెక్యూరిటీ జోన్‌కు దూరంగా తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఇదిలా ఉండగా, బిహార్లో ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా చేపట్టిన ఓటర్ల డాక్యుమెంట్ల తనిఖీ ముమ్మరంగా సాగుతోందని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఇప్పటివరకు 98.2 శాతం మంది డాక్యుమెంట్లు సమర్పించారని తెలిపింది. ధ్రువపత్రాలకు ఇంకా 8రోజుల సమయం మాత్రమే ఉందని పేర్కొంది.

ఆ కోర్సులు ఆన్‌లైన్, దూరవిద్య విధానాల్లో వద్దు

» హెల్త్‌కేర్, సైకాలజీ, న్యూట్రిషన్ కోర్సులపై యూజీసీ ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ఈ విద్యా సంవత్సరం నుంచి హెల్త్‌కేర్, దాని అనుబంధ కోర్సులను(సైకాలజీ, న్యూట్రిషన్ సహా) ఓపెన్, దూరవిద్య ఆన్‌లైన్ విధానాల్లో ఆఫర్ చేయవద్దని యూజీసీ అన్ని ఉన్నత విద్యా సంస్థలను ఆదేశించింది. 'నేషనల్ కమిషన్ ఫర్ అలీడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్'(ఎన్‌సీఏహెచ్‌పీ) చట్టం, 2021 కింద ఆఫర్ చేసే సైకాలజీ, మైక్రోబయాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, బయో టెక్నాలజీ, క్లినికల్ న్యూట్రిషన్, డైటెటిక్స్ వంటి కోర్సులకు కూడా ఈ నిషేధం వర్తిస్తుంది. ఒకవేళ ఏదైనా విద్యాసంస్థకు ఇప్పటికే ఈ కోర్సులకు అనుమతి మంజూరు చేసినా దాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు యూజీసీ కార్యదర్శి మనీష్ జోషి ప్రకటించారు. అందువల్ల ఏ విద్యాసంస్థా ఈ కోర్సుల్లో విద్యార్థులను చేర్చుకోవద్దని తెలిపారు.

శత్రువులపై ఆత్మాహుతిదాడులకు..

ఎగిరి వెళ్లే శవపేటికలు

డీకమిషన్ చేస్తున్న మిగ్-21లను కమికాజే డ్రోన్లుగా మార్చే యోచన?



మిగ్ 21 విమానం

న్యూఢిల్లీ, ఆగస్టు 24: భారత వైమానిక దళానికి దాదాపు ఆరు దశాబ్దాలపాటు సేవలందించిన యుద్ధ విమానాలు.. ఎగిరే శవపేటికలుగా పేరొందిన మిగ్ 21లకు ఈ ఏడాది సెప్టెంబరు కల్లా పూర్తిగా సెలవు ప్రకటించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే! వాటి స్థానాన్ని స్వదేశీ తేజస్ ఎల్‌సీఏ మార్క్-1ఏ విమానాలతో భర్తీ చేసేందుకు ఐఏఎఫ్ సిద్ధమైంది. అయితే.. మిగ్-21లకు పూర్తిగా వీడ్కోలు పలకడం వల్ల వాయుసేనకు యుద్ధవిమానాల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో.. డీకమిషన్ చేసిన మిగ్ 21లను ఆత్మాహుతి డ్రోన్లుగా, శత్రు రేడార్లను మభ్యపెట్టే విమానాలుగా.. గూఢచర్యానికి.. ఇలా ఇతరత్రా రకరకాల మార్గాల్లో వినియోగించుకునే ప్రతిపాదనలపై చర్చలు జరుగుతున్నట్టు సమాచారం.

టార్గెట్ డ్రోన్లు: పైలట్ రహిత మిగ్-21లను ఏరియల్ టార్గెట్లుగా వినియోగించడం. అంటే.. ఎయిర్-టు-ఎయిర్, సర్ఫేస్-టు-ఎయిర్ మిస్సైళ్లను పరీక్షించడానికి హైస్పీడ్ టార్గెట్లు అవసరం అవుతాయి. అలాంటి టార్గెట్లుగా మానవరహిత మిగ్-21లను ఉపయోగించాలనే ప్రతిపాదన ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే.. మన క్షిపణుల సామర్థ్యాన్ని పరీక్షించుకునేందుకు ఈ మిగ్-21లు ప్రాక్టీస్‌గా ఉపయోగపడతాయన్నమాట.

కంబాట్ డ్రోన్లు: మిగ్-21 బైసన్‌లను 'కంబాట్ ఎయిర్ టీమింగ్ సిస్టమ్ (క్యాట్స్)' ప్రోగ్రామ్ కింద కంబాట్ డ్రోన్లుగా మార్చడం. ఇవి మానవ రహిత యుద్ధవిమానాలుగా పనిచేస్తాయి. హైరిస్క్ మిషన్స్‌లో వీటిని ముందుగా పంపి.. శత్రు రేడార్లు, క్షిపణి రక్షణ వ్యవస్థలు యాక్టివేట్ అయ్యేలా చేస్తారు. ఆ తర్వాత మన యుద్ధవిమానాలు దాడులు చేసి ఆయా రేడార్లు, క్షిపణి రక్షణ వ్యవస్థలను నాశనం చేస్తాయి. అమెరికా ఇప్పటికే పాత ఎఫ్-16లను క్యూఎఫ్-16టార్గెట్ డ్రోన్లుగా మార్చి వాడుతోంది. చైనా, రష్యా కూడా పాత యుద్ధవిమానాలను ఇదే తరహాలో వినియోగిస్తున్నట్లు సమాచారం.

కమ్యూనికేషన్ రిలే టవర్: శత్రుస్థావరాలు ఉండే ప్రాంతాల్లో సురక్షిత కమ్యూనికేషన్ కోసం.. మిగ్-21లను ఎగిరే సమాచార ప్రసార టవర్లుగా ఉపయోగించుకునే ప్రతిపాదన ఇది

కమికాజే స్ట్రైక్ రోల్: మానవ రహిత మిగ్-21లో భారీగా పేలుడు పదార్థాలు నింపి ఆత్మాహుతి డ్రోన్‌గా మార్చి నేరుగా శత్రులక్ష్యాలపై ప్రయోగించడం. అంటే.. ఈ విధానంలో ప్రయోగించిన విమానం ఇక తిరిగి రాదు. దాడి చేసి పేలిపోతుంది. శత్రువుల రేడార్ కేంద్రాలు, క్షిపణి రక్షణ వ్యవస్థలు, రన్‌వేలపై వీటిని ప్రయోగిస్తారు. దీనివల్ల మనం కోల్పోయేది.. కాలంచెల్లిన పాత మిగ్ విమానాలను మాత్రమే.

గూఢచర్యానికి: మిగ్-21లకు అత్యంత అధునాతనమైన సెన్సర్లను అమర్చి అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల్లో గూఢచర్యానికి పంపొచ్చు. పగలు, రాత్రి శత్రువుల కదలికలను గమనించడానికి.. మేఘాలు, పొగమంచు ఉన్నప్పుడు కూడా భూభాగాన్ని మ్యాప్ చేయడానికి, శత్రువుల సమాచారప్రసారాన్ని పసిగట్టడానికి, శత్రువుల ఎలక్ట్రానిక్ వ్యవస్థలు ఎక్కడున్నాయో గుర్తించడానికి ఉపయోగించవచ్చు. ప్రస్తుతం మనం హెరాన్, రుస్తుం-2 వంటి యూఏవీలను గూఢచర్యానికి వాడుతున్నాం. కానీ.. మిగ్-21లు వేగంలో వాటికన్నా చాలా మెరుగైనవి. ఎక్కువ పేలోడ్‌ను మోసుకెళ్లగలవు. స్టెల్త్ సామర్థ్యం లేకపోయినా.. వేగంతో తప్పించుకోగలవు.

అందుకే ఆ పేరు

1963లో తొలిసారి భారత వైమానిక దళం అమ్ములపొదిలో చేరిన మిగ్-21లు దరిమిలా పలు యుద్ధాల్లో సత్తా చాటాయి. ఒక దశలో ఐఏఎఫ్ వద్ద 850కి పైగా మిగ్-21లు ఉన్నాయి. కానీ, ఈ విమానాలు తరచూ కూలిపోవడం వల్ల దాదాపు 200 మంది పైలట్లు చనిపోయారు. పలువురు పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారు. భారత వాయుసేన విమానాల్లో అత్యధికంగా కూలిపోయినవి ఇవే అందుకే వీటికి ఎగిరే శవపేటికలనే పేరు వచ్చింది.

నాలుగు ఎఫ్-86లు వర్సెస్ మిగ్-21

మిగ్-21లకు 'ఎగిరే శవపేటికలు', 'విడో మేకర్స్' అనే పేర్లున్నాయిగానీ.. తామెప్పుడూ వాటిని అలా చూడలేదని, వాటి సామర్థ్యం ఏమిటో తమకు తెలుసని ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) పృథ్వీసింగ్ బ్రార్ (86) వంటివారు చెబుతున్నారు. 1971 యుద్ధ సమయంలో పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లపై బాంబుల వర్షం కురిపించడంలో మిగ్-21లదే కీలకపాత్ర అని ఆయన గుర్తుచేశారు. అప్పట్లో తాను స్వయంగా మిగ్-21లో వెళ్లి పాకిస్థాన్‌లోని రఫికుల్ ఎయిర్‌బేస్‌పై 500 కిలోల బాంబులు రెండింటిని జారవిడిచి.. తిరిగి వస్తుండగా అమెరికాకు చెందిన నాలుగు ఎఫ్-86లు తనను వెంబడించాయని చెప్పారు. "నా మిగ్-21ను పూర్తివేగంతో నడిపాను. దీంతో పాక్ విమానాలు (మిగ్-21 వేగంతో సరితూగలేక) నన్ను వదిలేశాయి" అని ఆయన వివరించారు.

ఎయిర్ డ్రాప్ పరీక్ష విజయవంతం

» గగన్‌యాన్ మిషన్‌లో మరో ముందడుగు



గగన్‌యాన్ క్రూ మాడ్యూల్‌ను మోసుకెళ్తున్న హెలికాప్టర్

సూళ్లూరుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గగన్‌యాన్ మిషన్‌లో మరో ముందడుగు పడింది. ఈ మిషన్‌లో కీలకమైన క్రూ మాడ్యూల్‌కు సంబంధించిన తొలి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్(ఐఏడీటీ-01)ను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. ప్రయోగంలో భాగంగా గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ నమూనాను షార్ నుంచి 35 కిలోమీటర్ల దూరంలో.. భూ ఉపరితలానికి 3 కిలోమీటర్ల ఎత్తులో హెలికాప్టర్ సాయంతో నింగిలోకి తీసుకెళ్లి కిందకు జారవిడిచారు. పారాచూట్ల సాయంతో ఆ మాడ్యూల్ వేగాన్ని తగ్గించుకుంటూ సముద్ర జలాల్లో సురక్షితంగా దిగేలా చేశారు. అనంతరం బంగాళాఖాతంలో పడిన క్రూ మాడ్యూల్‌ను స్వాధీనం చేసుకుని చెన్నై పోర్టుకు తరలించారు. వ్యోమగాములను అంతరిక్షం నుంచి తీసుకొచ్చేందుకు ఈ మాడ్యూల్ ఉపయోగపడుతుంది. మరోవైపు, మానవసహిత అంతరిక్ష మిషన్ల కోసం వ్యోమగాములను సిద్ధం చేసుకోవాలని ఇస్రో భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా వ్యోమగాముల బృందాన్ని ఏర్పాటు చేయాలని, ఇందులో మహిళలు, సాధారణ ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని నిర్ణయించింది.

లోకం తీరు



గల్ఫ్‌లో ఐదుగురు తెలంగాణ ప్రవాసీలకు

రెండేళ్ల జైలు.. దేశ బహిష్కరణ

» 19 మంది ప్రవాస భారతీయులకూ అదే శిక్ష

» ఆహార ప్యాకెట్లపై గడువు తేదీ మార్చినందుకు బహ్రెయిన్ కోర్టు తీర్పు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సంస్థ యజమానితో కలిసి ఆహార ప్యాకెట్లపై గడువు ముగింపు తేదీలను మార్చడం ద్వారా మోసాలకు పాల్పడ్డారనే కేసులో ఐదుగురు తెలంగాణ ప్రవాసీలు జైలు పాలయ్యారు. న్యాయస్థానం వీరికి రెండేళ్ల జైలు శిక్ష, దేశ బహిష్కరణ విధించింది. అలాగే, ఇద్దరు అరబ్బు యజమానులు, ఓ భారతీయ మేనేజరు సహా 19 మంది ప్రవాస భారతీయులు కూడా జైలు శిక్ష పడిన వారిలో ఉన్నారు. బహ్రెయిన్‌లో ఆహార పదార్థాలను సరఫరా చేసే ఓ ప్రముఖ సంస్థలో నిజామాబాద్‌కు చెందిన ముగ్గురు.. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు చెందిన ఒక్కొక్కరు పని చేస్తున్నారు. అయితే, ఇదే సంస్థలో పని చేయడానికి వచ్చిన ఉద్యోగి ఒకరు అందులో పని విషయమై వివాదం ఏర్పడడంతో సంస్థ కార్యకలాపాలను వీడియో రికార్డింగ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు సంస్థ గిడ్డంగులపై దాడులు చేసి ప్యాకింగ్ చేసిన వివిధ రకాల ఆహార పదార్థాల ప్యాకెట్లపై గడువు ముగిసిన తేదీలను మారుస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారని బహ్రెయినీ జాతీయులైన అరబ్బు యజమానులతో సహా మొత్తం 29 మందిని అరెస్టు చేశారు. కానీ, సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో న్యాయస్థానం ఏడుగురు భారతీయులను విడుదల చేయగా.. మిగిలిన 22 మందికి రెండేళ్ల జైలు శిక్షలు విధించింది. ప్రవాస భారతీయుల జైలు శిక్షను రద్దు చేయాలని బహ్రెయిన్‌లోని సామాజిక కార్యకర్త కోటగిరి నవీన్, టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డిలు ప్రయత్నాలు చేస్తున్నారు.



భరతనాట్యంలో అరంగేట్రం చేసిన చైనా విద్యార్థిని

బీజింగ్, ఆగస్టు 12: భారతీయ ప్రాచీన కళారూపమైన భరతనాట్యంలో 'అరంగేట్రం' చేయడం ద్వారా చైనా జాతీయురాలైన 17ఏళ్ల జాంగ్ జియాయువాన్ చరిత్ర సృష్టించింది. ఈ మేరకు బీజింగ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ భరతనాట్య కళాకారిణి జిన్ షాన్ షాన్, భారత దౌత్యవేత్తలు, పెద్దఎత్తున హాజరైన స్థానికుల ఎదుట జాంగ్ తన అరంగేట్ర ప్రదర్శన చేసింది. తద్వారా చైనాలోనే శిక్షణ పొంది, ఇక్కడే అరంగేట్రం చేసిన రెండో నర్తకిగా రికార్డు సృష్టించింది. గతేడాది 13 ఏళ్ల లీ ముజీ చైనాలో మొట్ట మొదటిసారిగా భరతనాట్య అరంగేట్రాన్ని ప్రదర్శించిన తొలి విద్యార్థినిగా నిలిచింది. జాంగ్ ఐదేళ్ల వయసులోనే భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించి, 12ఏళ్లు వచ్చేనాటికి తన గురువు జిన్ షాన్ షాన్ నిర్వహించే ప్రత్యేక నృత్య పాఠశాలలో చేరింది. అరంగేట్రం కోసం రోజుకు 5గంటల చొప్పున కఠిన సాధన చేసింది. ప్రదర్శన తర్వాత భారత దౌత్యవేత్త అభిషేక్ ఆమెను అభినందిస్తూ, అత్యంత క్లిష్టమైన భారతీయ నృత్య రూపాన్ని నేర్చుకోవడానికి తను చేసిన కృషిని ప్రశంసించారు.

రూ.20 వాటర్ బాటిల్‌కు 100 ఎందుకు తీసుకుంటారు?

» హోటళ్లు, రెస్టారెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 24: హోటళ్లు, రెస్టారెంట్లు వసూలు చేస్తున్న సర్వీస్ చార్జీలపై మరోసారి ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విక్రయించే వాటిపై గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ) కంటే ఎక్కువే తీసుకుంటున్నప్పుడు.. మళ్లీ అదనంగా సర్వీస్ చార్జీ ఎందుకు వసూలు చేస్తున్నారంటూ రెస్టారెంట్ల సంఘాలను నిలదీసింది. హోటళ్లు, రెస్టారెంట్లలో సర్వీస్ చార్జీ తప్పనిసరి కాదంటూ ఈ ఏడాది మార్చిలో ఢిల్లీ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తీర్పునిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ జాతీయ రెస్టారెంట్ల సంఘం, భారత హోటళ్లు, రెస్టారెంట్ల సంఘాల సమాఖ్య పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై ద్విసభ్య ధర్మాసనం తాజాగా విచారణ జరిపింది. 'రూ.20 వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నప్పుడు మళ్లీ వినియోగదారుడు విడిగా సర్వీస్ చార్జీ ఎందుకు చెల్లించాలి. ఎమ్మార్పీ కంటే ఎక్కువ తీసుకుంటారా.. అదనంగా రూ.80 ఎందుకివ్వాలి..?' అని రెస్టారెంట్ల సంఘాలను ప్రశ్నించింది. వాదనలు నమోదు చేసుకున్న కోర్టు.. విచారణను సెప్టెంబరు 22కి వాయిదా వేసింది.

భార్యకు నిప్పంటించి హత్య

అదనపు కట్నం కోసం నోయిడాలో భర్త, అత్తింటి వారి దురాగతం

» చికిత్స పొందుతూ బాధితురాలి మృతి

» హత్య వీడియో వైరల్.. భర్త విపిన్, అత్త అరెస్టు.. పరారీలో మామ, మరిది



నిక్కీ, విపిన్(ఫైల్)

నోయిడా, ఆగస్టు 24: అదనపు కట్నం కోసం భార్యను అతి కిరాతకంగా హింసించాడు. జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లాడు. అంతటితో ఆగకుండా.. తన తల్లిదండ్రులతో కలిసి.. థిన్నర్ చల్లి, నిప్పంటించి చంపేశాడు. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఈ దారుణం చోటుచేసుకోగా.. పోలీసులు భర్తను అరెస్టు చేసి, సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా ఇన్‌స్పెక్టర్ పిస్టల్ లాక్కొని, పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో నిందితుడి కాలికి గాయమైంది. నోయిడా అదనపు డీసీపీ సుధీర్‌కుమార్, బాధితురాలి తండ్రి భికారీ సింగ్ పాయ్లా కథనం ప్రకారం.. సిర్సా చౌరాహా ప్రాంతానికి చెందిన సత్యవీర్, దయా దంపతుల కుమారుడు విపిన్ భాటీతో.. భికారీ సింగ్ కుమార్తె నిక్కీని ఇచ్చి ఏడేళ్లక్రితం వివాహం చేశారు. వీరికి ఆరేళ్ల కుమారుడున్నారు. పెళ్లి సమయంలో విపిన్ కోరినట్లు కట్నంతోపాటు ఒక స్కార్పియో వాహనాన్ని ఇచ్చామని భికారీ సింగ్ తెలిపారు. ఆ తర్వాత బుల్లెట్ బైక్ అడిగితే.. కొనిచ్చామని పేర్కొన్నారు. కొంత కాలం క్రితం తమ కుటుంబం కోసం మెర్సిడెస్ కారును కొన్నట్లు వివరించారు. అప్పటి నుంచి విపిన్ తనకు కూడా ఆ కారును కొనివ్వాలని పట్టుబట్టాడని, రూ.36 లక్షల అదనపు కట్నం ఇవ్వాలంటూ తమపై ఒత్తిడి తీసుకువచ్చాడని చెప్పారు. ఈ క్రమంలో గురువారం నిక్కీని ఆమె భర్త, అత్తమామలు హింసించారు. అంతటితో ఆగకుండా.. థిన్నర్ చల్లి నిప్పంటించి పారిపోయారని పోలీసులు తెలిపారు. ఇరుగుపొరుగు వారు బాధితురాలిని ఫోర్టిస్ ఆస్పత్రికి తరలించారు. 70% కాలిన గాయాలవ్వడంతో.. అక్కడి నుంచి సఫ్దార్‌జంగ్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే నిక్కీ చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. నిక్కీపై విపన్, అత్తమామల దాడి దృశ్యాల వీడియో వైరల్ అయ్యింది. పోలీసులు విపిన్, అతని తల్లి దయాను అరెస్టు చేశారు. విపిన్ తండ్రి సత్యవీర్, సోదరుడు రోహిత్ పరారీలో ఉన్నారు.

నిందితుడిపై కాల్పులు

పోలీసులు శనివారం సాయంత్రం విపిన్‌తో సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో భాగంగా.. హత్యకు ఉపయోగించిన థిన్నర్ బాటిళ్లను స్వాధీనం చేసుకునేందుకు సిర్సా చౌరాహాకు చేరుకున్నారు. అక్కడ విపిన్ ఓ ఇన్‌స్పెక్టర్ నుంచి పిస్టల్‌ను లాక్కొని, పోలీసుల వైపు గురిపెట్టి.. పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకొని విపిన్ కాలిపై కాల్పులు జరిపారు. అతని కాలికి బుల్లెట్ గాయమైంది. కాగా, ఆస్పత్రి వద్ద విపిన్‌ను మీడియా మాట్లాడించగా.. అతనిలో ఏమాత్రం పశ్చాత్తాపం కనిపించలేదు. "నేను తప్పు చేయలేదు. నా భార్యను చంపలేదు. ఆమె తనకుతానుగా నిప్పంటించుకుంది" అని చెప్పారు.

ఎన్‌కౌంటర్ చేయాలి

అదనపు కట్నం కోసమే విపిన్ తన కూతురిని పొట్టనబెట్టుకున్నాడని నిక్కీ తండ్రి భికారీ సింగ్ పాయ్లా అన్నారు. నిక్కీ ఆరేళ్ల కుమారుడు కూడా.. "మా అమ్మపై ఏదో చల్లారు. ఆ తర్వాత లైటర్‌తో నిప్పంటించారు" అని పోలీసులకు వాంగ్మూలమిచ్చాడు. భికారీసింగ్ మీడియాతో మాట్లాడుతూ.. "యోగి సర్కారు మాకు న్యాయం చేస్తుందని భావిస్తున్నాను. నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలి. వారి ఇంటిని బుల్‌డోజర్‌తో కూల్చివేయాలి. లేనిపక్షంలో మేము నిరవధిక నిరాహారదీక్షకు దిగుతాం" అన్నారు.

మొదటిసారి రుణం తీసుకునేవారికి

కనీస సిబిల్ స్కోర్ అక్కర్లేదు

» రుణ దరఖాస్తులకు కనీస క్రెడిట్ స్కోర్‌ను ఆర్బీఐ సూచించలేదు

» కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి



న్యూఢిల్లీ, ఆగస్టు 24: మొదటిసారి బ్యాంకు రుణం తీసుకునే వారికి కనీస సిబిల్ స్కోర్ అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గత వారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మాట్లాడుతూ.. మొదటిసారి రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి క్రెడిట్ స్కోర్ తక్కువగా లేదా సున్నాగా ఉంటే రుణ దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించరాదన్నారు. ఈ సందర్భంగా ఆర్బీఐ ఇచ్చిన ఆదేశాలను ఆయన ప్రస్తావించారు. కేవలం క్రెడిట్ చరిత్ర లేదన్న కారణంతో మొదటిసారి రుణం తీసుకునే వారి రుణ దరఖాస్తును బ్యాంకులు తిరస్కరించరాదని ఆర్బీఐ సూచించినట్టు తెలిపారు. రుణ దరఖాస్తులకు ఆర్బీఐ కనీస క్రెడిట్ స్కోర్‌ను ఏమీ సూచించలేదన్నారు. మొదటిసారి రుణం తీసుకునే వారికి సిబిల్ స్కోర్ తప్పనిసరి కాకపోయినప్పటికీ దరఖాస్తుదారుల నేపథ్య తనిఖీని నిర్వహించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంకులను కోరింది. వీటిలో క్రెడిట్ చరిత్ర, గత చెల్లింపుల చరిత్ర, చెల్లింపుల్లో జాప్యం, రుణాల సెటిల్‌మెంట్ వంటివి ఉంటాయి. కాగా క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు(సీఐసీ) ఒక వ్యక్తికి క్రెడిట్ రిపోర్టులను ఇవ్వడానికి రూ.100 వరకు చార్జీని వసూలు చేయవచ్చని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అంతకు మించిన మొత్తం ఆమోదనీయం కాదన్నారు.

సిబిల్ స్కోర్ అంటే?

సిబిల్ అంటే.. క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఇండియా) లిమిటెడ్. సిబిల్ స్కోర్ అనేది క్రెడిట్ యోగ్యతను నిర్ణయించే మూడంకెల సంఖ్య. ఈ స్కోర్ 300 నుంచి 900 వరకు ఉంటుంది. వ్యక్తిగత, బంగారం, గృహ, ఇతర బ్యాంకు రుణాలను తీసుకోవడానికి ఒక వ్యక్తి అర్హతను నిర్ణయించడానికి గాను సిబిల్ ఇచ్చే స్కోర్‌ను బ్యాంకులు వినియోగిస్తుంటాయి. స్కోరు 750అంతకంటే మెరుగ్గా ఉంటే పలు రుణాల ఆమోదానికి అర్హత ఎక్కువగా ఉంటుంది.

ప్రమాదం అంచుల్లో రాజ్యాంగం!

» తమిళనాడు నేతలతో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న స్టాలిన్

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశంలో సమాఖ్యవాదం, రాజ్యాంగం ప్రమాదపుటంచుల్లో ఉన్నాయని, తనను గెలిపిస్తే రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని విపక్ష ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో తమిళనాడు ఎంపీల మద్దతు కోరేందుకు ఆయన ఆదివారం చెన్నై వచ్చారు. సాయంత్రం డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్, ఆ పార్టీ మిత్రపక్షాల నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ తమిళనాడును దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా స్టాలిన్ ముందుకు నడిపిస్తున్నారని, విద్య, వైద్య రంగాలలో తమిళనాడు ప్రథమ స్థానంలో ఉందని ప్రశంసించారు. రాష్ట్ర హక్కుల కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్య లోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. భారతదేశం, రాజ్యాంగం గురించి తెలియని వారంతా ఒకే దేశం అంటూ నినాదాలు చేస్తున్నారని, ఒకే దేశం అంటే రాష్ట్రాలు కూడా ఉన్నాయనే విషయాన్ని మరచిపోతున్నారని పేర్కొన్నారు.

సాగర్‌లో కృష్ణమ్మ పరవళ్లు

» భారీగా తరలివచ్చిన పర్యాటకులు

» 'శ్రీశైలం'కు స్వల్పంగా తగ్గిన వరద

నాగార్జునసాగర్/కేతేపల్లి/గద్వాల/మహదేవపూర్ రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఓవైపు కృష్ణమ్మ పరవళ్లు.. మరోవైపు పర్యాటకుల కేరింతలు సాగర్‌లో కనువిందు చేస్తున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో సాగర్ పరిసరాలు పర్యాటకులతో సందడిగా మారాయి. సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, విజయవిహార్, కొత్తవంతెన, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంవద్ద పర్యాటకుల రద్దీ నెలకొంది. ఏపీ-తెలంగాణ సరిహద్దులో కొత్త వంతెన వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల వారం రోజులుగా కొనసాగుతోంది. సాగర్‌కు ఎగువ నుంచి 4,16,324 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 585 అడుగులు(297.4350టీఎంసీలు)గా ఉంది. సాగర్‌నుంచి కుడి కాల్వ ద్వారా 9,019 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 7,518 క్యూసెక్కుల నీటిని, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,373 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని, 26 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి 3,63,714 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రానికి 1,702.87 క్యూసెక్కులుగా నమోదైంది. మరోవైపు ప్రాజెక్టు నీటిమట్టం 643.45అడుగుల గరిష్ఠస్థాయికి చేరడంతో ప్రాజెక్టు అధికారులు ప్రాజెక్టు 2, 3, 8వ నెంబరు క్రస్టుగేట్లను అడుగు మేర ఎత్తి 1,935.51క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉధృతి స్వల్పంగా తగ్గింది. ప్రాజెక్టుకు 4.65 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. 10 గేట్లను 16 పీట్ల మేరకు ఎత్తి 3,80,380 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 61,711 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 195.66 టీఎంసీల నిల్వ ఉన్నది. ప్రస్తుతం జూరాలకు 3.72లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 37గేట్లను ఎత్తి 3,53,573 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.



నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్‌గేట్ల నుంచి కిందికి ప్రవహిస్తున్న కృష్ణమ్మ

మేడిగడ్డ బ్యారేజీలోకి 4.40 లక్షల క్యూసెక్కులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 4.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 5.6 మీటర్లుగా నమోదైంది.



సోషల్ మీడియా వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

» ఆ దిశగా బీజేపీ సోషల్ మీడియా పనిచేయాలి

» బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రేమ్ శుక్లా

» గిట్టని వారు పార్టీలో విభేదాలు సృష్టిస్తారు

» కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలి: రాంచందర్‌రావు

చంపాపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలని, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటే లక్ష్యంగా పార్టీ సోషల్ మీడియా పని చేయాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, పార్టీ సోషల్ మీడియా జాతీయ కన్వీనర్ ప్రేమ్ శుక్లా అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడానికి స్థానిక సంస్థల ఎన్నికలే తొలిమెట్టు అని తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేయాలని కోరారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్‌లోని పిండి పుల్లారెడ్డి గార్డెన్‌లో ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల బీజేపీ మీడియా, ఐటీ సోషల్ మీడియా రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్ శుక్లా మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీజేపీ ఘన విజయానికి సోషల్ మీడియా ప్రధాన ఆయుధం అని అన్నారు. ఆరు గ్యారంటీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సోషల్ మీడియా కార్యకర్తలను కోరారు. గిట్టని వారు పార్టీలోనే విభేదాలు సృష్టిస్తారని, అటువంటి వాటి పట్ల కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నేడు వారిని తలాతోక లేని వారిగా పోల్చడం సమంజసం కాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లోటుపాట్లతో పాటు కాంగ్రెస్ నేతల అవినీతి, అక్రమాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని, పనులు మాత్రం గడప దాటడం లేదని ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

నేడు నిజామాబాద్‌కు రాంచందర్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సోమవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11.30గంటలకు జరిగే పార్టీ కార్యకర్తల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం జిల్లా పదాధికారుల సమావేశానికి హాజరవుతారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు.

ఆర్ఎస్ఎస్ ప్రార్థనాగీతం పాడితే తప్పేంటి?

» ఆలపించి కొనియాడిన కాంగ్రెస్ ఎమ్మెల్యే రంగనాథ్

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కుణిగల్ ఎమ్మెల్యే హెచ్‌డీ రంగనాథ్ ఆర్ఎస్ఎస్ ప్రార్థనాగీతాన్ని పాడి కొనియాడారు. కుణిగల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'నమస్తే సదావత్సలే మాతృభూమి...' చాలా మంచి గీతం అని పేర్కొన్నారు. శాసనసభలో ఉపముఖ్యమంత్రి ఆలపించిన తర్వాత తాను విన్నానని, గీతం అర్థాన్ని చదివానన్నారు. మాతృభూమికి నమస్కరించాలని అర్థమని, అందులో తనకు ఎటువంటి తప్పు అనిపించలేదని వివరించారు. ఆర్ఎస్ఎస్ ప్రార్థనా గీతం పాడితే తప్పేం ఉందని ఆయన ప్రశ్నించారు. తమది సెక్యులర్ పార్టీ అనీ, ఇతరుల నుంచి మంచిని స్వీకరించాలన్నారు. బీజేపీ... మతాన్ని విభజించాలని భావిస్తోందని, తాము అందుకు వ్యతిరేకమన్నారు. బీజేపీ సిద్ధాంతాలను ఎప్పటికీ తాము అంగీకరించమన్నారు.

బెట్టింగ్ కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు 28వరకు కస్టడీ

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ కేసులో కాంగ్రెస్ చిత్రదుర్గ ఎమ్మెల్యే వీరేంద్రపప్పి (50)ని ఈనెల 28వ తేదీ వరకు ఈడీ కస్టడీకి ప్రజాప్రతినిధుల కోర్టు అప్పగించింది. ఎమ్మెల్యేను సిక్కింలో అరెస్టు చేసిన ఈడీ అధికారులు ఆదివారం బెంగళూరుకు తీసుకొచ్చారు. కెంపేగౌడ విమానాశ్రయం టర్మినల్2లోకి రాగానే స్థానిక అధికారులు బందోబస్తు మధ్య తరలించి, ప్రజాప్రతినిధుల కోర్టులో హాజరు పరిచారు. అనంతరం ఈడీ కార్యాలయానికి తరలించి, విచారణ ప్రారంభించారు.

అండాల కోసం ఆందోళన!

(మొదటిపేజీ తరువాయి)

వేగం లేకపోవడాన్ని పక్కనపెడితే.. మహిళల్లో ఆరోగ్యకరమైన అండాల విడుదలలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. గతంలో.. 30ఏళ్లు దాటిన మహిళల్లో ఈ సమస్య ఉంటే.. ఇప్పుడు 20-30ఏళ్ల మధ్య వయసున్న వారిలోనూ ఇబ్బందులు కనిపిస్తున్నాయి. ప్రతీ నాలుగు జంటల్లో ఒకటి అండాలు విడుదల కాకపోవడం.. ఒకవేళ విడుదలైనా ఆరోగ్యకరంగా లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటోంది. ఇలాంటి జంటలు ఐయూఐ, ఐవీఎఫ్, సరగసీ పద్ధతులను ఎంచుకుంటున్నాయి. అండాలు అవసరమైన దంపతుల సంఖ్య వేలల్లోఉంటే.. దాతలు మాత్రం పదుల్లో ఉంటున్నారు. ఈ పరిస్థితులను దళారులు ఆసరాగా తీసుకుంటూ దందాకు దిగుతున్నారు.

ఇదీ పద్ధతి..

ఆరోగ్యకరమైన దంపతుల్లో పెళ్లైన రెండేళ్లలోపే సంతానం కలుగుతుంది. ఆ తర్వాత సంతానం కలగకుంటే.. హార్మోన్ ఇంజక్షన్ల ద్వారా ప్రయత్నిస్తామని వైద్యనిపుణులు చెబుతున్నారు. అప్పటికీ సంతానసాఫల్యం కలగకుంటే.. కృత్రిమ మార్గాలను సూచిస్తామంటున్నారు. "తొలుత ఇంట్రా యుటెరైన్ ఇన్‌సెమినేషన్(ఐయూఐ) పద్ధతిని సూచిస్తాం. భర్తనుంచి సేకరించిన వీర్యకణాల్లో చురుగా ఉండేవాటిని ల్యాబ్‌లో వేరుచేస్తాం. వాటిని భార్య గర్భాశయంలోకి ప్రవేశపెడతాం. దీంతో గర్భధారణకు అవకాశాలుంటాయి. ఈ పద్ధతి విఫలమైతే.. ఇన్‌విట్రో ఫర్టిలైజేషన్(ఐవీఎఫ్)ను ప్రారంభిస్తాం. అంటే భార్య అండాన్ని, భర్త వీర్యాన్ని ల్యాబ్‌లో ఫలదీకరణ చేసి.. భార్య గర్భాశయంలో ప్రవేశపెడతాం. ఐవీఎఫ్ కూడా విఫలమైతే సరగసీ పద్ధతిని ఆశ్రయించాల్సి ఉంటుంది" అని ఫర్టిలిటీ కేంద్రాల నిపుణులు తెలిపా

దాతలు లేక.. దళారుల దందా

సరగసి చట్టం-2021 మేరకు ఇద్దరు పిల్లలుండి..



23-33 ఏళ్ల వయసున్న వివాహిత ఒక్కసారి మాత్రమే అండాన్ని దానం చేయాలి. దాతకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండకూడదు. జన్యుపరమైన లోపాలు ఉండేవారు అండదానానికి అనర్హులు. అండదానం తర్వాత కలిగే సంతానంపై దాతకు ఎలాంటి హక్కు ఉండదు. ఆరోగ్యవంతమైన వివాహితలు స్వచ్ఛందంగా అండదానం చేయొచ్చు. అండదానంపై అపోహల కారణంగా చాలా తక్కువ మంది మాత్రమే ముందుకు వస్తుంటారు. దీంతో సంతానార్థులైన దంపతులు దాతల కోసం కొన్నేళ్ల పాటు ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ పరిస్థితులను దళారులు అవకాశంగా మార్చుకుంటారు. మహిళా ఏజెంట్లను రంగంలోకి దింపి.. కాలేజీలకు వెళ్లే అవివాహిత యువతులకు వల వేస్తుంటారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుని.. ఎంతో కొంత డబ్బు ఇచ్చి అండాలను సేకరిస్తారు. సంతానసాఫల్యం కోసం ఎదురు చూసే దంపతులకు ఒక్కో అండాన్ని రూ.25 వేల నుంచి రూ.30 వేలకు విక్రయిస్తుంటారు. కొందరు వివాహిత దాతలు సులభంగా డబ్బు సంపాదించేందుకు వేర్వేరు ఫర్టిలిటీ కేంద్రాల్లో అండాలను దానం చేస్తుంటారు. కాలేజీ అమ్మాయిలు కూడా ఇందుకు అతీతం కాదు. ఎక్కువ అండాలు విడుదలయ్యేందుకు ఇచ్చే హార్మోన్ ఇంజక్షన్లతో వీరి ఆరోగ్యం దెబ్బతింటుందని, భవిష్యత్‌లో వీరిలోనూ అండాలు విడుదల కాని పరిస్థితులు నెలకొంటాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

ముందు చూపుతో అండాలు ఫ్రీజ్..

కొందరు సెలబ్రిటీలు, ఐటీ ఉద్యోగులు, సంతానసాఫల్యంపై అవగాహన ఉన్నవారు తమ అండాలను ఫ్రీజ్ చేయిస్తున్నారు. కెరీర్ కోసం అప్పుడే పిల్లలు వద్దనుకునేవారు ఈ కోవలో ఉంటున్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులున్న వారు కూడా యుక్తవయసులోనే ఆరోగ్యకరమైన అండాలను ఫ్రీజ్ చేయించుకుంటున్నారు. ఇలా ఫ్రీజ్ చేసిన అండాలను పదేళ్లలో ఎప్పుడైనా వాడుకుని, సంతానాన్ని పొందవచ్చు.

15-20% మందిలో అండాలలేమి!

సంతానం కోసం తమ వద్దకు వచ్చే మహిళల్లో 15-20% మందిలో అసలు అండాలే విడుదలవ్వడం లేదని హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ సంతానసాఫల్య కేంద్రానికి చెందిన మహిళా డాక్టర్ వెల్లడించారు. తమ పేరు ప్రచురించడానికి ఇష్టపడని ఆ వైద్యురాలు.. 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలను పంచుకున్నారు. 20 ఏళ్ల వయసున్న వారికీ అండాల సమస్య ఏర్పడుతున్నట్లు తెలిపారు. జీవనశైలి, ఒత్తిళ్లు, కాలుష్యం వంటి కారణాలతో ఆరోగ్యకరమైన అండాలు విడుదల కావడం లేదని వెల్లడించారు. అండదానంపై మహిళలకు అవగాహన ఉండటం లేదని వివరించారు. సంతానార్థులైన దంపతులకు అండదానం ఒక వరమని అభిప్రాయపడ్డారు.

విమెన్ 'జస్టిస్'లో తెలంగాణ టాప్

తెలంగాణ హైకోర్టులో 30లో 10 మంది మహిళా జడ్జిలు.. సిక్కింలో ముగ్గురు జడ్జిల్లో ఒకరు మహిళ

» 'సెంటర్ ఫర్ లా అండ్ పాలసీ రిసెర్చ్' నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మహిళా న్యాయమూర్తుల సంఖ్యలో తెలంగాణ హైకోర్టు దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం 30 మంది జడ్జిలకు గాను.. 10 మంది మహిళా న్యాయమూర్తులున్నారు. అంటే.. జడ్జిల సంఖ్యలో మహిళల వాటా 33.3%. ఆ తర్వాతి స్థానంలో సిక్కిం హైకోర్టు ఉంది. అక్కడ ముగ్గురు జడ్జిల్లో ఒకరు మహిళ (33.3%). ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 9వ స్థానంలో ఉంది. ఏపీలో 30 మంది జడ్జిల్లో ఐదుగురు మహిళలున్నారు. సుప్రీంకోర్టులో 33 మంది న్యాయమూర్తుల్లో ఇద్దరు(6.06%) మాత్రమే మహిళలు ఉండడం గమనార్హం.! ఈ మేరకు 'సెంటర్ ఫర్ లా అండ్ పాలసీ రిసెర్చ్" అనే సంస్థ 'ఈక్వల్ జస్టిస్' పేరుతో ఓ నివేదికను విడుదల చేసింది.

సుప్రీంకోర్టులో ఇలా..

సుప్రీంకోర్టు ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు ప్రస్తుతం ఉన్నవారితో కలిపి మొత్తం 279 మంది జడ్జిలు పనిచేస్తే.. వారిలో మహిళల వాటా 11 మాత్రమే..! 1989లో జస్టిస్ ఫాతిమా సుప్రీంకోర్టు జడ్జిగా సేవలందించిన తొలి మహిళ కాగా.. 58 సంవత్సరాల వయసులో సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ రూమాపాల్ అతి పిన్నవయస్కురాలైన జడ్జిగా చరిత్ర పుటల్లో నిలిచిపోయారు. 2013లో తొలిసారి జస్టిస్ రంజనా దేశాయ్, జస్టిస్ సుధామిశ్రాతో మొదటి మహిళా బెంచ్ ఏర్పాటైంది. జస్టిస్ ఎన్వీ రమణ హయాంలో మాత్రమే ఏకకాలంలో సుప్రీంకోర్టులో ముగ్గురు మహిళా న్యాయమూర్తులు– జస్టిస్ హిమాకోహ్లి, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ బేలా.ఎం. త్రివేది పనిచేశారు. ఈ ముగ్గురితో 2021 ఆగస్టు 31న జస్టిస్ ఎన్వీ రమణ ప్రమాణస్వీకారం చేయించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) నుంచి ఇప్పటి వరకు నేరుగా తొమ్మిది మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణస్వీకారం చేయగా.. వారిలో జస్టిస్ ఇందు మల్హోత్రా(2018) మాత్రమే మహిళా జడ్జి. ఇప్పటి వరకు 51 మంది భారత ప్రధాన న్యాయమూర్తులు(సీజేఐ)గా సేవలందిస్తే.. వారిలో ఒక్క మహిళ కూడా లేరు. 2027లో జస్టిస్ బీవీ నాగరత్నకు సీజేఐగా అవకాశం దక్కనుంది. 36 రోజుల పాటు సీజేఐగా ఉండనున్నారు. ఆమె తొలి మహిళా సీజేఐగా చరిత్రకెక్కనున్నారు.



హైకోర్టుల్లో..

1937లో జస్టిస్ అన్నాచాందీ దేశంలోనే మొదటి న్యాయమూర్తిగా ఉన్నారు. ఆమె కేరళలోని ఓ జిల్లా కోర్టులో న్యాయమూర్తిగా సేవలందించారు. హైకోర్టుకు సీజే అయిన మొదటి మహిళగా జస్టిస్ లీలా సేథ్(1991) ఉన్నారు. ఆమె హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టులో సేవలందించారు. సిక్కిం, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిసా, మధ్యప్రదేశ్, బిహార్ హైకోర్టుల్లో ఒక్కొక్కరు చొప్పున మహిళా న్యాయమూర్తులు సేవలందిస్తున్నారు. ఉత్తరాఖండ్, త్రిపుర, మేఘాలయ హైకోర్టుల్లో అసలు మహిళా జడ్జిలే లేరు. మధ్యప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, గువాహటి, సిక్కిం, మణిపూర్ హైకోర్టులలో ఇప్పటి వరకు ఒక్కరు కూడా బార్ కౌన్సిల్(న్యాయవాద వృత్తి) నుంచి నేరుగా మహిళా న్యాయమూర్తులుగా నియమితులవ్వకపోవడం గమనార్హం..!

వివిధ హైకోర్టుల్లో మహిళా జడ్జిల సంఖ్య ఇలా

హైకోర్టు	మొత్తం జడ్జిలు	మహిళా జడ్జిలు
తెలంగాణ	30	10 (33.3%)
సిక్కిం	3	1 (33.3%)
మణిపూర్	4	1 (25%)
గుజరాత్	32	8 (25%)
పంజాబ్, హర్యానా	53	13 (24.53%)
ఢిల్లీ	41	10 (24.39%)
మద్రాస్	65	14 (21.54%)
గువాహటి	25	5 (20%)
ఆంధ్రప్రదేశ్	30	5 (16.67%)
బొంబే	66	11 (16.67%)
కర్ణాటక	50	8 (16%)
కోల్‌కత్తా	44	7 (15.91%)
జమ్మూకశ్మీర్	15	2 (13.33%)
రాజస్థాన్	34	3 (8.82%)
హిమాచల్‌ప్రదేశ్	12	1 (8.33%)
కేరళ	44	3 (6.82%)
ఝార్ఖండ్	16	1 (6.25%)
ఛత్తీస్‌గఢ్	16	1 (6.25%)
ఒడిసా	17	1 (5.56%)
అలహాబాద్	79	3 (3.80%)
మధ్యప్రదేశ్	31	1 (2.94%)
బిహార్	34	1 (2.94%)
ఉత్తరాఖండ్	9	0 (0%)
త్రిపుర	5	0 (0%)
మేఘాలయ	4	0 (0%)

పార్టీ మారినోళ్లు దమ్ముంటే రాజీనామా చేయాలి

20 నెలల్లో చేసింది చెప్పి ఎన్నికల్లో గెలవాలి

బై ఎలక్షన్లు వస్తే.. కాంగ్రెస్‌కు బై బై: కేటీఆర్



హైదరాబాద్ సిటీ/మియాపూర్/హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన ఎమ్మెల్యేలకు దమ్ముంటే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. 20 నెలల పాలనలో రేవంత్ సర్కార్ తెలంగాణ ప్రజలకు చేసిన మంచిని చూపించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. బై ఎలక్షన్లు వస్తే.. కాంగ్రెస్‌కు బై బై ఎలక్షన్ అయితదన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఓటమి భయం పట్టుకుందని పేర్కొన్నారు. మియాపూర్‌లో నిర్వహించిన శేరిలింగంపల్లి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేకు రెండు సార్లు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చి గెలిపించామని, ప్రభుత్వ విప్ లాంటి పదవులు ఇచ్చి గౌరవించుకున్నామని, అయినప్పటికీ పార్టీ మారి కాంగ్రెస్‌లోకి వెళ్లారని మండిపడ్డారు. భవిష్యత్తులో ఉపఎన్నికలు తప్పక వస్తాయని, కాంగ్రెస్‌కు రోజులు ముగియ బోతున్నాయన్నారు. కాగా, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నలువైపులా నాలుగు టిమ్స్ (తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆస్పత్రుల నిర్మాణాలను చేపట్టిందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటి నిర్మాణాలను వేగంగా పూర్తిచేసి వైద్య సేవలు ప్రారంభించాలని ఆదివారం ఎక్స్ వేదికగా కోరారు.

ఫాంహౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన కేటీఆర్!

కోలుకుంటున్న బీఆర్ఎస్ చీఫ్..

కొనసాగుతున్న వైద్య చికిత్స

తాజా రాజకీయాలపై చర్చించిన నేతలు

గజ్వేల్/మర్కుక్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తనయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు కేటీఆర్ వెళ్లారు. స్వల్ప అస్వస్థతకు గురైన కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ఆయనతో భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై వారిరువురు చర్చించినట్లు తెలిసింది. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై చర్చించినట్లు సమాచారం. కేసీఆర్ ఆరోగ్యం కాస్త కుదుటపడిందని.. షుగర్ లెవల్స్ కొంత అదుపులోకి వచ్చినట్లు తెలిసింది. వైద్య బృందం ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తూ చికిత్స కొనసాగిస్తున్నట్లు సమాచారం. మరోవైపు.. ఫాంహౌస్ వద్ద భద్రతను పెంచారు. దాదాపు అర కిలోమీటర్ ముందు నుంచే బారికేడ్లు ఏర్పాటు చేశారు. మీడియా ప్రతినిధులను కూడా రానివ్వట్లేదు.

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలి

» పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలి: పీఆర్టీయూ

కవాడిగూడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు జీ హర్షవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో పాత పెన్షన్ విధానంలోకి వెళ్లే ఆప్షన్ ఉన్నప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చి ఉపాధ్యాయులకు అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షలో ఆయన మాట్లాడారు. హిమాచల్‌ప్రదేశ్, హరియాణా రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి బి.రత్నాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు చట్టబద్ధంగానే ఇవ్వాలి: కృష్ణయ్య

బర్కత్‌పుర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను పార్టీపరంగా కాకుండా చట్టబద్ధంగా ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను పార్టీపరంగా ఇస్తామని ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ రిజర్వేషన్లపై రాజ్యాంగబద్ధంగా జీవో జారీ చేసి పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తుందని.. బీజేపీ బీసీలకు వ్యతిరేకం కాదని, ప్రస్తుతం బీసీల పార్టీగా మారిందన్నారు. ఈ నెల 29న జరగనున్న క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లను చట్టబద్ధం చేస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. చట్టం చేయకుండా ఎన్నికలకు వెళ్తే తీవ్రస్థాయిలో అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 25న ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలు వేలాదిగా తరలిరావాలని కోరారు.

వందఎలుకలు తిన్న పిల్లిలా కేటీఆర్ తీరు: అయిలయ్య

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపై కేటీఆర్ మాట్లాడుతుంటే.. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థ యాత్రలు వెళ్లినట్లుగా ఉందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు అత్యంత నిర్లజ్జగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కేటీఆర్.. ఇప్పుడు దొంగ ఏడుపులు ఏడుస్తున్నాడని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో 60 మందికిపైగా ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నప్పుడు వారితో ముందుకు రాజీనామా ఎందుకు చేయించలేదని ఆదివారం ఓ ప్రకటనలో నిలదీశారు. ఆనాడు కేటీఆర్‌కు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా.. అని ప్రశ్నించారు. ఉప ఎన్నికలు వచ్చినా గెలిపించుకునే దమ్ము తమ సీఎం రేవంత్ రెడ్డికి ఉందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకుని కేటీఆర్ తన దమ్మును నిరూపించుకోవాలని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలను రెఫరెండంగా తాము భావిస్తామని, కేటీఆర్‌కు ధైర్యముంటే సవాల్ చేయాలన్నారు. భవిష్యత్తులో కేసీఆర్, కేటీఆర్‌లకు రాజకీయ సన్యాసం తప్పదని జోస్యం చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు అవకాశం ఇస్తాం

» కేసీఆర్ బీసీ పక్షపాతి

» పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ సభలో హరీశ్

చిన్నకోడూరు/గజ్వేల్/జగదేవ్‌పూర్/హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అవకాశం ఇస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గోనెపల్లిలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహన్ని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. బీసీలకు టికెట్ల విషయంలో కాంగ్రెస్ ఇప్పుడు మాటలు చెబుతోందని, గత పంచాయతీ రాజ్ ఎన్నికల్లోనే బీసీలకు 41 శాతం టికెట్లు ఇచ్చి కేసీఆర్ బీసీల పక్షపాతిగా నిలిచారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎందరో గొప్ప పోరాట యోధుల చరిత్ర మరుగున పడిందని, తమ హయాంలోనే పాపన్నగౌడ్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చామని చెప్పారు. లండన్ విక్టోరియా మ్యూజియంలో పాపన్న గౌడ్ విగ్రహాన్ని పెట్టి బ్రిటన్ దేశం గౌరవించింది.. కానీ, మన పాలకులు గుర్తించకపోవడం బాధాకరమని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా గౌడ కులస్తులకు మద్యం దుకాణాల కేటాయింపుల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. అనంతరం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లో డెంగీతో మృతి చెందిన నాయిని శ్రావణ్, కొంతం మహేశ్ కుటుంబాలను హరీశ్ పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పారిశుధ్యం పడకేసిందని, గ్రామాల్లో విషజ్వరాలు అలుముకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహేశ్, శ్రావణ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో 26వేల మెట్రిక్ టన్నుల యూరియాను బఫర్‌లో పెట్టామని.. కానీ ఈ ప్రభుత్వం రైతులకు కనీసం 3 వేల మెట్రిక్ టన్నులు కూడా ఇవ్వలేక పోయిందని విమర్శించారు.



కర్షకులకు కాళరాత్రులు

కాంగ్రెస్ పాలన కర్షకులకు మళ్లీ కాళరాత్రులను తెచ్చిందని, రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో చెప్పినట్లుగానే ఆనాటి రోజులు గుర్తుచేస్తూ.. రైతన్నను నడిరోడ్డు మీదకు ఈడ్చారని హరీశ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. యూరియా కోసం రైతులు పీఏసీఎస్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపించారు.

కాలంపై చెరగని ఆరుద్ర ముద్రలు



ప్రపంచ రాజకీయ పరిణామాల వల్ల, ఆర్థిక కారణాల వల్ల, సంప్రదాయ పరంపరానుగత కవిత్వం, భావ కవిత్వం వంటి వాని కాల దూర అంశాల వల్ల – పుట్టి, వికసించి, విస్తృతమైన అభ్యుదయ కవిత్వ ఉద్యమంలో ఆరుద్ర వహించిన పాత్ర సాహిత్య చరిత్రాత్మకం.

వైవిధ్యాలు, వైచిత్ర్యాలు, ప్రాకృతిక సౌందర్యాలు, ఉద్యమ వైతాళిక ప్రబోధాలు, సమసమాజ స్వాప్నిక సృజనలు, జనోపయోగ రచనా ప్రయోగాలు – ఇటువంటి వాటి సమాహారం ఆరుద్ర కవిత్వం. శ్రీశ్రీ వంటి వేళ్ళ లెక్కింపు కవి శ్రేణిలో వాగ్వాణీ విలసితుడై ఠకీమని గుర్తుకు వచ్చే కవి ఆరుద్ర.

ప్రపంచ రాజకీయ పరిణామాల వల్ల, ఆర్థిక కారణాల వల్ల, సంప్రదాయ పరంపరానుగత కవిత్వం, భావ కవిత్వం వంటి వాని కాల దూర అంశాల వల్ల – పుట్టి, వికసించి, విస్తృతమైన అభ్యుదయ కవిత్వ ఉద్యమంలో ఆరుద్ర వహించిన పాత్ర సాహిత్య చరిత్రాత్మకం.

చమత్కారాలు అభివ్యక్తి సౌందర్యాలు ఆలోచనాప్రేరకాలు అని చెప్పడానికి ఆయన రాసిన 'కూనలమ్మ పదాలు' హృదయాల్లో మెదులుతాయి. జానపదాలలో పూర్వమే కొన్ని కూనలమ్మ పదాలు లభ్యమైనా, వాటి కంటె బలంగానూ ఉక్తి చమత్కృతులతోనూ వచ్చినవి ఆరుద్ర కూనలమ్మ పదాలే!

"చెలుల చీరలు దోచి/ చెల్లి చీరను కాచి/ చేసెనే లాలూచి/ ఓ కూనలమ్మా" అనడంలో వెటకారం గల పౌరాణిక పరిజ్ఞానముంది. "ఏకపత్నీ వ్రతము/ ఎలుగెత్తు మన మతము/ వేల్పు భార్యలో శతము/ ఓ కూనలమ్మా" అనడంలో సత్య దృష్టి ఉంది. "కొత్త పెండ్లము వండు/ గొడ్డు కారము మెండు/ తీపియను హజ్బెండు/ ఓ కూనలమ్మా" అనడంలో భార్యాప్రియత్వం ఉంది. పదప్రయోగ ధిషణత్వం ఉంది. "కొంటె బొమ్మల బాపు/ కొన్ని తరముల సేపు/ గుండె ఊయలలూపు/ ఓ కూనలమ్మ" అనడంలో బాపు స్థిర చిత్ర కీర్తిని మనోహరంగా చెప్పడం ఉంది. "గంగలో మునుగంగ/ పాపములు పోవంగ/ పాపియగునా గంగ?/ ఓ కూనలమ్మ" అనడంలో హేతువాదాలోచన ఉంది. ఆరుద్ర కూనలమ్మ పదాలు రాశాక ఎందరో కూనలమ్మ మకుటంతో ఆయన ప్రభావంతో ఎన్నో పదాలు రాశారు.

ఆరుద్ర చమత్కారాల పుట్ట 'ఇంటింటి పజ్యాలు'. అంత్య ప్రాసలే ఆరుద్ర వేలిముద్రలనడానికి ఇవి కారకాలవుతాయి:

"ఎన్నడైనా జార్జిబెర్నార్డ్ షా/ ఎక్కాడా సైకిల్ రిక్షా/ ఎన్నడైనా సోమర్‌సెట్ మామ్/ తిన్నాడా గులాబ్ జామ్/...

"రోజూ గీసుకోని మగాడి గడ్డం/ మోజున్న సరసానికొస్తుందా అడ్డం/... ముప్ఫయేళ్ళు దాటాక మగాడికి బొజ్జ/ తప్పకుండా వస్తే రాకూడదు లజ్జ/ కాలప్రవాహంలో ముప్ఫయేళ్ళ రేవు/ స్త్రీలు కూడా దాటగానే ఎక్కుతారు లావు"... ఇలాంటివెన్నో ఆశువుగా కూడా చెప్పేస్తారు ఆరుద్ర సారు.

ఎన్ని ప్రక్రియల్లో రచనలు చేసినా ఆరుద్ర మౌలికంగా కవి. తెలుగులో కైత పంటల్ని పండించిన ఆయన తమిళ కవిత్వానువాదాలన్ని చేసి, సరస్వతీ పుత్రులైన పుట్టపర్తి నారాయణాచార్యులు, విద్వద్విమర్శకుడు చల్లా రాధాకృష్ణశర్మ వంటి ఆంధ్ర తమిళ భాషా సాహిత్యవేత్తల ప్రశంసలు పొందారు. రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి నన్నయ్య భారత భాగాంధ్రానువాదం చేశాడు. ఆ రాజరాజు కుమారుడు కులోత్తుంగ చోళుని ఆస్థాన కవి జయం గొండాన్ 'కళింగత్తు సరణి' అనే తమిళ వీర రస కావ్యం రాశాడు. అందులోని కొన్ని ప్రకరణాలను ఆరుద్ర 'వెన్నెల – వేసవి' పేరిట ఆంధ్రీకరించారు. స్వీయ కావ్యమా అని భ్రమించేలా సహజానువాదం చేసి తమిళ కావ్య సుధను ఆంధ్రులచే ఆస్వాదింప జేశారు. యుద్ధ భూమి నుండి వీరులు తిరిగి వచ్చి తమ ప్రియురాళ్ళ ఇళ్ళకు వచ్చి 'తలుపు తీయమనడం' ఒక గొప్ప ప్రకరణం.

"వలరాజు కేళిలో అలసి
సొలసిన పిదప/ ఇల మరచి
మైమరచి అలవాట్లు చొప్పు
న/ వలిపెములు చుట్టుకొన
చలువ వెన్నెల తాకి/ తెల
బోవు చెలులార తలుపు
తీయండి..."

"మెల్లగా వేనలి అల్లాడ
అల్లాడ/ మేల్కొన్న నెమలి
వలె మేనాడ మేనాడ/
మిసిమి అందెల రవళి
ప్రసరించ ప్రసరించ/
మెలత చిలకల్లార తలుపు తీయండి. (వేనలి అంటే జడ).

"ఛాయ యను తన భార్య మాయమై దాగుకొన/ వేయి కరముల తోడ వదకెనో సూర్యుడన/ కాయుచుండెడి ఎండ కాకకోర్వని ధరణి/ వేయి చోట్లను పగిలి వెడద బీటలు వారె."

విశ్వజనీనమైన కవిత్వం ఏ భాషలో ఉన్నా ఆబగా గ్రోలాలనే వుంటుంది రసజ్ఞ భావుక జనానికి. పై చరణాలలోని తమిళ మహాకవి రసాత్మక కల్పనలను ఆలోచనలనూ ఆరుద్ర గారి 'అనువాద దూరదర్శని' ద్వారా మనం సమీక్షించుకోవచ్చు.

విశాఖపట్టణంలో ఆరుద్ర ఫొటోగ్రాఫర్‌గా పనిచేసిన కాలంలో తెలంగాణలో రజాకార్లచే చెరచబడిన ఒక నగ్న స్త్రీ వేదనార్తిని "నాకా సిగ్గు, నా స్త్రీత్వం ఎప్పుడో ఎప్పుడో పోయింది" అనే వార్తగా చూసి చలించిపోయాడు. రజాకార్లపై ఆయన ఆగ్రహం 'త్వమేవాహమ్' అనే అగ్రగణ్య కావ్యమై ప్రయోగాత్మక ప్రతీకాత్మక కావ్యమై విజృంభించింది. శాస్త్రజ్ఞానాన్ని కళాత్మకంగా ఎలా మలచవచ్చో చెప్పడానికి ఆరుద్ర ప్రతిభా పాండిత్యాల్ని గణించడానికీ ఈ కావ్యం బలకరంగా నిలబడింది. శ్రీశ్రీ, దాశరథి వంటి వారల విశ్లేషణలో ఇది ప్రజా రసజ్ఞ సమీపవర్తిని అయింది. "ఆంధ్రవాణి త్వమే వాహమనగ" సాగు అతులమతిక ఆరుద్రకు నతులొనర్తు' అన్నారు అభినవ పోతన వానమామలై వరదాచార్యులు. 'గాయాలూ – గేయాలూ'లో ఆరుద్ర అభ్యుదయ భావాలు పతాకస్థాయికి చేరాయి. పాలక వర్గాన్ని ప్రశ్నించే తత్త్వం ఉన్నత కేతనంగా మారింది. "పాలితుల మెదళ్ళ కుదుళ్ళు కట్టి/ వాళ్ళ చూపు దారిలో కాపలావాళ్ళను పెట్టి/ వాళ్ళ కిటికీలు మూసి మేకులు కొట్టి/ పరిపాలించబోతుంది రేపటి రాజ్యం. మొరలాలించడం అందులో పూజ్యం," అంటారు.

'సినీవాలి' కావ్యం ఆరుద్ర కీర్తిని స్థిరపరచింది. నగర జీవితానికి, మధ్యతరగతి మనస్తత్వానికీ ఒక ఆకృతి, కృతి. పదాలను కొత్తగానో మూలార్థాలతోనో వాడడం ఆరుద్రకు అలవాటు. సినీవాలి అంటే అమావాస్య నాటి చంద్ర రేఖ అని భావం. కావ్యపాత్ర అయిన సూర్యారావు నగరంలో ప్రవేశించాడు. ఆయనకు నగరంలోని షాపులు "పులితోలు కప్పుకున్న సాధు గోవులు"లా కనపడ్డాయి: "నగరం నీ ముందరి కాళ్ళ బంధం/ నగరం నీ కాలకూట మకరందం/... ఆధునిక రంగేళి యువతి లాగ/ నగరానికి మెదడు తక్కువ/ షోకులెక్కువ/ ఆశయాలు లేని/ ఆశలూ విలాసాలూ ఎక్కువ" – అనే సత్యం సూర్యారావు గ్రహించాడు. విలువలులేనితనం, స్వార్థ సంకుచిత భావాలు, ఆత్మీయతలు లేనితనం వంటివి సూర్యారావు చివరకు గమనించాడు. ఊహా ప్రేయసితో విహరించాడు, వాస్తవం గ్రహించాక చివరకు ఆత్మహత్యకు ప్రయత్నం చేశాడు. తెలుగులో శ్రీరంగం నారాయణబాబు – పఠాభి, పాశ్చాత్య సాహితీ ప్రపంచంలోని ఇలియట్ – ఎజ్రా పౌండ్ వంటివారి వారి ప్రభావం కొంతగా ఆరుద్రపై పని చేసే ఈ కావ్య సృజన వికసించింది.

సినీ కవిగా నాలుగు వేల అయిదు వందలకు పైగా పాటలు రాశారు ఆరుద్ర. నేను గొప్ప పాటనంటే నేను గొప్ప పాటనని ఎన్నెన్నో పాటలు పేర్కొనడానికి గాను ముందుకు తారాజువ్వల్లా దూసుకొస్తాయి. ఏ పెళ్ళి పందిరిలో నిలబడ్డా, "పందిట్లో పెళ్ళవుతున్నాది/ కనువిందౌతున్నాది" అనే ఆరుద్ర ఎప్పటి పాటో గుర్తుకు వచ్చి తీరుతుంది. నాస్తికుడైన ఆరుద్ర సినిమాలకై రామ సంబంధంగా రాసిన పాటలు భక్తుల గుండెల్లో సజీవంగా ఉంటూనే ఉంటాయి. "రాయినైనా కాకపోతిని రామ పాదము తాకగా/ బోయనైనా కాకపోతిని పుణ్య కావ్యము వ్రాయగా...", "శ్రీరామ నామాలు శతకోటి, ఒక్కొక్క నామం బహుతీపి," వంటివి పాత్రల తాదాత్మ్యంతో, పురాణ సంస్కృతిని ప్రతిబింబించేలా రాసిన పాటలు.

'ఆంధ్ర కేసరి' చలనచిత్రం కొన్నాళ్ళు ఆడి వెళ్ళిపోయింది. కానీ ఆ సినిమాలో ఆయన రాసిన "వేదంలా ఘోషించే గోదావరి, అమర ధామంలా శోభిల్లే రాజమహేంద్రి" అనే పాట ఎన్ని నాళ్ళ నుండో ఎన్ని ఏళ్ళ నుండో పాడబడుతూనే ఉంది. శ్రీశ్రీ, విశ్వనాథ, ఆరుద్ర, దాశరథి వంటి కవులు తాము విశ్వసించిన భావజాలం రక్తగతం అవడం వల్ల మాటలు, పాటలు, కవితలు వేటిలోనైనా ఆ సంబంధ అంశాలు వ్యక్తావ్యక్తాలుగా వచ్చి తీరతాయి. 'వేదంలా ఘోషించే గోదావరి' పాటలో, "ఆది కవిత నన్నయ్య వ్రాసెనిచ్చట" అన్నారు కాని "ఆదికవి నన్నయ్య వ్రాసెనిచ్చట" అనలేదు. కారణం– నన్నయ్య కావ్యం ఆది కావ్యమే కాని నన్నయ్య ఆది కవి కాదు అనే వాదానికి చెందినవారు ఆరుద్ర.

డిటెక్టివులు, కథలు, నవలలు, గాంధీ చరిత్రపై తోలు బొమ్మల రచన, గల్పికలు, రూపకాలు, శాస్త్రీయ గ్రంథాలు ఇలా ఎన్నో రాసినప్పటికీ, సమగ్రాంధ్ర సాహిత్యం వంటి అసమాన అపూరూప సాహిత్య చరిత్ర రాసినప్పటికీ మౌలికంగా ఆయన ఆత్మ సందర్శనం కవిత్వంలోనే అనిపిస్తుంది. అడుగిడినట్టి ప్రక్రియల్లో అద్భుతాలు సృష్టించారు. రసోత్తమ స్థాయి గల జానపద పాటకి దీటుగా ఆయన రాసిన "కొండగాలి తిరిగింది/ గుండె వూసులాడింది" పాటలో "పడుచుదనం అందానికి తాంబూలమేసింది," అన్న వాక్యాన్ని భావుకతతో ఆగి చదువుకుంటే, ఆనందంతో గుండె రసాత్మకమైన ఏదో వెలితి కలిగి నిండిపోదూ!

1925 ఆగస్టు 31వ తేదీన విశాఖపట్టణంలో పుట్టి పెరిగి సాహిత్య కవిత్వ కారణ జన్ముడై విజృంభించిన ఆరుద్ర మదరాసులో 1998 జూన్ 4వ తేదీన సర్గస్థులు కాలేదు, శాశ్వత కీర్తిశేషులయ్యారు. "ప్రాప్తమున్న తీరానికి పడవ సాగిపోయింది," అన్నట్టుగా.

(ఆగస్టు 31న ఆరుద్ర శతజయంతి)

■ గౌతమీ పుత్ర
✆ 92920 55531

సోమవారం 25 ఆగస్టు 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'తలపుల పుటలు' కవిత్వ సంపుటి

తెరవే కరీంనగర్ ఆధ్వర్యంలో బూర్ల వెంకటేశ్వర్లు కవిత్వ సంపుటి 'తలపుల పుటలు' ఆవిష్కరణ సభ ఆగస్టు 25 సాయంత్రం కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరుగుతుంది. అధ్యక్షత సి.వి.కుమార్, ముఖ్య అతిథి అన్నవరం దేవేందర్, ఆవిష్కర్త నగునూరి శేఖర్, పుస్తక పరిచయం తోట నిర్మలా రాణి. అతిథులుగా కొండి మల్లారెడ్డి, కల్వకుంట్ల రామకృష్ణ, కందుకూరి అంజయ్య తదితరులు పాల్గొంటారు.

సి. వి. కుమార్

'ముందడుగు' నాటక ప్రదర్శన

రసరంజని ఆధ్వర్యంలో సమాహార థియేటర్ గ్రూప్ సమర్పణలో వాసిరెడ్డి భాస్కర రావు, సుంకర సత్యనారాయణ 1945లో రాసిన 'ముందడుగు' నాటకం ప్రదర్శన రత్నశేఖర్ దర్శకత్వంలో ఆగస్టు 25 సా.6.45ని.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సంగీతం వంశీమోహన్, రైటింగ్ కావలి రాజశేఖర్, సెట్స్ సురభి జయవర్ధన, మేకప్ బాబూ రావు సంస్థ, స్టేజ్ మేనేజర్లు మాధవ్ రెడ్డి, భార్గవ్ కళ్యాణ్.

రసరంజని

మునిపల్లె శతజయంతి సదస్సు

సాహిత్య అకాడమీ నిర్వహణలో మునిపల్లె రాజు శత జయంతి సదస్సు ఆగస్టు 30 ఉ.10 గం.టల నుంచి ఎస్.వి.కె.పి & డా. కె.యస్. రాజు ఆర్ట్స్ & సైన్స్ కాలేజ్, పెనుగొండ, పశ్చిమగోదావరి జిల్లాలో జరుగుతుంది. కె. శ్రీనివాసరావు, సి. మృణాళిని, చినవీరభద్రుడు, వై.వి.వి. అప్పారావు, టి. నాగిరెడ్డి, కె. లక్ష్మీప్రసన్న, కలిదిండి రామచంద్ర రాజు, వి. లవకుమార్ తదితరులు పాల్గొంటారు. ఉష మునిపల్లె, రంకిరెడ్డి రామ మోహన రావు, కానుకొల్లు బాలకృష్ణ, కాకుమాని శ్రీనివాసరావు, బిహెచ్‌వి రమాదేవి పత్ర సమర్పణ చేస్తారు.

సి. మృణాళిని

'దాపు' కవిత్వ సంపుటి

సృజన సాహితి ఆధ్వర్యంలో మునాసు వెంకట్ కవిత్వ సంపుటి 'దాపు' ఆవిష్కరణ ఆగస్టు 31 ఉ.10గం.లకు నల్లగొండలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా ఆయన నివాసంలో జరుగుతుంది. సభాధ్యక్షులు బెల్లి యాదయ్య, విశిష్ట అతిథి గోరటి వెంకన్న, గౌరవ అతిథి అంబటి సురేందర్ రాజు, ప్రత్యేక ఆహ్వానితులు గుంటూరు లక్ష్మీనరసయ్య, ఆత్మీయ అతిథులు సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సిద్ధార్థ తదితరులు.

పెరుమాళ్ళ ఆనంద్



నీలి గోడల వెలుతురు నీడ

మీరెప్పుడైనా గమనించారా
ఖాళీ చేసిన ఇంటి గోడలు మాట్లాడుకోవటం
క్రీస్తులా గుండెల్లో దిగేసిన మేకుల బాధలతో
మనుషుల జ్ఞాపకాల ఊసులు మోసిన బావాలతో
మౌనగళాలు విప్పి నిశ్శబ్ద భాషలో చర్చించుకోవటం
నిన్నటి కళాకాంతుల కొట్టాడై ధగధగలాడిన
కుడ్య వదనాలు నిర్జీవ శవకళతో మూగరోదనైన సందర్భాలు
చాకలిపద్దుల వివరాలతో
పాలవాడి గైర్హాజరు తేదీలతో
ఇంటి ఇల్లాలికి జవాబుదారీగా ఉన్న రోజులు
ఎంత బాధ్యతని చిరునవ్వుతో మోశాయో!

దేవుడి పటాలను తమకు వారగా ఆనించి
మంత్రోచ్చారణలతో ధూపదీప నైవేద్యాలతో చేసిన పూజలు
గోడలకు వేలాడ దీసిన తాత ముత్తాతల జ్ఞాపకాలు
ఇల్లు ఖాళీ చేసినంత సులువుగా మర్చిపోగలవేనా ఆ స్మృతులు
బుడిబుడి అడుగుల హంసలు
రంగుల చాక్‌పీసులతో
తమ ఒంటి నిండా చేసిన సంతకాలన్నీ
తమని అజంతా ఎల్లోరా గుహల కోవలో నిలబెట్టి
గర్వంగా తలెత్తుకునేలా చేసిన అమృత గడియలు.

ఏ గోడైతే యేంటి మిత్రమా!
కోటగోడైనా, ఇంటి గోడైనా
మనిషి తలదాచుకున్న చరిత్రకి ఆనవాలే కదా!
తాజ్‌మహలు గోడలు ప్రేమ ప్రతీకలైతే
ఇంటి గోడలు వాత్సల్యోద్వేగాల అనురాగ గీతికలే కదా!
గోడలంటే తట్టెడు రాళ్ల దోసెడు సిమెంట్ మాత్రమే కాదు
నాలుగు గోడలు తమ నెత్తి మీద ఒక కప్పుని మోస్తూ
అమ్మ మాయ తిత్తిలో
కలల నెలవంకని కాపాడినంత ఆప్యాయంగా
ఇంటిల్లిపాదినీ కాపాడే సైనిక శిబిరం
కూలిపోయిన మొండిగోడలైనా
మానవ జీవన యాన మహాయాత్రకి మౌనసాక్షి
మనిషిని కాపలా కుక్కలా రక్షించిన అహింసాయుధం
నాగరికతని చాటిచెప్పిన ఇళ్ళూ మహళ్ళూ భవనాలే లేకపోతే
ఈ భువన భాండమంతా నరసంచార కీకారణ్యమే కదా!
చీని చీనాంబరాలే కాదు,
చుట్టూ సరిహద్దు గోడే చైనా ప్రజానీక రక్షణ వ్యూహం
నిన్నగాక మొన్న కూల్చేసిన బెర్లిన్ గోడే కదా
మనుషులందరి మనసుల్ని కలిపి కుట్టిన పూలమాల
స్వాతంత్ర్య సమరోద్యమ స్ఫూర్తి ప్రదాతలు
ఊరూరా నిప్పు రవ్వల్ని రాజేసిన పత్రికల్ని
జెండాలా మోసిన గోడలు
చీకటి చెరువులో కలిసిపోయిన నీలి గోడల వెలుతురు నీడ
మొండి గోడలే కదా
చరిత్ర వీధుల్లో విరాజిల్లిన చేతి వెన్నముద్దలు.

అనుకునే వాళ్ళు అనుకోవచ్చు కానీ
ఇల్లు ఖాళీ చేసి సొంత ఇంటికి చేరామని
అక్కడైనా తమ చరిత్రను వేలాడదీయాల్సింది గోడల పైనే కదా.

■ ఈతకోట సుబ్బారావు
✆ 94405 29785

మా అనంతపురం సోక్రటీసు!

'అడవిలో ఒక పేరు లేని పూవు అయి రాలిపోతాను' అని శ్రీశ్రీ గారి ఖడ్గ సృష్టిలో చదివిన గుర్తు. మంచిరెడ్డి శివరామ్ రెడ్డి అస్తమించిన వార్త విన్నప్పుడు నాకు ఈ కవితావాక్యమే గుర్తుకువచ్చింది. అతడు ప్రముఖ విద్యావేత్త. సామాజిక తత్వవేత్త. STEP ఉద్యమ నిర్మాత. యాభై ఏండ్ల క్రితం ఒకటి రెండు తరాలకు తప్ప అతడు ఎవరికీ తెలియదు. కానీ అనంతపురం జిల్లా గ్రంథాలయానికి తెలుసు. ఆ గ్రంథాలయం ఆవరణలోని వేపచెట్టుకు తెలుసు. శిరీష వృక్షానికి తెలుసు. లలితకళాపరిషత్‌కు తెలుసు. క్లాక్ టవర్‌కు తెలుసు. అనంతపురం భౌతిక వాతావరణం నిండా సూదీదారంలా అల్లుకుపోయినవాడు. చెప్పులు లేని పాదాలతో, మాసిన గడ్డంతో, అడ్డపంచ పైన పొడుగాటి ముతక లాల్చీతో గబగబా నడుస్తూ తారసపడేవాడు. మిత్రుల భుజాలమీద ఆప్యాయంగా చేయి వేసేవాడు. లేదా వారి రెండు చేతులూ దోసిట్లోకి తీసుకుని, సంతోషంతో ఒత్తుతూ వుండేవాడు. సోక్రటీసు; సంతలో తాత్విక చర్చలు జరిపినట్లు ఏదో ఒక కాకా హోటల్లో కూర్చుని, మిత్రులతో సంభాషించేవాడు. జిడ్డు కృష్ణమూర్తి, రమణ మహర్షి వంటి వారు చర్చకు వచ్చేవారు. ఉన్నట్లుండీ "వేర్ రిలెటివిటీ స్టాప్స్, దేర్ అద్వైత బిగిన్స్" వంటి మాటలు దొరలి, వాతావరణాన్ని ఉత్తేజపరిచేవి. మిత్రులు ఎవరు ఏ పుస్తకాలు కొత్తగా చదివినారో విచారించేవాడు. కొత్తగా ఏ కవిత్వం, ఏ కథ రాసినారో తెలుసుకుని, వినిపించమని కోరేవాడు. "కాసరమా వికారముల్ రాల్చకు" అంటూ వెర్రి కాదిది, సర్రియలిజం సోదరా.. అని బోధించేవాడు. స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్ పలవరించేవాడు.

స్నేహితుడు దక్షిణామూర్తిది వెన్నెల క్లినిక్ వుండేది. ఒకరోజు రాత్రి క్లినిక్‌లో కూర్చోబెట్టి పేపరు, పెన్ను చేతికి ఇచ్చి, "బుర్రలోకి వచ్చిన ఆలోచనలన్నీ రాయి!" అన్నాడు. పది నిమిషాల తర్వాత నా ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసినాడు. రాసినది ఎట్లుందోయేమోకానీ, ఏదో థెరపీ ఇచ్చినట్లు నా మనసంతా నిశ్శబ్దం ఆవరించి, ధ్యానానుభూతి కలిగింది.

వేయిపడగలులో పసరిక గురించి, మాలపల్లిలో తక్కెళ్ల జగ్గడు గురించి ప్రస్తావించేవాడు. ఆయన సమక్షం తాత్విక సాహిత్య చర్చలతో విద్యున్మయమై ఆవరించేది. అప్పటికి మా మిత్రులమంతా ఆయన కంటే ఒక తరం చిన్నవాళ్లం. ఆయన చెప్పే సంగతులన్నీ చాలా సీరియస్‌గా వినేవాళ్లం.

గ్రంథాలయ ఆవరణలో వేపచెట్టు కింద అతడి చుట్టూ చేరినవారిలో కవులు, రచయితలు వుండేవారు. రాయుడు, బద్వేలి రమేష్, కైలాస్, మల్లెల నరసింహమూర్తి, ఎక్కలూరి శ్రీరాములు, చిలుకూరి దేవపుత్ర, బండి నారాయణ స్వామి, రమణ జీవి, ఖాదర్ బాషా, పద్మనాభయ్య, దక్షిణామూర్తి, బోసు, రఘుబాబు వంటి పదీ పదిహేను మంది చేరేవారు. డెబ్భయ్యవ దశకంలో అనంతపురం సాంస్కృతిక వాతావరణం అంతా పద్యమయమే. పండితులు వచనకవిత్వ ప్రక్రియను వెక్కిరిస్తున్న రోజులు. కుందుర్తి; వచనకవిత్వాన్ని భుజాలకెత్తుకున్న రోజులు. "కుక్కలు దొంతలు పడగొట్టగలవు గానీ, పేర్చగలవా?" అని పండితోత్తములు మర్మగర్వంగా మాట్లాడుతున్న మాటలు. ఒక దినం పద్యానికీ, వచనానికీ మధ్య యుద్ధానికి అన్నట్లుగా వేదిక కూడా తయారయింది. అంతకు రెండు రోజుల ముందు తన యువ కవుల సైన్యంతో శివరామ్ సారు శిక్షణా శిబిరాన్ని నిర్వహించినాడు – "గ్రీకులు ఉపన్యాసాన్ని డైలాగ్ అంటారు. ఆ కళను ఎట్ల సాధింపవలె? గొణుగుతున్నట్లు చదివితే అది కవిత్వమా? చేతిలో పేపరు లేకుండా కవిత్వాన్ని గానం చేయండి. కవిత్వాన్ని భాషించండి," అన్నాడు.

ఆ దినం లలితకళాపరిషత్ బయలులో ఇసుక వేస్తే రాలనంత జనం. అష్టావధానాలు, వారికి దండలు, శాలువాలు, సన్మానాలు ముగిసినాయి.



శివరామ్ రెడ్డి అనంతపురంలో మొట్టమొదటి లిటరరీ యాక్టివిస్టు. కొలకలూరి ఇనాక్, సింగమనేని నారాయణ గార్ల కంటే ముందు అనంతపురం వాతావరణంలో ఆధునిక సాహిత్యానికి దారులు ఏర్పరిచినవాడు. యువకవుల ప్రతిభను ఛానలైజ్ చేసినవాడు. సమాజంలో దుష్టవిలువలను దండించినవాడు. ఫాల్స్ ప్రిస్టేజ్‌ను అధిగమించినవాడు.

ఆ తరువాత యువకవులు చెలరేగిపోయినారు. ప్రేక్షకుల చప్పట్లు, ఈలల మధ్య వచన కవిత్వాన్ని గద్దెనెక్కించినారు. స్వాతంత్ర్యానంతరం మొలుచుకొచ్చిన కొత్త తరం కవుల సందోహం ఒక మహావృక్షమై, తెలుగు సాహిత్యాన్ని పరిపాలించబోతున్న సంకేతం అది. ఇదంతా చూసి, పెద్దాయన తిరుమల రామచంద్ర (హంపీ నుండి హరప్పాదాక) ముగ్ధులైన ఘడియ కూడా అది.

"మేము చేయవలసిన పని మీరు చేసినారు. ఇది చరిత్ర. అనంతపురం సాంస్కృతిక వాతావరణంలో ఒక పెద్ద కుదుపు" అన్నారు కమ్యూనిస్టు మిత్రులు. ఈ సాహిత్య సందర్భాన్ని మొత్తం భుజానవేసుకుని నడిపించినవాడు శివరామ్ సారు. అతడు అనంతపురంలో మొట్టమొదటి లిటరరీ యాక్టివిస్టు. కొలకలూరి ఇనాక్, శింగమనేని నారాయణ గార్లకంటే ముందు అనంతపురం వాతావరణంలో ఆధునిక సాహిత్యానికి దారులు ఏర్పరిచినవాడు. యువకవుల ప్రతిభను ఛానలైజ్ చేసినవాడు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వైపు మిత్రులను ఉన్ముఖీకరణ చేసినవాడు. సమాజంలో దుష్టవిలువలను దండించినవాడు. చలం జీవితాన్ని శ్లాఘించినవాడు. ఫాల్స్ ప్రిస్టేజ్‌ను అధిగమించినవాడు.

ఉత్తరాంధ్రలో సాయుధపోరాటం జరుగుతున్న రోజులవి. పంచాది నిర్మల గురించి చెప్పేవాడు. సుబ్బారావు పాణిగ్రాహి కట్టిన పాటలను గుండెకు హత్తుకునేవాడు. ఈ సాయుధపోరాటం మా భూమి సినిమాగా రిలీజ్ అయింది. బయట నుండి తన వంతుగా ఏదో ఒకటి చేయకుండా వుండలేకపోయినాడు. "ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూసి మోసపోకుమా..." అని పాటల రికార్డు మోగుతుండగా 'మా భూమి' సినిమా బండి బజారులో వస్తూవుంది. శివరామ్ సారు, బండి ముందు గుంపులో కలిసిపోయి ఆ సినిమా pamphlets పంచడం మొదలుపెట్టినాడు.

"సమాజం మన మైండును కండీషన్ చేస్తుంది. బీ కేర్‌ఫుల్" అని హెచ్చరించేవాడు. "సీ సర్, సీ.. మీ మైండ్ ఏమి ఆలోచిస్తోందో గమనించండి" అనేవాడు.

"నేను, నా మైండు.. అంటూ రెండు నేనులు వున్నాయా?"

"చూసేవాడు, చూడబడేది రెండూ ఒకటే సర్" అనేవాడు.

జిడ్డు కృష్ణమూర్తి, రమణ మహర్షి, అరబిందోలను అనంతపురం సాంస్కృతిక వాతావరణానికి దగ్గర చేసినవాడు. బయలు తత్వం, అచల యోగం.. అంటూ అధ్యాత్మికానికి జానపదుల గొంతును తొడిగేవాడు. పక్షులు, పువ్వులు, పసిపాపల మధ్య జీవనకళ వెదుక్కునేవాడు.

కొబ్బరాకులు వెన్నెలను చెరిగినట్లు.. అన్న కవితాత్మక వాక్యాలతో అతడి వచన రచనలు నిండిపోయేవి. ఒక్కొక్క రచననూ మిత్రులకు చదివి వినిపించి, ఆ తర్వాత వాటిని చించి చెత్తబుట్టలో పడవేసేవాడు. అతడు కవి, రచయిత. "రాసిన తరువాత అది మనది కాదు" అనేవాడు. రాసిన దాన్ని దేనినీ ఓన్ చేసుకునేవాడు కాడు. ఆయన మిత్రుల మధ్య ఎంత సౌమ్యుడో, సత్యాన్వేషణలో అంత నిర్మొహమాటి. తాను మాట్లాడవలసినది మాట్లాడతాడు. ఎదిరించవలసిన చోట ఎదిరిస్తాడు. సభ అనికూడా లెక్కచేయడు. నిలదీస్తాడు, అరుస్తాడు, కేకలు వేస్తాడు. ఎంత పద్ధతిగా వుండగలడో, అంత అరాచకంగానూ వుండగలడు. ఆయన్ను గురువుగా సంబోధించినవాడు బతికిబట్టకట్టేనా? శివరామ్ సారు గుర్తుకువచ్చినప్పుడల్లా అనంతపురం స్నేహితులు; "నో గురు.. నో టీచర్.." అని వార్నింగులు ఇచ్చుకుంటారు. అతడిని అనంతపురం మరువదు. శివరామ్ సారు ఇక లేరు.

భారతి పత్రిక ఆగిపోతే, ఆ ఆగిపోయిన పత్రికకు సంస్మరణ సభ జరిపింది ఎవరు? గ్రంథాలయ ఆవరణలో వంద సంవత్సరాల వయసు గల ఆ శిరీష వృక్షాన్ని నరికివేసినప్పుడు దానికి సంతాపసభ జరిపింది ఎవరు?

ఆ జీవన నాట్యం ఇప్పుడు లేదు.
ఆ జీవనోత్తేజం ఇప్పుడు లేదు.
ఆ జీవనకళ ఇప్పుడు లేదు.
మా శివరామ్ సారు ఇక లేరు.

■ బండి నారాయణ స్వామి
✆ 88865 40990



మనిద్దరం

పేరుకే మనిద్దరం
సమాంతర రేఖల్లా సాగిపోతూ
విడివిడిగా విరిగిపోతూ

మన గదిలో
అనుబంధాల ఊయలలుండవు
ఎప్పటికప్పుడు
దళసరెక్కుతున్న
పల్చని గోడలు తప్ప
వెతికినా వెలుతురుండదు
మబ్బులా కమ్మేసిన
చీకటి తప్ప

నీదొక ఇటుక ముక్క
నాదొక ఇసుక రేణువు కలగలిపి
ఒక నిలువెత్తు నిశ్శబ్దాన్ని నిర్మించాం

లోపల ఎగిరే రంగుల సీతాకోకలను
పెరిగిన పరిమళాల పూలతోటలను
నెమ్మది నెమ్మదిగా
తెలియకుండానే చిదిమేసాం
యవ్వనోత్సాహ కలలను
కాలం కొలిమిలో
బూడిద చేసాం

మన
ఉదయాలు సాయంత్రాలు
పరుగులో కరిగిపోయాయి
అలసటలో ఆరిపోయాయి

దేహాల రాపిడికి
రాలిపడ్డ పసిమొలకకు మాత్రం
నువ్వు కాస్త నీరు తాగిస్తే
నేను కొంత ఎరువు అందిస్తూ

ఈ ప్రయాణం
ఎటు పోతోందో
నీకూ నాకూ తెలీదు
తెలిసిందల్లా
ప్రపంచం ఎదుట
అందమైన ముసుగులతో
ప్రదర్శనలివ్వడమే

■ పద్మావతి రాంభక్త
✆ 99663 07777



ఇల్లందలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

జనహిత పాదయాత్రకు సర్వం సిద్ధం

- నేడు వర్ధన్నపేట నియోజకవర్గంలో యాత్ర
- పాల్గొననున్న మీనాక్షి, మహేష్‌కుమార్
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కాంగ్రెస్ నేతలు
- 150 మందితో పోలీసుల భారీ బందోబస్తు



మీనాక్షి నటరాజన్



మహేష్ కుమార్ గౌడ్

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జనహిత పాదయాత్రకు వర్ధన్నపేట నియోజకవర్గం సర్వం సిద్ధమైంది. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్ రావులు.. పాదయాత్ర, కార్నర్ మీటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి సోమవారం సాయంత్రం 5గంటలకు పాదయాత్ర ప్రారంభమై, పార్టీ జెండాను, రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి వర్ధన్నపేట వరకు యాత్ర కొనసాగుతుంది. వర్ధన్నపేటలోని అంబేద్కర్ సెంటర్‌లో రాత్రి కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేస్తారు. ఈ సందర్భంగా ఏఐసీసీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు (మిగతా 6లో...)



ఎంజీఎం రోడ్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణనాథుల విగ్రహాలు

కొలువై ఉన్నాడయ్యా..

- విక్రయానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు
- వరంగల్ ఎంజీఎం రోడ్డులో విక్రయాలు

గణపతి నవరాత్రి ఉత్సవాలకు బొజ్జ గణపయ్య విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి. ఈ నెల 27న బుధవారం నుంచి జరగనున్న వినాయక నవరాత్రి ఉత్సవాల కోసం మండళ్లకు తరలేందుకు రంగు రంగులుగా.. చిన్నవి, పెద్దవిగా, వివిధ ఆకృతులతో గణపయ్య ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ములుగు రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా అమ్మకానికి విగ్రహాలను విక్రయదారులు సిద్ధంగా ఉంచారు. మట్టితోపాటు పీవోపీ విగ్రహాలు సరసమైన ధరల్లో అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాక, ఉత్తర తెలంగాణ నుంచి కూడా ఇక్కడ విగ్రహాలను కొనుగోలు చేసేందుకు వస్తున్నారు.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/ వరంగల్ కల్చరల్/మట్టెవాడ




7 వరంగల్ ఎల్లంబజార్‌లో 45 ఫీట్ల ఎత్తుతో ముస్తాబవుతున్న విజయగణపతి విగ్రహం

గుయ్.. గుయ్..

వరంగల్ నగరంలో దోమల స్వైర విహారం

- విషజ్వరాల పాలవుతున్న ప్రజలు
- రాత్రిళ్లు లోతట్టు ప్రాంతాల ప్రజల జాగారం
- నిర్లక్ష్యంలో మునిసిపల్ మలేరియా విభాగం
- నామమాత్రంగా నాసిరకం మందు ఫాగింగ్
- ఆరు మాసాలుగా బయాలజిస్ట్ పోస్టు ఖాళీ
- మేయర్, కమిషనర్ పట్టించుకోవాలని ప్రజల వేడుకోలు



వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీలు, ఖాళీ ప్లాట్లు, చెరువులు, కుంటలలో నీరు నిలిచి ఉండడం వల్ల దోమల లార్వా వృద్ధి చెంది ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొన్ని కాలనీలతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలు రాత్రి సమయంలో జాగారం చేయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, విషజ్వరాలు పెరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే హెచ్చరించినా ఇక్కడి సిబ్బంది పట్టించుకోకపోవడంతో దోమల బెడద అధికమవుతున్నట్టు తెలుస్తోంది.

ఇంటింటికీ జ్వర పీడితులు

మునిసిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రజలు వరంగల్ ట్రైసిటీస్‌తోపాటు విలీన గ్రామాల్లో ప్రతీ ఇంటి నిండా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. గత యేడాది ట్రైసిటీలో 128 డెంగీ, 24 మలేరియా కేసులు నమోదు కాగా, ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటికే నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ప్రజలు క్యూ కడుతున్నారు. ఇప్పటికే 55 డెంగీ కేసులు నమోదైనట్టు తెలిసింది. ఇంట్లో ఒక్కరికి జ్వరం సోకిందంటే అందరికీ సోకుతోంది. కొన్ని ఇళ్లలో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, జలుబు, దగ్గుతోపాటు చివరికి ప్లేట్‌లైట్స్ తగ్గిపోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మలేరియా సిబ్బంది బాధ్యతారాహిత్యంతో ఇదంతా జరుగుతోందని ప్రజలు భావిస్తున్నారు.

ప్రస్తుతం 14 లక్షల పైచిలుకు జనాభా కలిగిన వరంగల్ నగరంలో ప్రజలకు సరిపడా సిబ్బంది లేకపోవడం.. ఉన్న సిబ్బందిలో కూడా చాలామంది విధులకు దుమ్మా కొట్టడం వల్ల దోమలను నియంత్రించేందుకు చేయాల్సిన ఫాగింగ్, స్ప్రే, ఆయిల్ బాల్స్ పనులు కుంటుపడుతున్నాయి. ఇటీవల ప్రతీ డివిజన్‌లో ఫాగింగ్ చేసే హ్యాండ్ మిషన్‌లను రికవరీ చేసుకుని నగరం మొత్తం నాలుగు ఆటోలతో ఫాగింగ్ చేయడంతో దోమలు విజృంభిస్తున్నట్టు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతీ నెల డీజిల్, పెట్రోల్‌తో పాటు దోమలు వృద్ధి చెందకుండా వాడే బెటెక్స్ టెమోఫాస్, మలాథిన్ స్ప్రే చేయకుండా, ఆయిల్ బాల్స్, గంబూషియా చేపలు వేయకుండానే బిల్లులు కాజేస్తూ బల్దియా ఆదాయానికి గండికొడుతున్నట్టు తెలుస్తోంది.

సిబ్బంది ఫుల్.. పనులు నిల్..

గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లకు డివిజన్‌కు ఒకటి చొప్పున బల్దియా నిధుల నుంచి రూ.50లక్షలు వెచ్చించి చిన్న ఫాగింగ్ మిషన్లు, రూ.30లక్షలతో 4 ఫాగింగ్ ఆటోలు కొనుగోలు చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం నగరంలో దోమలు, క్రిమికీటకాలను నియంత్రించేందుకు 60 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, 90 మంది కాంట్రాక్టు సిబ్బంది, 25 మంది ప్రభుత్వ సిబ్బంది మలేరియా విభాగంలో పనిచేస్తున్నారు. వీరితో పని చేయించేందుకు ప్రధాన భూమికను పోషించే బయాలజిస్ట్ లేక పోవడంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. కాగా, ఇద్దరు హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, 8మంది హెల్త్ అసిస్టెంట్లు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు పని చేస్తున్నారు. అయితే గతంలో చిన్న ఫాగింగ్ మిషన్‌లకు రోజుకు 5 లీటర్లు డీజిల్, ఒక లీటర్లు పెట్రోల్ ఇచ్చి ఇద్దరు సిబ్బందిని కేటాయించేవారు. కానీ ప్రస్తుతం 4 పెద్ద ఫాగింగ్ ఆటోలను కొనుగోలు చేసి ఒక్కో ఆటోకు 8 డివిజన్‌లలో ఫాగింగ్ చేసేందుకు (మిగతా 6లో...)

నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ వారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందని గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- బీఆర్ఎస్ హయాంలో మోసపూరిత హామీలు
- ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను మోసం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దాపూర్‌లో రూ.20 లక్షలతో మహిళా కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే, ఎంపీ శంకుస్థాపన చేశారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వంలో మహిళలకు వడ్డీ లేని రుణాలు రూ.20లక్షల వరకు ఇస్తామని, కమ్యూనిటీ భవనాలు కట్టిస్తామని, ఆర్థికంగా ఆదుకుంటామనే హామీలు కురిపించి మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చాక మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు వడ్డీలేని రుణాలు ఇచ్చామన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలు వారికి బుద్ధి చెప్పినా తీరుమారలేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మహిళలకు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. గత ప్రభుత్వంలో దోపిడీ, బినామీ పేర్లతో కాంట్రాక్టులు తీసుకుని ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగపరుచుకుని, ఆర్థికంగా బలోపేతం చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏఎంసీ చైర్మన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్, రాష్ట్ర ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత పర్వతగిరి రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, అధికార ప్రతినిధి అబ్దుల్ కవూర్, పెద్దాపూర్ సొసైటీ వైస్ చైర్మన్ అంబటి రాజస్వామి, రాష్ట్ర సీనియర్ నాయకులు ముద్దం సాంబయ్య, ఎన్కతాళ్ల రవీందర్ పాల్గొన్నారు.



పెద్దాపూర్‌లో మహిళా కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి, ఎంపీ కావ్య

వాలీబాల్ విజేత రాంపూర్ జట్టు



పురుషుల వాలీబాల్ విభాగంలో విజేతగా నిలిచిన రాంపూర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

- మహిళల త్రోబాల్ విభాగంలో చెర్లపాలెం
- ముగిసిన ఈషా గ్రామోత్సవ క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలు

6

జీవించే హక్కును హరిస్తున్న పాలకులు

- ప్రశ్నించే గొంతుకలపై నక్సల్స్ ముద్ర
- ఆదివాసీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి
- అరెస్టు చేసిన వేదిక నేతలను వెంటనే విడుదల చేయాలి

ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

6

ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు



వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో వికృత చేష్టలకు పాల్పడుతూ ర్యాగింగ్ పేరుతో హింసిస్తే అలాంటి విద్యార్థులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. విద్యాసంస్థల్లో ప్రవేశాలు జరుగుతున్న తరుణంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ర్యాగింగ్ నియంత్రణపై పత్రికా ప్రకటన విడుదల చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడటం అనేది తీవ్రమైన నేరమని, తద్వారా భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. సీనియర్ల పేరుతో జూనియర్లను ర్యాగింగ్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే విద్యాసంస్థల నుంచి అడ్మిషన్ రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యాసంస్థలు ర్యాగింగ్ నియంత్రణకు ప్రత్యేకంగా ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి, నూతనంగా ప్రవేశాల పొందే విద్యార్థులపై పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలన్నారు. దౌర్జన్యాలు, అసభ్యపద జాలంలో వేధిస్తే వెంటనే ప్రిన్సిపాల్‌తోపాటు పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ర్యాగింగ్ అనేది విద్యార్థుల భవిష్యత్‌పైనే కాకుండా సమాజంపై సైతం ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. విద్యాసంస్థలు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు కలిసి పనిచేసినప్పుడే ర్యాగింగ్ సంస్కృతిని పూర్తిగా నిర్మూలించగలుగుతామని సీపీ అన్నారు.

ఆర్ట్స్ కాలేజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి, తదితరులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ల ఫలితాలను ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి ఆదివారం విడుదల చేశారు. 1,014 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందులో 355 మంది 35 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రహమాన్, కంట్రోలర్ సుధీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీసెట్ స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : డీసెట్-2025లో అర్హత సాధించిన విద్యార్థులు డీసెట్ స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డి.అబ్దుల్‌హై ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26, 29 తేదీల్లో ప్రభుత్వ డైట్‌లో, 28, 29 తేదీల్లో ప్రైవేటు కళాశాలల్లో నిర్వహించే స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌లో హాజరు కావాలన్నారు.

వరంగల్ డీఈవోగా రంగయ్య బాధ్యతలు



డీఈవో రంగయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వరంగల్ నూతన డీఈవోగా బి.రంగయ్యనాయుడు బాధ్యతలు చేపట్టారు. ఆదివారం వరంగల్ డీఈవో కార్యాలయంలో డీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు నూతనంగా బాధ్యతలు చేపట్టిన రంగయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏఎంవో సుజన్‌తేజ, సూపరింటెండెంట్లు జ్యోతి, బాబ్జీ, టీఎస్టీఈవోస్ ఎడ్యుకేషన్ ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, కోఆర్డినేటర్లు,సిబ్బంది,టీఎస్‌యూటీఎఫ్ నాయకులు సుజన్‌ప్రసాద్‌రావు, దామోదర్, రవూఫ్, శ్రీనివాస్,విజయ్, కుమారస్వామి, సత్యనారాయణలు రంగయ్యకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

కెమిస్ట్రీలో మధుకర్‌కు డాక్టరేట్ ప్రదానం



కేయూ క్యాంపస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం పరిశోధకుడు వైనాల మధుకర్‌కు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు కేయూపరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ వైనాల మధుకర్‌కు డాక్టరేట్ ప్రకటించారు. 'సింథసిస్ క్యారెక్టరైజేషన్ అండ్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ బయాలజీకల్ ఆక్టీవిటీ ఆఫ్ షిఫ్ బేస్ మెటల్ కాంప్లెక్స్' అనే అంశంపై సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ సాధించారు. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి పర్యవేక్షణలో మధుకర్ పరిశోధన పూర్తి చేశారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేట గ్రామానికి చెందిన మధుకర్ హనుమకొండలోని న్యూసైన్స్ డిగ్రీ పీజీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పలు పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ సాధించిన మధుకర్‌ను న్యూసైన్స్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

జీవించే హక్కును హరిస్తున్న పాలకులు

- ప్రశ్నించే గొంతుకలను నక్సల్స్‌గా ముద్ర
- ఆదివాసీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి
- అరెస్టు చేసిన వేదిక నేతలను వెంటనే విడుదల చేయాలి
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

వడ్డేపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):ఆదివాసీ ప్రజల జీవించే హక్కును పాలకులు హరిస్తూ, ప్రశ్నించే గొంతుకలను నక్సల్స్‌గా ముద్ర వేస్తున్నారని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నిర్వహించాల్సిన బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో పాలకుల దమననీతిని వ్యతిరేకిస్తూ ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడారు.

పాలకుల నిర్బంధం నీడలో ప్రజలు జీవన మనుగడ కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పాలక ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించి తీరుతామని హెచ్చరించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, శాంతి చర్చలను కొనసాగించాలని మావోయిస్టులు ఎన్నోమార్లు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ వారు పెడచెవిన పెడుతున్నారని అన్నారు. ఎన్‌కౌంటర్ పేరుతో అణచివేస్తున్న ఆదివాసీలు, ఉద్యమకారుల జీవించే హక్కును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షించాలని, కాల్పుల విరమణను వెంటనే ప్రకటించి, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని గడ్డం లక్ష్మణ్ కోరారు. 1996 పీసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బస్తర్‌లో ఏర్పాటు చేసిన వందలాది సాయుధ బలగాల క్యాంపులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ భవన్‌లో నిర్వహించతలపెట్టిన ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక బహిరంగ సభకు వచ్చే వేదిక నాయకులను ముందస్తుగానే శనివారం రాత్రి నిర్బంధంగా అరెస్టు చేశారని దుయ్యబట్టారు. చైతన్య మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు జ్యోతక్కను గద్వాలలో, సీఎల్‌సీ నేతలు కుమారస్వామిని కరీంనగర్‌లో, పెద్దపెల్లిలో రవీందర్‌ను, రత్నకుమార్‌ను, బారసాని రాజయ్యను, మాడుగుల మల్లయ్యను అరెస్టు చేశారని, వీరందరిని భేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక, వివిధ ప్రజా సంఘాల నేతలు ఎస్.నారాయణరావు, ఆజాద్, రమేష్ చందర్, చార్వాక, జక్కుల వెంకటయ్య, నున్న అప్పారావు, గంగుల దయాకర్, రాచర్ల బాలరాజు, గుడి కందుల క్రాంతి, పోరిక ఉదయ్‌సింగ్, సమ్మయ్య రాథోడ్, కరుణాకర్ నాయక్, శాంత, అనిత, భూక్య శ్రీనివాస్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మిల్స్‌కాలనీ ఎస్సై, కానిస్టేబుల్‌పై అట్రాసిటీ కేసు

- ఎస్సై ఫిర్యాదుతో హోటల్ నిర్వాహకులపై కేసు

వరంగల్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుల్ రాజుపై అదే పోలీస్ స్టేషన్‌లోనే ఆదివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి ఓ హోటల్ నిర్వాహకులపై అర్ధరాత్రి పెట్రోలింగ్‌లో ఉన్న ఎస్సై శ్రీకాంత్ చేయిచేసుకోవడంతో బాధితులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. కేసు నమోదు చేయలేదు. ఈ క్రమంలో హోటల్ నిర్వాహకులపై మిల్స్‌కాలనీ ఎస్సై జులుం అని ఆంధ్రజ్యోతిలో ఆదివారం వార్త ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించి మిల్స్‌కాలనీ పోలీసులు ఎస్సై శ్రీకాంత్‌తోపాటు కానిస్టేబుల్ రాజుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఎస్సై ఫిర్యాదు మేరకు మరియమ్మ, ఆమె కుమారుడు శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని లష్కర్‌బజార్ మెయిన్‌రోడ్డు, లష్కర్‌బజార్ ఏరియాలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, కిషన్‌పుర, సిక్కువాడ, లష్కర్‌బజార్ మెయిన్ రోడ్డులో మధ్యాహ్నం 12నుంచి 2గంటల వరకు ఉండదన్నారు.

జనహిత పాదయాత్రకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

మహేష్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. తిరిగి రాత్రి 9 గంటల లోపే మీటింగ్ ముగించుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు. కాగా, పాదయాత్ర చేసే వరంగ ల్-ఖమ్మం జాతీయ రహదారిని మునిసిపాలిటీ సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన మట్టిని జేసీబీ, డోజర్ల సహాయంతో తీసివేస్తున్నారు. ఆకేరు వాగు బ్రిడ్జిపై ఉన్న చెత్తచెదారాన్ని, మట్టిని తొలగిస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం వస్తున్న తరుణంలో ఇల్లంద నుంచి వర్ధన్నపేట వరకు భారీగా ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి.



ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఈపాదయాత్రలో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), ఎంపీలు పోరిక బలరాంనాయక్, డాక్టర్ కడియం కావ్య, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, ఆయా జిల్లాల కాంగ్రెస్ నేతలు పాల్గొంటారని చెపుతున్నారు. పదివేల మందితో పాదయాత్ర జరిగేలా నాయకులు ప్లాన్ చేస్తున్నారు. ఇటు స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, మహబూబాబాద్ నియోజకవర్గాల నుంచి సైతం కాంగ్రెస్ నాయకులు తరలిరానున్నారు. ఇల్లంద గ్రామంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఏర్పాట్లను పరిశీలించారు. కాంగ్రెస్ జెండా ఎగురవేసే తాత్కాలిక స్థలాన్ని చూసి నాయకులు దిశానిర్దేశం చేశారు.

150 మంది పోలీసులతో బందోబస్తు

కాంగ్రెస్ జనహిత పాదయాత్రకు పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జనగామ డీసీపీ ఆధ్వర్యంలో ఇద్దరు ఏసీపీలు, ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్ఐలు, 90 మంది ఏఎస్ఐ, హెచ్‌సీ, పీసీలు మోహరించనున్నారు. ఇకపాదయాత్ర సమయంలో రోప్‌పార్టీలు రెండు రానున్నాయి. కమిషనరేట్ నుంచి స్పెషల్ పోలీసులు 40మంది బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోస్తు చేస్తున్నట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. పాదయాత్రకు వచ్చే నాయకులను చూసి, యాత్ర తీరును చూసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. దాదాపు గంటపాటు యాత్ర సాగుతుందని, ఆ మేరకు ట్రాఫిక్ మళ్లింపు లేదా భారీ వాహనాల నిలిపివేత దిశగా నిర్ణయం తీసుకోనున్నారు.

అదనపు కట్నం కోసం భార్యను చంపిన భర్త

- వివాహమైన మూడు నెలలకే దారుణం



గౌతమి (ఫైల్)

మట్టెవాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పెళ్లయిన మూడు నెలలకే అదనపు కట్నం కోసం భార్యను హత్య చేశాడు ఓ భర్త. పైగా ఏమీ ఎరుగనట్టు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కాగా, అల్లుడే తన కూతురును హత్య చేశాడని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మట్టెవాడ పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం దర్శనపెల్లి గ్రామానికి చెందిన బాదావత్ అశోక్, సోకు దంపతుల కుమార్తె గౌతమి(22)ని మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన బానోతు వస్సు,సాలి దంపతుల కుమారుడు గణేష్‌కు ఇచ్చి గత మే 18న వివాహం జరిపించారు. వివాహ సమయంలో రూ.25 లక్షల కట్నం, 150 గజాల స్థలం ఇచ్చారు. రెండు నెలల క్రితం వారు వరంగల్ హంటర్‌రోడ్ పద్మావతి గార్డెన్ సమీపంలోని సాయినగర్ కాలనీలో ఇంటిని కిరాయికి తీసుకొని ఉంటున్నారు. గణేష్ ఆటో నడుపుతున్నాడు. అయితే కొన్ని రోజులుగా అదనపు కట్నం కోసం గౌతమిని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి నచ్చజెప్పినప్పటికీ గణేష్‌లో మార్పు రాలేదు. పైగా గౌతమిని హతమార్చాలనుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున గౌతమి నిద్రలో ఉండగా ముఖంపై దిండుతో నొక్కిపట్టి హత్య చేశాడు. తెల్లారాక తను లేవడం లేదని ఇంట్లో చెప్పాడు. స్థానికులు, సమీప బంధువులతో కలిసి ఏమీ తెలియనట్టు అంబులెన్స్‌లో ఎంజీఎంకు తీసుకెళ్లాడు. వైద్యులు పరీక్షించి అప్పటికే గౌతమి మృతి చెందిందని చెప్పారు. దీంతో తన కూతురును అదనపు కట్నం కోసం భర్త గణేషే హత్య చేశాడని గౌతమి తండ్రి బాదావత్ అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మట్టెవాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఆదివారం సాయంత్రం ఏఎస్పీ శుభం ప్రకాశ్, క్లూస్‌టీం, మట్టెవాడ పోలీసులు పరిశీలించి ఆధారాలు సేకరించారు.

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యం

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ధర్మసాగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం ధర్మసాగర్ మండలకేంద్రంలోని స్నేహకాలనీ, పెద్దపెండ్యాల గ్రామంలో జరిగిన సీసీరోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కొత్త రేషన్ కార్డు దారులకు సెప్టెంబరు ఒకటి నుంచి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ జరుగుతోందన్నారు. పెద్దపెండ్యాల గ్రామానికి రూ.46లక్షల నిధులు, స్నేహకాలనీకి రూ.25లక్షల నిధులు సీసీరోడ్ల నిర్మాణం కోసం మంజూరు చేసినట్టు తెలిపారు. ధర్మసాగర్ స్నేహ కాలనీవాసులు మిషన్ భగీరథ నీరు రావడం లేదని తన దృష్టికి తీసుకువచ్చారని, డీఈఈని వెంటనే కాలనీకి పంపిస్తామన్నారు. త్వరలో స్నేహకాలనీలో వాటర్ ట్యాంక్, పైపులైన్ నిర్మాణం చేపట్టి తాగునీటిని అందిస్తామన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు రాబోతున్నాయని చెప్పారు. గతంలో కాలనీలో ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసిన భూమి ఆక్రమణకు గురవుతుందని సర్వే నిర్వహించి హద్దులను పాతాలని తహసీల్దార్ సదానందంకు సూచించారు. మాడల్ కాలనీకి సీడీఎఫ్ నిధులు రాగానే రూ.50 లక్షలు మంజూరు చేసి రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్, మార్కెట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుయ్.. గుయ్..

(5వ పేజీ తరువాయి)

పురమాయించారు. ఒక్క ఫాగింగ్ ఆటోకు 75 లీటర్ల డీజిల్‌తో పాటు 10 లీటర్ల పెట్రోల్ ఫిల్లింగ్ చేసే పంపిస్తుండగా ఆటోలు ఎక్కడ ఫాగింగ్ చేస్తున్నాయో అధికారులకు తప్ప ప్రజలకు కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇంకా 66 డివిజన్లలో సిబ్బంది బావుల్లో (ప్యారా రత్నం) మందు, డ్రైనేజీలలో దోమల స్ప్రే, నీటి గుంతలు, చిన్న పాటి కుంటలలో ఆయిల్ బాల్స్ వేయాలి. ఇంకా దోమల నివారణకు వినియోగించే మలాథిన్, బెటెక్స్, ఆయిల్‌బాల్స్ నాసిరకం మందులను తెచ్చి అక్కడక్కడా పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోతోందని ప్రజలు వాదిస్తున్నారు.

లీడర్‌గిరి

మలేరియా విభాగంలో పని చేసే ఔట్‌సోర్సింగ్, ప్రైవేటు, కాంట్రాక్ట్ (అవసర నిమిత్తం) నియమించబడిన కొందరుసిబ్బంది సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులుగా విధులకు డుమ్మా కొట్టి అధికారులను సైతం బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్టు తెలిసింది. ఇంకా కొందరు వైట్‌కాలర్ నాయకులు విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క రోజు కూడా ఫాగింగ్ చేయకుండా ఉన్నారు. ప్రధానంగా లష్కర్‌సింగారం, ఆరెపల్లి, కొత్తపేట, మామునూరు, సింగారం గ్రామాలకు చెందిన వారు అధికారులకు దగ్గరగా ఉండి పని చేయకున్నా నెలకు ఠంచన్‌గా వచ్చే జీతాన్ని నొక్కేస్తున్నారు. కొందరు సిబ్బంది అధికారులు, ప్రజాప్రతినిధుల పేరు చెప్పి మరీ విధులకు రావడం లేదని అధికారులే వెల్లడించారు. ఇటీవల మలేరియా సిబ్బందికి జీతాలు పెంచినా విధులకు సక్రమంగా రావడం లేదని తోటి సిబ్బంది చెప్పుకొస్తున్నారు. తద్వారా తమపై ఎక్కువ పని భారం పడుతుందని తెలిపారు. ఇప్పటికైనా బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, మేయర్ గుండు సుధారాణి మలేరియా విభాగంలో జరుగుతున్న అవినీతిని గుర్తించి ప్రజలను దోమల బారినుంచి రక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం..



వరంగల్ నగరంలో దోమల నివారణకు ఇంటింటి సర్వే చేస్తున్నాం. ఎవరైనా జ్వర పీడితులు ఉన్నారా? అని తెలుసుకుని ప్రతీ వారం డ్రై డేను పాటించాలని అవగాహన కల్పిస్తున్నాం. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇళ్ల చుట్టుపక్కల నీరు నిలువకుండా చూడాలని కరపత్రాలు, కళాజాత ద్వారా ప్రచారం చేస్తున్నాం. ప్రతీ కాలనీలో ఫాగింగ్, దోమల మందు స్ప్రే చేస్తున్నాం. ఇప్పటి వరకు కొన్ని డెంగీ కేసులు నమోదైనట్టు తెలిసింది. ఇంకా ప్రజలు దోమల పట్ల అప్రమత్తంగా ఉండకపోతే ఆర్థికపరమైన నష్టం జరుగుతుంది.

– డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఇన్‌చార్జి మలేరియా అధికారి

కటకటాల్లోకి టీచర్

- తాగునీటిలో గడ్డిమందు కలిపిన ఘటనలో అరెస్టు
- ఉద్యోగం నుంచి తొలగించిన భూపాలపల్లి కలెక్టర్



ఉపాధ్యాయుడి అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తాగునీటిలో విషం కలిపి విద్యార్థుల ప్రాణాలతో చెలగాట మాడిన భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు పెండ్యాల రాజేందర్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. అతడిని పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశానుసారం ఈ చర్యలు తీసుకున్నట్టు డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. మరోవైపు రాజేందర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్టు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కాగా, భూపాలపల్లి పట్టణంలోని అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాలలో ఈనెల 21 రాత్రి తాగునీటి ట్యాంకులో సైన్స్ ఉపాధ్యాయుడు రాజేందర్ గడ్డి మందు కలిపినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటనలో 11 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఘటనపై సమగ్ర విచారణ చేపట్టారు. సైన్స్ ఉపాధ్యాయుడు రాజేందర్ ఈ దారుణానికి పాల్పడ్డాడని వెల్లడైంది. హాస్టల్ ప్రత్యేక అధికారిపై నెపాన్ని నెట్టేందుకు కుట్ర చేసిన రాజేందర్.. విద్యార్థులు తాగే నీళ్లల్లో గడ్డిమందు కలపాడని విచారణలో తేలింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రాజేందర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. ఈకేసులో ఇతరుల ప్రమేయం ఏమైనా ఉందా? అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

నర్సంపేట మహిళా జైలు సూపరింటెండెంట్‌గా స్రవంతి

నర్సంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నర్సంపేట మహిళా జైలు సూపరింటెండెంట్‌గా స్రవంతి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మహిళా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పెండ్యాల సుచరిత మృతికి సంబంధించి జైలు సూపరింటెండెంట్ లక్ష్మీశృతి నిర్లక్ష్యమే కారణమని అంతర్గత విచారణలో తేలడంతో ఆమెను శనివారం సస్పెన్షన్ చేస్తూ జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. లక్ష్మీశృతి స్థానంలో వరంగల్ మహిళా జైలులో జైలర్‌గా పనిచేసిన స్రవంతిని నర్సంపేట మహిళా జైలు సూపరింటెండెంట్‌గా నియమించగా, ఆదివారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు.

వాలీబాల్ విజేత రాంపూర్ జట్టు

- మహిళల త్రోబాల్ విభాగంలో చెర్లపాలెం
- ముగిసిన ఈషా గ్రామోత్సవ క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలు



మహిళల త్రోబాల్ విభాగంలో [illegible]

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈషా గ్రామోత్సవ క్లస్టర్ స్థాయి పురుషుల వాలీబాల్, మహిళల త్రోబాల్ క్రీడా పోటీలు ముగిశాయి. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లాల క్లస్టర్ స్థాయి పురుషుల వాలీబాల్ ఫైనల్స్‌లో రాంపూర్(ఏటూరునాగారం) ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో వాజేడు, తృతీయ స్థానం పడిగపూర్(మేడారం), చతుర్థ స్థానంలో ఖైలారం జట్లు విజయం సాధించాయి. అదేవిధంగా మహిళల త్రోబాల్ ఫైనల్స్‌లో చెర్లపాలెం(మహబూబాబాద్) ప్రథమ స్థానం, శాయంపేట(పత్తిపాక) ద్వితీయ, వావిలాల జట్టు తృతీయ, నాగారం(ముచ్చర్ల)జట్టు చతుర్థ స్థానాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచాయి. ఈ మేరకు జేఎన్ఎస్‌లోని వాలీబాల్ కోర్టులో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు సమావేశానికి డాక్టర్ భగీరథ ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్లకు ట్రోఫీలను, బహుమతులను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇక్కడ క్లస్టర్ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ, స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేలు, ద్వితీయ స్థానం రూ.7వేలు. తృతీయస్థానం రూ.5వేలు, చతుర్థస్థానంలో నిలిచిన జట్టుకు రూ.3వేల గ్రామోత్సవం సంస్థ చెక్కులను అందజేశారు. అదే విధంగా మహిళా త్రోబాల్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.10,7,5,3వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో ఈషా ఫౌండేషన్ వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వివేక్ వడ్డెపల్లి, వరంగల్ ఈషా సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రమాకాంత్, పీడీ రాముడు, ఈశా వలంటర్లు, వాలీబాల్ అసోసియేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

అ ధునాతనం.. అ త్యాధునికం..



భూపాలపల్లిలోని ఏటీసీ సెంటర్

- ఐటీఐల్లో అప్‌డేట్ ఎడ్యుకేషన్
- ఉపాధే లక్ష్యంగా టెక్నికల్ కోర్సులు
- త్వరగా ఉద్యోగం పొందే అవకాశం

భూపాలపల్లి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులకు ఐటీఐ విద్యాబోధన వరంగా మారింది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని.. అధునాతన పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చి ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ముఖ్యంగా పరిశ్రమలు, ఉత్పత్తి, తయారీ కేంద్రాల్లో అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి. అంతటితో ఆగిపోకుండా అనంతరం ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. విద్యార్థులకు నూతన ఒరవడితో విద్యను అందించేందుకు ఐటీఐలను నేడు ఏటీసీలు (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్)గా అప్‌గ్రేడ్ చేసి విద్యార్థులకు నూతనంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్‌తో పాటు వర్చువల్ అనాలసిస్ అండ్ డిజైనర్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ తదితర కోర్సులను అందిస్తోంది. కోర్సులు పూర్తి చేసిన వారు స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ఉపాధి అవకాశాలు పొందడానికి ప్రభుత్వం వీలు కల్పించింది.

ఉన్నత విద్యకు అవకాశం..

ఐటీఐ తర్వాత డిప్లొమా కోర్సుల్లో చేరడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వవచ్చు. కొన్ని బ్రాంచీల్లో లేటరల్ ఎంట్రీతో నేరుగా ద్వితీయ సంవత్సరం కోర్సుల్లో చేరిపోవచ్చు. డిప్లొమా తర్వాత ఆసక్తి ఉంటే ఈసెట్ ద్వారా నేరుగా రెండో సంవత్సరం బీటెక్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. నాన్ ఇంజనీరింగ్ బ్రాంచీల్లో ఐటీఐ ట్రేడ్‌లు పూర్తి చేసిన వారు డిగ్రీ (బీఏ), అనంతరం పీజీ (ఎంఏ) కోర్సులు కూడా చదువుకోవచ్చు.

విదేశాలకు వెళ్లే చాన్స్

ఏటీసీల్లో కోర్సులు పూర్తి చేసి అర్హత సాధించిన విద్యార్థులు స్వదేశంలోని కంపెనీల్లోనే కాకుండా విదేశాల్లోకి వెళ్లవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్), ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ వారు విదేశీ ఉద్యోగాలకు దారి చూపుతున్నాయి. ఇవి శిక్షణ అందించి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్నాయి. వీటిని పొందిన వారు కేంద్రంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ ద్వారా విదేశీ ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు. అలాగే టాటా కంపెనీ అనేక అవకాశాలను అందించనుంది.


ఏటీసీలో ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలు

శిక్షణ పొందిన అధ్యాపకులతో బోధన

తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా ఆరు కొత్త కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఏటీసీ కేంద్రాల్లో నూతన ఒరవడి కోసం సాంకేతికంగా శిక్షణ పొందిన అధ్యాపకులతో విద్యాబోధన చేయిస్తోంది. ఈ కోర్సులను గతేడాది సెప్టెంబరులోనే ప్రారంభించినా అడ్మిషన్లు అనుకున్న స్థాయిలో కాలేదు. ఇప్పుడు రెండో దశలో సీరియస్‌గా తీసుకుంది. అధ్యాపకులను సైతం నియమించింది.

కోర్సులు.. విద్యార్హతలు..

ఐటీఐ/ఏటీసీ కేంద్రాల్లో నూతనంగా ఆరు ట్రేడ్లను ఏర్పాటు చేశారు. దీనిని టాటా కంపెనీ వారి సహకారంతో ఈ గ్రూపులను ఏర్పాటు చేశారు. వీటిలో రెండు సంవత్సరాల కోర్సులతో పాటు సంవత్సరం పాటు చేసే కోర్సులు కూడా ఉన్నాయి. అందులో మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమోషన్ (ఎన్‌ఎస్‌క్యూఎఫ్) కోర్సు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సు, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ కోర్సులు ఏడాది పాటు ఉంటాయి. అలాగే వర్చువల్ అనాలసిస్ అండ్ డిజైనర్ కోర్సు, సీఎన్‌సీ మ్యాచినింగ్ టెక్నీషియన్ కోర్సు, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులు రెండేళ్ల పాటు ఉంటాయి. ఒక్కో ట్రేడ్‌లో 24 నుంచి 40 సీట్ల వరకు అవకాశాలున్నాయి. ప్రస్తుతం భూపాలపల్లి ఐటీఐ/ఏటీసీ కేంద్రంలో 172కు గాను 42 మాత్రమే సీట్లు ఉన్నట్లు ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ తెలిపారు. ఇందులో ఎక్కువగా మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులో 22 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సులో 10 సీట్లు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని తెలిపారు.

ఏటీసీ కోర్సులతో ఉపాధి

- జుమ్లానాయక్, ఏటీసీ ప్రిన్సిపాల్, భూపాలపల్లి



త్వరగా ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందాలనుకునే విద్యార్థులకు ఇది సువర్ణావకాశం. ఇంకా కొన్ని సీట్లు మాత్రమే ఉన్నాయి. ఈ నెల 28వ తేదీలోపే దరఖాస్తు చేసుకోవాలి. లేకపోతే ఐటీఐకి వచ్చి అన్ని సర్టిఫికెట్లు, ఫొటోలతో చేసుకోవచ్చు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి త్వరగా ఉపాధి పొందే అవకాశాలు మెండుగా ఉన్నాయి.


పంథిని శివారులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

అనుమతులు లేకుండా దర్జాగా వెంచర్లు

- కాగితాలపై మార్కింగ్‌తో ప్లాట్ల విక్రయాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

ఐనవోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువా అన్న చందంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. రైతుల వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రికి రాత్రే వెంచర్లుగా మార్చి ప్లాట్లను పేపర్‌పై డ్రాయింగ్ వేసి విక్రయానికి పెడుతున్నారు. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారికి 500 మీటర్ల సమీపంలో పంథిని-పున్నేలు గ్రామాల మధ్య మట్టిరోడ్డుకు ఆనుకొని సర్వే నెంబర్ 32, 33లలో 3 ఎకరాల ప్రైవేటు భూమిలో కేవలం వారం రోజుల్లో నాలా కన్వర్షన్ చేయకుండానే వెంచర్‌ను ఏర్పాటు చేశారు. అంతేకాదు వెంచర్ చుట్టు ప్రీకాస్ట్ వాల్‌ను నిర్మించి సుందరంగా తీర్చిదిద్ది విక్రయానికి పెట్టారు. అయితే వెంచర్‌కు జాతీయ రహదారి నుంచి పోయే పున్నేలు బైపాస్ మట్టి రోడ్డుకు ఇరువైపుల గత సంవత్సరం ఆగస్టులో ఉపాధి హామీ పథకంలో ఎవెన్యూ (రహదారి వెంబడి నీడనిచ్చే) మొక్కలను నాటి జీపీ ట్యాంకర్ ద్వారానీటిని అందిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏకంగా రోడ్డు వెంబడి పెట్టిన మొక్కలను ఒకవైపు యంత్రాల ద్వారా తొలగించి రోడ్డును వెడల్పు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా పున్నేలు శివారులో జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన బృందావనం వెంచర్‌లో గొలుసు బాట(బండ్ల బాట) నక్షలో ఉండగా దాన్ని దర్జాగా వెంచర్లో కలిపేసుకున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. చింతకుంట క్రాస్‌రోడ్డు సమీపంలో వజ్ర పేరిట ఏర్పాటు చేసిన వెంచర్‌లో 20 గుంటల కట్టు కాల్వ (ప్రభుత్వం)ఉంది ఉపాధి పనుల్లో కాలువలో పూడిక మట్టిని సైతం తీశారు. ఇప్పుడు ఆ 20గుంటల కాల్వను వెంచర్‌లో కలిపేసుకొని ప్లాట్లు చేసి వరద నీరు రాకుండా చేశారని స్థానికులు ఫిర్యాదులు చేసినా ఇంత వరకు పట్టించుకోలేదని వాపోయారు. పున్నేలు క్రాస్ రోడ్డు కమాన్ పక్కనే ఉన్న అసైన్డ్ భూమిని పీవోటీ చట్టానికి విరుద్ధంగా అమ్మకాలు చేయగా ఫిర్యాదులు చేశారు. రంగ సముద్రం ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి పోసి నీరు రాకుండా ప్లాట్లు చేసి ప్రహరీ నిర్మించారు. ప్రహరీని తొలగించాలని ఇరిగేషన్ అధికారులు సూచించినా ఇంత వరకు రియల్ ఏస్టేట్ వ్యాపా రులు తొలగించలేదు.వీటన్నింటిపై కలెక్టర్ చొరవతీసుకొని విచారణ జరిపిప్రభుత్వ, అసైన్డ్ భూములను రక్షించి ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఈ విషయమై 'కుడా' జేపీవో కె.శంకర్‌ను వివరణ కోరగా.. కుడా లేఅవుట్ అనుమతులకు దరఖాస్తు చేసుకోనందున పంథిని జీపీ కార్యదర్శి మాలతితో కలిసి సర్వే నెంబర్ 32, 33 లో నిర్మించిన గోడకు నోటీస్‌ను అంటించి హద్దురాళ్లను తొలగించినట్టు తెలిపారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌ను వివరణ కోరగా.. 'పంథిని శివారులో వెంచర్ చేసిన వ్యవసాయ భూమి (వ్యవసాయేతర భూమి) నాలా కన్వర్షన్ జరగలేదు.. అందుకు సంబంధించిన నోటీసు పంపిస్తున్నాం... మండలంలో ఎక్కడైన అనుమతులు లేకుండా వెంచర్లు చేసినా, ప్రభుత్వ భూములను కబ్జా చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం..' అని తెలిపారు. అలాగే ఎంపీడీవో నర్మద మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపుల నాటిన ఎవెన్యూ మొక్కలను తొలగిస్తే వెంచర్ నిర్వాహకులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరంగల్-హైదరాబాద్ 163 హైవేపై రఘునాథపల్లి వద్ద ఉన్న కోమల్ల టోల్ ప్లాజా



రూ. 3 వేలు.. 200 ట్రిప్పులు

- వార్షిక 'టోల్' పాస్‌తో తగ్గిన ఆర్థిక భారం
- రూ.16 వేల నుంచి రూ.19 వేల వరకు ఆదా
- హ్యాపీ టోల్ ప్లాజా అంటూ.. వెళ్తున్న వాహనదారులు

రఘునాథపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై నాలుగు చక్రాల వాహనా లపై ప్రయాణించే వారికి ఇప్పటి వరకు భారంగా మారిన టోల్ రుసుముల నుంచి స్వాతంత్ర్య దినోత్సవమైన పంద్రాగస్టు నుంచి ఉపశమనం పొందే అవకాశం ఏర్పడింది. వ్యాపారేతర తెల్ల నేమ్ ప్లేట్ నంబర్ గల వాహనదారులు రూ.3 వేలు చెల్లించి వార్షిక టోల్ పాస్ తీసుకుంటే దేశంలో ఎక్కడైనా జాతీయ రహదారిపై ఉండే టోల్ ప్లాజాలలో 200 ట్రిప్పులు తిరగవచ్చు. వార్షిక టోల్ పాస్‌తో టోల్ ప్లాజాలో సైతం రయ్..రయ్..మంటూ వెళ్లిపోవచ్చు...ఈ విధానంతో సామాన్య, మధ్యతరగతికి చెందిన ప్రజల కార్లు, జీపులు తదితర సొంత వాహనదారులకు ఊర ట కలిగింది. టోల్ చార్జీల భారం తగ్గడంతో వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వార్షిక టోల్ పాస్ వాణిజ్య వాహనాలు, ట్యాక్స్ ప్లేట్ నంబర్ ఉన్న కార్లకు వర్తించదు. అలాగే రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్ ప్లాజాలకు, ప్రైవేటు టోల్‌లకు సైతం వర్తించదు.

గతంలో నెలవారీ పాస్ మాత్రమే..

గతంలో ఒక టోల్ ప్లాజా వద్ద నెలవారీ పాస్ కోసం రూ.350 చెల్లిస్తే ఆ నెలలో ఆ టోల్ ప్లాజా వద్ద మాత్రమే ప్రయాణించే వెసులుబాటు ఉండేది. కానీ ఈ విధానం ప్రకారం రూ.3 వేలతో వార్షిక టోల్ పాస్ తీసుకున్న వాహనదారులు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్-వే లపై ఉన్న అన్ని టోల్ ప్లాజాల గుండా ఏడాదిలో 200 సార్లు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ పాస్ ఏడాదిలో 200 ట్రిప్పులు పూర్తయ్యే వరకు చెల్లుబాటవుతుంది.

పాస్ ఎలా పొందాలంటే..

ఆగస్టు 15 నుంచి అమల్లోకి వచ్చిన వార్షిక టోల్ పాస్ పొందాలంటే రాజ్ మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్‌ఏఐ వెబ్‌సైట్‌లో వాహనం నెంబర్, రిజిస్ట్రేషన్ వివరాలు నమోదు చేసి రూ.3 వేల రుసుము చెల్లిస్తే సరిపోతుంది. నమోదు చేసిన రెండు, మూడు గంటల్లో పాస్ అమల్లోకి వస్తుంది. దీనిని దేశంలోని అన్ని జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాలలో ఉపయోగించుకుంటూ రయ్..రయ్‌న వెళ్లిపోవచ్చు.

అలాగే ఫాస్టాగ్‌తో టోల్ ప్లాజాల నుంచి 200 సార్లు వెళితే సుమారు రూ.19 వేల నుండి రూ.25 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. వార్షిక టోల్ పాస్‌తో 200 సార్లు వెళితే రూ. 3 వేలు సరిపోతాయి. అంటే వార్షిక టోల్ పాస్ తీసుకుంటే సంవత్సరానికి రూ.16 వేల నుంచి రూ.22 వేల వరకు ఆదా అవుతాయి.. .200 ట్రిప్పులు ఎప్పుడు పూర్తయితే అప్పుడు మళ్లీ రీచార్జి చేసుకోవాలి.

వార్షిక పాస్ నిబంధనలు ఇలా..

వార్షిక టోల్ పాస్ ప్రైవేటు, వాణిజ్యేతర కార్లు, జీపులు, వ్యాన్‌లకు మాత్రమే వర్తిస్తుంది. జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్-వేలపై ఉన్న టోల్‌ప్లాజాలకు మాత్రమే పాస్ చెల్లుతుంది. హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై గల టోల్‌ప్లాజాలకు వార్షిక పాస్ వర్తించదు. రాష్ట్ర రహదారులు, స్థానిక సంస్థలు లేదా పార్కింగ్‌లలో ఫాస్టాగ్, సాధారణ రుసుములు వర్తిస్తాయి. పాయింట్ ఆధారిత టోల్ ప్లాజాలలో ప్రతి క్రాసింగ్ ఒక ట్రిప్‌గా, క్లోజ్డ్ టోల్‌ప్లాజాలలో ఒక ఎంట్రీ -ఎగ్జిట్ జత ఒక ట్రిప్‌గా పరిగణిస్తారు. పాస్ కొనుగోలు చేసిన తేది నుంచి ఏడాది లేదా 200 టోల్‌ప్లాజా క్రాసింగ్‌ల వరకు పాస్ చెల్లుబాటవుతుంది. వార్షిక పాస్ బదిలీ చేయడానికి వీలు లేదు. నమోదు చేసిన వాహనానికి మాత్రమే వర్తిస్తుంది.

మట్టి విగ్రహాలకు జై..

- ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
- పెద్ద సంఖ్యలో విగ్రహాల తయారీ
- అన్ని చోట్ల అమ్మకానికి సిద్ధం

కొలువుదీరుతున్న గణనాథులు

హనుమకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలు ఈనెల 27నుంచి ప్రారంభం కాబోతుండడంతో వినాయక విగ్రహాల అమ్మకాలు జోరందుకున్నాయి. జిల్లా, మండల కేంద్రాల్లో అమ్మకానికి సిద్ధం చేసిన విగ్రహాలు బారులు తీరి కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా విగ్రహాల కొనుగోలుదారులతో సందడిగా కనిపిస్తోంది. గణపతి నవరాత్రులు మొదలు కావడానికి ఇంకా రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో విగ్రహాలను కొనుగోలు చేయడానికి ఉత్సవాల నిర్వాహకులు, భక్త మండళ్ల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. విగ్రహాలను పరిశీలించి తమకు నచ్చిన వాటిని అడ్వాన్సులు చెల్లించి ముందే బుక్ చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి సైతం జిల్లా కేంద్రాలకు వచ్చి విగ్రహాలను రిజర్వు చేసుకుంటున్నారు. కొందరైతే అప్పుడే ట్రాక్టర్లలో వాటిని తీసుకెళ్తున్నారు. చాలా మంది ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలవైపే మొగ్గు చూపుతున్నా పర్యావరణ హితులు మాత్రం మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీలు, అపార్ట్‌మెంట్ వాసులు ఎక్కువగా మట్టి విగ్రహాలవైపే మొగ్గు చూపుతుండడం కనిపించింది. గతంలో మట్టి విగ్రహాలు పీవోపీ విగ్రహాల అంతా ఉండేవి కావు. కానీ ఇప్పుడు తయారీలో కొత్త విధానాలను అనుసరించడం ద్వారా పీవోపీలకు ఏమాత్రం తీసిపోనిరీతిలో మట్టి వినాయక విగ్రహాలను సైతం అందంగా తయారు చేస్తుండడంతో వాటినే కొనుగోలు చేయడానికి ఎక్కువ ఇష్టపడుతున్నారు.

మట్టి వినాయకులకు ఆదరణ

వినాయక చవితికి నెల రోజుల ముందుగానే చాలా మంది మట్టి విగ్రహాల తయారీకి ఆర్డర్స్ ఇచ్చి తయారు చేయించకుంటున్నారు. బిహార్, కోల్‌కతా, మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన కుటుంబాలు ఇప్పటికీ పీవోపీ విగ్రహాలనే తయారు చేస్తున్నారు. స్థానికులు మాత్రం మట్టి విగ్రహాలను రూపొందిస్తున్నారు. వీటి ధరలు కూడా విగ్రహం ఎత్తును బట్టి రూ. 2వేల నుంచి రూ. 20వేల వరకు ఉన్నాయి. పీవోపీ కన్నా ఒకింత తక్కువగానే ఉన్నాయి. అయితే పీవోపీ విగ్రహాల అంత ఎత్తు, ఆ రకమైన డిజైన్లలో వీటిని చేయలేకపోతున్నారు. ఇందుకు కారణం వాటి బరువు పెరగడం, ఖర్చు కూడా అధికం కావడం.

ఎకో ఫ్రెండ్లీ గణేష్

చాలా మంది ఎకో ఫ్రెండ్లీ గణేషుడిని పూజించేందుకు మక్కువ చూపుతున్నారు. ఇంటింటనే కాదు అనేక గణేష్ మండపాల్లో మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించేందుకు ఇష్టపడుతున్నారు. ఇది వరకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారు చేసిన విగ్రహాలనే ఎక్కువగా పూజించేవారు. చూడడానికి ఇవి ఎంతో ఆకర్షనీయంగా ఉండడంతో చాలా మంది వీటినే ప్రతిష్ఠించడానికి ఆసక్తి కనబరిచేవారు. పీవోపీతో అందమైన విగ్రహాలను తయారు చేసి వాటికి వివిధ రంగులను జోడించి తయారు చేసిన వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసినప్పుడు అవి విషపూరితమైన కెమికల్స్‌ను విడుదల చేయడం వల్ల పర్యావరణానికి హాని కలిగేది. అయితే కరోనా మహమ్మారి తర్వాత 'గో గ్రీన్ సేవ్ లైఫ్' పేరుతో ఎకో ఫ్రెండ్లీ వినాయకులను తయారు చేయడం, మట్టితో తయారు చేసిన విగ్రహాలనే పూజించడం వంటివి మొదలు పెట్టి వాటినే ప్రస్తుతం ట్రెండ్‌గా సెట్ చేసుకుంటున్నారు. ఇప్పుడు ఎక్కువ మంది మట్టి విగ్రహాలను పూజించేందుకు, భక్త మండళ్లు వాటినే ప్రతిష్ఠించేందుకు ముందుకు వస్తున్నారు. దీనితో మట్టి విగ్రహాలకు క్రమం గా డిమాండ్ పెరగడంతో తయారీదారులు పీవోసీ నుంచి మట్టి విగ్రహాల వైపు మళ్లుతున్నారు. ఆ మేరకు పీవోసీ విగ్రహాలతో పోటీ పడేలా అంతకన్నా అందంగా ఉండేలా మట్టి గణపతులను రూపొందించి మార్కెట్‌లో విక్రయానికి పెడుతున్నారు.


వరంగల్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి గణనాథులు

జోరుగా మట్టి విగ్రహాల తయారీ

ప్రస్తుతం వరంగల్ నగరంలో పలుచోట్ల రోడ్ల పక్కన అమ్మకానికి పెట్టిన గణనాథుల విగ్రహాల్లో ఇవే ఎక్కువగా ఉన్నాయి. పీవోసీ కన్నా మట్టి విగ్రహాలను తయారు చేయడం కొంచెం కష్టమే. అయితే పీవోసీ విగ్రహాల తయారీకయ్యే ఖర్చుతో పోల్చితే కొంత మేర చౌకే. పైగా విగ్రహాల తయారీలో ఉపయోగించే ముడిసరుకు స్థానికంగానే దొరుకుతుంది. కాస్త నైపుణ్యం, సృజనాత్మకతను జోడిస్తే మట్టి విగ్రహాలను మరింత అందంగా తయారు చేయవచ్చునని చెబుతున్నారు విగ్రహ తయారీదారులు. ధార్మిక సంస్థలు, పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ఇటీవల దీనిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం కూడా మట్టి వినాయకుల పట్ల ఆదరణ పెరగడానికి కారణంగా చెబుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు చాలా మంది తయారీదారులు మట్టి విగ్రహాలను తయారు చేసే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో మట్టి విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి విగ్రహాల తయారీ ఒక కుటీర పరిశ్రమల సాగుతోంది. పల్లెల్లో పొలాల్లోని మట్టి, స్థానికంగా దొరికే ఎండుగడ్డి, కొబ్బరిపీచు, కర్రలను ఉపయోగించి భారీ ఎత్తున మట్టి విగ్రహాలను తయారుచేసి పట్టణాలకు తీసుకువచ్చి అమ్ముతున్నారు. అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా మట్టి గణనాథులే దర్శనమిస్తున్నాయి.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించండి..

కాజీపేట పురుషోత్తం, యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్, హనుమకొండ



పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి. ఎక్కువ మంది ఇప్పటికీ పీవోపీ విగ్రహాలనే ప్రతిష్ఠిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. పీవోపీ విగ్రహాల వల్ల పర్యావరణం కలుషితమవుతుంది. ఈ విగ్రహాల్లో ఉపయోగించే రసాయనాలు కోబాల్ట్, నికెల్, అర్సెమిని, క్రోమియం లాంటి క్యాన్సర్ కారక రంగులు నీటి కాలుష్యానికి కారణమవుతున్నాయి. నీటిలోని జలచరాలు, పశువులు, మానవులకు శారీరక, మానసిక రుగ్మతలు కలుగుతున్నాయి. క్యాన్సర్ బారిన పడుతున్నారు. చెరువుల చుట్టూ ఉన్న బోరు బావుల్లోకి బార మూలకాలు, కాలుష్యం బారిన పడుతున్నాయి. రసాయన గణేష్ విగ్రహాల తయారీని ప్రభుత్వం నిషేధించాలి. ఒక వార్డుకు ఒక విగ్రహం అదీ మట్టి విగ్రహం ఉండేలా పోలీసులు, కాలుష్య నియంత్రణ మండలి, గణేష్ ఉత్సవ కమిటీ చర్యలు తీసుకోవాలి.

విక్రయానికి పీవోపీ గణేశులు

మట్టి వినాయక విగ్రహాలతో పాటు పీవోపీ విగ్రహాలు కూడా వరంగల్‌లో పెద్ద ఎత్తున తయారు చేశారు. ఇవి అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. పాత వరంగల్ సెంట్రల్ వద్ద పెద్దఎత్తున విక్రయానికి ఉంచారు. మూడు అడుగుల నుంచి 20 అడుగుల ఎత్తు వరకు ఉన్న ఈ విగ్రహాల ధర రూ. 6వేల నుంచి రూ. 45వేల వరకు ఉన్నాయి. కిందటేడు లాగానే ఈసారీ పెద్దఎత్తున వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. వర్షాలు పుష్కలంగా కురవడంతో చెరువులు, కుంటలు పూర్తిగా నిండి కళకళలాడుతున్నాయి. దీనితో గణపతి నవరాత్రోత్సవ నిర్వాహకులు గణపతులను ప్రతిష్ఠించేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. కొత్తగా ఏర్పడిన యువజన సంఘాలు, భక్తమండళ్లు నవరాత్రుత్సవాల నిర్వహణకు దాతల నుంచి పెద్ద ఎత్తున విరాళాలు సేకరిస్తున్నారు. పోటాపోటీగా ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే అనేక చోట్ల మండపాలు వెలిశాయి.

ముస్తాబవుతున్న మహా గణపతి..

45 అడుగుల ఎత్తుతో సిద్ధమవుతున్న మట్టి విగ్రహం

మట్టెవాడ (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు 3 రోజులు మాత్రమే ఉండటంతో మండపాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వరంగల్ ఎల్లంబజార్‌లో ఆకుతోట సంజీవ్ ఆధ్వర్యంలో 45 అడుగుల విజయగణపతి మట్టి విగ్రహాన్ని సిద్ధం చేస్తున్నారు. ఒడిషాకు చెందిన శిల్పి జయదేవ్ ఆధ్వర్యంలో విగ్రహం రూపుదిద్దుకుంటోంది. ఆదివారం సాయంత్రం వరకు రంగులు అద్దడం పూర్తయింది.

- విజయ గణపతి రూపం ఇలా..

- ఎత్తు 45, వెడల్పు 18 అడుగులు
- నిర్మాణానికి పట్టిన సమయం 25 రోజులు
- పాల్గొన్న కళాకారులు 15 మంది

విగ్రహం తయారీకి వాడినవి..

ఉత్తరప్రదేశ్ ప్రయాగ నుంచి 500 కేజీల మట్టి.. భద్రకాళి చెరువు మట్టి 250 బ్యాగులు

- ఉనుక, గడ్డి, రాగడి, వెదురుబొంగులు
- విగ్రహానికి బంగారు వర్ణంలో సహజమైన రంగు
- బరువు 6 టన్నులు
- పరిసరాల ప్రాంతాల్లో 150 హెడ్‌లైట్లు ఏర్పాటు

గణపతులు రెడీ

వరంగల్ కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అంగరంగ వైభవంగా తొమ్మిది రోజుల పాటు పూజలందుకునే గణపతి ప్రతిమలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ములుగు రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై అమ్మకానికి పెట్టారు. ఆదివారం నుంచి వినాయక విగ్రహాలు కొనుగోళ్లు మొదలయ్యాయి.


వరంగల్ ఎంజీఎం వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

ఉత్తర తెలంగాణకు ఇక్కడి నుంచే..

ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, జగిత్యాల, కోరుట్ల, కరీంనగర్, ఖమ్మం, భూపాలపల్లి, సూర్యపేట, మిర్యాలగూడ ప్రాంతాల నుంచి విగ్రహాల కొనుగోలుకు ఇక్కడికే వస్తారు. ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకెళ్తారు.

రూ.2 వేల నుంచి రూ.30 వేల వరకు..

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలు రూ.2 వేల నుంచి ప్రారంభమై రూ.30 వేల వరకు ధర పలుకుతున్నాయి. నిర్వాహకులు వారివారి ఆర్థిక వనరులను బట్టి వారికి అందుబాటు ధరలో ఉన్న విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

మట్టి విగ్రహాలకు ధర ఎక్కువ

పీవోపీ విగ్రహాలతో పోలిస్తే మట్టి ప్రతిమలకు ధర ఎక్కువగా ఉంది. ఇవి రూ.3వేల నుంచి రూ. లక్షా70 వేల వరకు విక్రయిస్తున్నారు. మున్సిపాల్ కార్పొరేషన్ పక్కన పోతన రోడ్డు, భద్రకాళి రోడ్డు ప్రాంతాలలో మట్టి విగ్రహాలను ఆర్డర్‌పై తయారు చేసి ఇస్తున్నారు.

రూ. కోట్లలో వ్యాపారం

వినాయక చవితి పర్వదినం వచ్చిందంటే వరంగల్ నగరంలో అమ్మకాలు జోరుగా ఉంటాయి. యేటా సుమారు రూ.5కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. చిన్న పెద్ద అన్నీ కలుపుకొని దాదాపు లక్షకు పైగా విగ్రహాలు అమ్ముడుపోతాయని అంటున్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని జీఎస్‌కే ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సంస్థ ఏర్పాటు చేసిన మట్టి వినాయక స్టాల్‌ను వినయ్‌భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని, మట్టి గణపతి విగ్రహాలనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. పదేళ్ల నుంచి సంస్థ నిర్వాహకులు మట్టి వినాయక విగ్రహాలు తయారు చేయడం పట్ల వారిని వినయ్ భాస్కర్ అభినందించారు. స్టాల్ నిర్వాహకులు శివ తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయక విగ్రహాల స్టాల్‌ను ప్రారంభిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

ఘనంగా క్రీడా ఉత్సవాల ర్యాలీ

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 29న హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో క్రీడా ఉత్సవాల ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని డీవైఎస్‌వో అశోక్‌కుమార్ హాజరై జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అశోక్‌కుమార్ మాట్లాడుతూ... ఈ నెల 29న హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 31 వరకు జేఎన్ఎస్‌లో పలు క్రీడా పోటీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. క్రీడా ఉత్సవాల్లో భాగంగా హనుమకొండ జేఎన్ఎస్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అశోకా జంక్షన్ మీదుగా కుడా కార్యాలయం, శ్రీదేవి ఏషియన్ మాల్ నుంచి తిరిగి జేఎన్ఎస్ వరకు కొనసాగిందన్నారు. ర్యాలీలో డీఎస్ఏ కోచ్‌లు, యువత, సీనియర్ క్రీడాకారులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరైనట్లు అశోక్‌కుమార్ తెలిపారు.

బీసీల బిల్లును ఆమోదించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న పులి శ్రీనివాస్ గౌడ్

వడ్డెపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో పెండింగ్‌లో ఉన్న 42 శాతం బీసీల బిల్లును వెంటనే ఆమోదించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయనతో పాటు జాతీయ బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాంయాదవ్ మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్లను ప్రకటించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేపట్టే దీక్షకు రాజకీయాలకతీతంగా బీసీలంతా తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రంజిత్, జిల్లా నాయకులు సోల్తి సారయ్య, బాబు యాదవ్, సొగాని శ్రీనివాస్, బగ్గి రాజు ముదిరాజ్, సనత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ పరపతి సంఘం

నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న గౌడ సంఘం నాయకులు

హసన్‌పర్తి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గౌడ పరపతి సంఘం హనుమకొండ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఎర్రగట్టుగుట్ట దేవస్థానం కల్యాణ మండపంలో జరిగింది. పరపతి సంఘం 12 వసంతాలు పూర్తి చేసుకొని 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా నూతన కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వాహకులు డాక్టర్ కట్టగాని రవీందర్‌గౌడ్, తాళ్ళపల్లి చంద్రమౌళి గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా కొయ్యడ గుంశావళి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గడీల వెంకన్న గౌడ్, కోశాధికారిగా శాఖమూరి రాములు గౌడ్, ఉప కోశాధికారిగా తాళ్ళపల్లి రాకేష్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు.

సిద్ధేశ్వర సేవా సంఘం కమిటీ ఎన్నిక



ఎన్నికైన సిద్ధేశ్వర సేవా సంఘం కార్యవర్గ సభ్యులు

హనుమమకొండ చౌరస్తా, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వర సేవా సంఘం కమిటీని ఆదివారం హనుమకొండ చౌరస్తాలోని అమరావతి హోటల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పాశికంటి చంద్రశేఖర్, అధ్యక్షుడిగా పెండోట చక్రపాణి, ప్రధాన కార్యదర్శిగా మంచాల రాజు, ఉపాధ్యక్షులుగా కీర్తి శ్రీకాంత్, కందికొండ రాజు, కోశాధికారిగా పబ్బ అనిల్, ముఖ్య సలహాదారులుగా రాసమల్ల పోశాలు, సంయుక్త కార్యదర్శిగా జక్కోజు సునీల్, ఈసీ మెంబర్లుగా జక్కోజు ప్రవీణ్, నారోజు సురేందర్, జక్కోజు సుమంత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండు ఏళ్ల పాటు పదవిలో కొనసాగుతుంది. ఈ సమావేశంలో సంఘ సభ్యులు రామగాని సికేందర్, దండ విజేందర్‌రెడ్డి, చిల్వారి కిషన్, వడ్డెమానుకోట చేరాలు, గాంధీ విశ్వేశ్వర్, నర్సయ్య రమేష్, కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలి

హనుమకొండ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బహుజన విప్లవ వీరుడు, గోల్కొండ కేంద్రంగా తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం హనుమకొండ నగరంలో ఏర్పాటు చేయాలని గౌడ సంఘం జేఏసీ నాయకులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఆదివారం వినతిపత్రం ఇచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి బీసీలల్లో ఎక్కువ శాతం జనాభా కలిగిన గౌడ కులస్తుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎకరం స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం జేఏసీ నాయకులు బూర విద్యాసాగర్, బొనగాని యాదగిరి, వీ వేణుగోపాల్, చిర్రరాజు, గాజర్ల అశోక్, మార్క విజయ్, కక్కెర్ల అనిల్, పొగాకు అశోక్, టీ వేణు, జూలూరి రంజిత్, వల్లాల జగన్, నారగోని కుమార్, ఆరెల్లి కిరణ్, కే అశోక్, బూర సురేందర్, జనార్దన్, తడక సుమన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న గౌడ సంఘం నాయకులు

ముగిసిన జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నీ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాల స్థాయి అండర్-7, 9, 11, 13, 15 బాలబాలికల విభాగంలో నిర్వహించిన చెస్ టోర్నీ ముగింపు వేడుకలకు ఎన్ఐటీ ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్ వి. సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతకులు బహుమతులను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతిచిన్న వయస్సులోనే గ్రాండ్ మాస్టర్ (జీఎం) హోదాతో పాటు ప్రపంచస్థాయి క్లాసికల్ చెస్ రేటింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచిన హనుమకొండకు చెందిన ఇరిగేసి అర్జున్‌ను నేటి క్రీడాకారులు ఆదర్శంగా తీసుకొని రాణించాలని ఆయన సూచించారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాల స్థాయిలో నిర్వహించిన ఈ టోర్నీలో 70మంది బాలబాలికల పాల్గొన్నారన్నారు. కాగా, వివిధ జిల్లాల నుంచి వచ్చి టోర్నీలో పాల్గొన్న చిన్నారులు తమ ప్రత్యర్థులపై ఎత్తుకు పైఎత్తులు వేస్తూ గెలుపే లక్ష్యంగా పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్లు ప్రేమ్‌సాగర్, వైశాలి, తదితరులు పాల్గొన్నారు.



చెస్ విజేతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

దాసు సురేష్‌కు పితృ వియోగం

హసన్‌పర్తి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ తండ్రి, రిటైర్డ్ సివిల్ ఎస్సై రఘురాం అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్ ఆస్పత్రిలో ఆదివారం మృతి చెందారు. రఘురాం అంత్యక్రియలు హసన్‌పర్తి పద్మశాలి శ్మశానవాటికలో జరిగాయి. దాసు సురేష్‌ను పలువురు రాజకీయ, జర్నలిస్టు, కుల సంఘాల నాయకులు పరామర్శించారు. పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాస్ యాదగిరి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేవులపల్లి సాయిరాజ్, వైద్యం రాజగోపాల్, జర్నలిస్టు వేముల సదానందం, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, గోరంటల శ్రీనివాస్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న రెయిన్ బో ఆస్పత్రి నిర్వాహకులు

వరంగల్‌లో రెయిన్‌బో చిల్డ్రన్స్ సేవలు ప్రారంభం

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శిశు సంరక్షణ, గర్భిణీ వైద్య సేవల్లో దేశవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన రెయిన్‌బో ఆస్పత్రి వైద్య సేవలను హనుమకొండలో ప్రారంభించినట్లు ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేశ్‌కుమార్ తెలిపారు. హనుమకొండ నయీంనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో దినేశ్‌కుమార్ మాట్లాడుతూ.. దశాబ్దకాలంగా వరంగల్‌లో నమ్మకమైన వైద్య సేవలందిస్తున్న ప్రశాంతి ఆస్పత్రి భాగస్వామ్యంతో సంయుక్తంగా రెయిన్‌బో ఆస్పత్రి నూతన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. పీడియాట్రిక్ కేర్ కోసం రెయిన్ బో ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయబడిందన్నారు. ఇకపై వరంగల్ వాసులకు మాత, శిశు సంరక్షణలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్యసేవలు అందుబాటులోకి నానున్నాయన్నారు. రెయిన్‌బో ఆధ్వర్యంలో ప్రశాంతి ఆస్పత్రి వేదికను 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేయబడిందన్నారు. రెయిన్‌బో 20వ ఆస్పత్రిని వరంగల్‌లో ఏర్పాటు చేసుకోవడం ద్వారా వరంగల్ వాసులకు మోడ్రన్ టెక్నాలజీలో కూడిన వినూత్న వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు.

ప్రశాంతి ఆస్పత్రి డైరెక్టర్ మచ్చ ప్రశాంతి మాట్లాడుతూ.. మహిళలు, పిల్లల సంరక్షణలో ప్రశాంతి ఆస్పత్రి ఎల్లప్పుడూ అత్యున్నత ప్రమాణాలకు కట్టుబడి ఉందన్నారు. రెయిన్‌బోతో ప్రస్తుత భాగస్వామ్యం వల్ల తమ వైద్య ప్రమాణాలు మరింత బలోపేతం చేయడానికి తోడ్పాటునందిస్తుందన్నారు. ఈ సమావేశంలో సీనియన్ పీడియాట్రిషియన్ డాక్టర్ ప్రీతం కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సెలవుల్లో విధులకు పిలుస్తున్నారు..

ట్రెంగ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న కిందిస్థాయి ఉద్యోగులను సెలవు రోజుల్లో విధులకు హాజరుకావాలని తహసీల్దార్‌లు, నాయబ్ తహసీల్దార్‌లు వేధిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ఆవేదన వ్యక్తం చేశారు. అదివారం రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన అత్యవసర సమావేశంలో రవి మాట్లాడుతూ.. భూ భారతి కార్యక్రమంలో భాగంగా సీనియర్ అసిస్టెంట్లు, గిర్దావార్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్స్, రికార్డు అసిస్టెంట్స్ నిరంతం విధుల్లో బిజీగా ఉంటున్నారని, అయినప్పటికీ కొంత మంది తహసీల్దార్‌లు, నాయబ్ తహసీల్దార్‌లు కింది స్థాయి ఉద్యోగులను సెలవురోజు సైతం విధులకు పిలిచి కుటుంబసభ్యులతో లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. దీని ద్వారా సిబ్బంది ఒత్తిడికి గురై అనారోగ్య బారిన పడే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా జిల్లాల కలెక్టర్లు స్పందించి కిందిస్థాయి ఉద్యోగులకు ఒత్తిడిని దూరంగా చేయాలని కోరారు. ఈ సమావేశంలో జనగామ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లయ్య, కార్యవర్గ సభ్యుడు సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్ జైనీకి పురస్కారం

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ సినీ దర్శకుడు, ప్రజా కవి కాళోజీ సినిమాకు ప్రత్యేక గద్దర్ జ్యూరీ అవార్డు అందుకున్న ప్రభాకర్ జైనీకి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. ప్రభాకర్‌జైనీ రాసిన హీరో నవలకు గాను ఆయనకు నవలా విభాగంలో ఉత్తమ నవలా రచయితగా గుర్తించి కీర్తి పురస్కారాన్ని అందజేస్తున్నట్లు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు ప్రకటించారు. పురస్కారంతోపాటు ప్రత్యేక నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని ప్రభాకర్‌జైనీ అందుకోనున్నారు. ఈయన రాసిన అనేక నవలలు ఆంధ్రజ్యోతి అనుబంధం నవ్య వారపత్రికల్లో అచ్చయి ప్రముఖంగా పేరుగడించాయి.



ప్రభాకర్ జైనీ

శఠగోపాచార్యకు చినజీయర్ సత్కారం



శఠగోపాచార్యకు జ్ఞాపికను అందిస్తున్న చినజీయర్‌స్వామి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకుడు, సంస్కృత పండితుడు, ఉభయ వేదాంత పండితుడు సముద్రాల శఠగోపాచార్య.. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి చేతులమీదుగా అపూర్వ సత్కారం అందుకోవడం విశేషం. హైదరాబాద్ ముంచింతలలోని స్వామివారి ఆశ్రమంలో, విశిష్టాద్వైత సిద్ధాంతానికి చెందిన ఆచార్య పరంపరలో భగవత్ రామానుజుల తరువాత ఆచార్య పీఠాన్ని అలంకరించిన ఎంబార్ (గోవింద భట్టర్) సహస్రాబ్దిని పురస్కరించుకొని సమతామూర్తి కేంద్రంలో ఐదురోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సులో శఠగోపాచార్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్వయమంత్ర ప్రతిపాదికం శ్రీ రామాయణం అనే అంశంపై అద్భుత ప్రవచనం చేసి పత్రాన్ని సమర్పించినందుకు గాను జీయర్‌స్వామి ప్రత్యేకంగా ప్రశంసించి సత్కరింపజేశారు. తెలంగాణ, ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, తదితర రాష్ట్రాల నుంచి ప్రముఖ పండితులు పాల్గొన్నారు.

190 ఎల్పీ, ఏఎల్పీ పోస్టుల మంజూరు

కాజీపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే క్రూడిపోకు 190 లోకో పైలెట్, అసిస్టెంట్ లోకో పైలెట్‌ల పోస్టులు మంజూరు అయినట్లు రైల్వే కార్మిక నాయకులు తెలిపారు. కాజీపేట క్రూ డిపోకు అదనపు పని భారం పడుతున్నందున ఈ పోస్టులు మంజూరు చేస్తున్నట్లు రైల్వే అధికారులు చెప్పారు. గతంలో కాజీపేట క్రూ డిపోలో 700పైగా లోకోపైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్‌లు విధులు నిర్వర్తించేవారు. ఇందులో నుంచి కొంతకాలం కిందట సికింద్రాబాద్ డివిజన్ అధికారులు 180 పోస్టులను తగ్గించడంతో రైల్వే కార్మిక సంఘాలు పెద్దఎత్తున రైల్వే జీఎం, డీఆర్ఎంకు ఫిర్యాదులు చేయడంతో తిరిగి అదనంగా 190 పోస్టులు మంజూరు చేసినట్లు రైల్వే కార్మిక నాయకులు తెలిపారు.

కాజీపేట మీదుగా పండుగ స్పెషల్ రైలు

దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సెప్టెంబరు 19 నుంచి స్పెషల్ రైళ్లు నడుపనున్నట్లు రైల్వే అధికారులు చెప్పారు. 08845 /46 చర్లపల్లి - సంత్రగంజి స్పెషల్ రైలు నడపనున్నారని చెప్పారు. ఈ రైలు ఏ తేదీలలో నడిపే షెడ్యూల్‌ను త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారని రైల్వే అధికారులు తెలిపారు.

కేయూ అధ్యాపకుడికి షోకాజ్

లైంగిక వేధింపులు.. అక్రమ వసూళ్ల ఆరోపణలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ బీఈడీ పార్టుటైమ్ అధ్యాపకుడు డాక్టర్ పి.రమేశ్‌కు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇటీవల కేయూ బీఈడీ కళాశాలలో జరిగిన ఆర్థిక అవకతవకలపై నియమించిన విచారణ కమిటీ దృష్టికి రమేశ్ లైంగిక వేధింపులు, అక్రమ వసూళ్లతో పాటు అనేక ఫిర్యాదులందాయి. ఈ ఫిర్యాదుల వివరాలను కమిటీ బాధ్యులు కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంల దృష్టికి తెచ్చారు. దీంతో కేయూ బీఈడీ కళాశాలలో పార్టు టైమ్ అధ్యాపకుడు డాక్టర్ పి.రమేశ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

కాగా, కొన్నేళ్లుగా కేయూ క్యాంపస్ బీఈడీ కళాశాలలో రెగ్యులర్ ప్రొఫెసర్లు లేకపోవడంతో రమేశ్ అనేక అక్రమాలు, దందాలకు పాల్పడ్డారని తెలుస్తోంది. షోకాజ్ నోటీస్ జారీ నేపథ్యంలో బాధితులందరూ బయటి వచ్చి నేరుగా వీసీ, రిజిస్ట్రార్లను కలిసి తమ గోడును వెల్లబోసుకునే అవకాశాలున్నాయి. షోకాజ్ నోటీసుపై మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని రిజిస్ట్రార్ షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

బార్బరీక్ ప్రీమియర్‌షో వీక్షణ



ప్రీమియర్ షో తిలకిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్, ఉదయభాను

హనుమకొండ టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని ఏషియన్ మాల్‌లో స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో విజయపాల్‌రెడ్డి అడిదెల నిర్మించిన చిత్రం 3 బాణాధారి బార్బరీక్ ప్రీమియర్ షోను ఆదివారం చిత్ర యూనిట్ సభ్యులు, ఉదయ భానుతో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రీమియర్ షో యూనిట్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హనుమకొండ, వరంగల్ వేదికగా చిత్రాలను చిత్రీకరించేందుకు అనువైన ప్రదేశాలు ఉన్నాయని ఇక్కడి కళా సంపదను సినిమాల ద్వారా చాటి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, నాయకులు తోట పవన్, నటీ నటులు సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, సాంచిరాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి టెన్నిస్ పోటీలు



విజేతలకు సర్టిఫికెట్లను అందిస్తున్న నిర్వాహకులు

హసన్‌పర్తి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వరంగల్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ - 2025 టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిశాయి. వరంగల్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకారపు హరీష్ అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశానికి గ్రేట్ స్పోర్ట్స్ రిసోర్స్ పర్సన్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేసి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్య శిక్షణ ఎంతో అవసరమన్నారు. ప్రతీ విద్యాసంస్థలో చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యతనిచ్చి ఆరోగ్యవంతమైన యువతను సమాజానికి అందించేవిధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిట్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పింగిళి రమేష్‌రెడ్డి, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ఎం.మోహన్‌రావు, వరంగల్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిట్స్ పీఈడీ హెడ్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ జైసింగ్ అజ్మీరా, కె.సునిల్‌కుమార్, కార్యనిర్వాహక సభ్యులు రవికుమార్, కె.వెంకటస్వామి, మహేష్, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.ప్రభాకరాచారి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంధువులు రావొద్దన్నారని.. భార్య మందలించిందని..

తన గుడిసెకు నిప్పుపెట్టిన వ్యక్తి - పేలిన ఇంట్లో ఉన్న జిలెటిన్ స్టిక్స్

పరుగులు తీసిన కాలనీవాసులు - ఒడ్డరిగూడెంలో ఘటన

ఐనవోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బంధువులు రావొద్దన్నారని.. భార్య మందలించిందని.. ఆగ్రహంతో ఊగిపోయిన ఒక ప్రబుద్ధుడు ఉన్మాదిగా మారి తన పూరి గుడిసెకు నిప్పంటించాడు. ఈ క్రమంలో గుడిసెలో ఉన్న జిలెటిన్ స్టిక్స్ (మందు గుండు సామగ్రి) పేలడంతో కాలనీవాసులు పరుగులు పెట్టారు. ఈ ఘటన మండలంలోని కక్కిరాలపల్లి శివారు ఒడ్డరిగూడెం కాలనీలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఒడ్డరిగూడెం కాలనీకి చెందిన బోసు సాంబరాజు.. పక్కనే ఉన్న బోడు(గుట్ట)పై బండ రాయి వ్యాపారం నిర్వహిస్తాడు. ఇతడి దగ్గరి బంధువు.. అదే కాలనీలో నివసించే మల్లమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తుండగా అక్కడికి వెళ్లాడు. మృతురాలి కుటుంబానికి సాంబరాజుకు పాత కక్షలు ఉన్నాయి. దాన్ని దృష్టిలో పెట్టుకొని చావు వద్దకు ఎందుకు వచ్చావని మల్లమ్మ కుటుంబసభ్యులు సాంబరాజును అడ్డుకుని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. అవమానంతో సాంబరాజు.. అక్కడి నుంచి ఇంటికి వెళ్లాడు. వద్దన్నా వినకుండా వెళ్లినందుకు భార్య రాజేంద్ర మందలించింది. దీంతో కోపం పట్టలేక భార్య, ఆరేళ్ల కుమారుడిని కొట్టడంతో గాయపడి ఆస్పత్రికి వెళ్లారు. ఆవేశంతో తన గుడిసెకు సాంబరాజు నిప్పంటించాడు. దీంతో మంటలు వ్యాపించి ఇంట్లో ఉన్న జిలెటిన్ స్టిక్స్ పేలాయి. దీంతో ఆందోళనతో కాలనీవాసులు పరుగులు తీశారు. ఫైర్ ఇంజన్, పోలీసులకు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగకపోయినా కాలనీ వాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తలదాచుకున్నారు.



దహనమైన సాంబరాజు గుడిసె

ఆంధ్రజ్యోతి 9

నవ్య

కుటుంబ కదంబం

సోమవారం 25 ఆగస్టు 2025

సంస్కృతి



సంప్రదాయ సోయగం... అచ్చమైన తెలుగుదనం... ఎమ్మిగనూరు చేనేత వస్త్రం. ఇక్కడి కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకొనే జరీ అంచు సీకో, పట్టు, కాటన్ చీరలు వేటికవే ప్రత్యేకం. కోటగుమ్మాలు, బుట్టలు, ఏనుగులు, పూలు... విభిన్న అంచులతో... నవీన హంగులతో... ఆకట్టుకొంటున్న ఈ చేనేతకు దేశవిదేశాల్లోనూ మంచి ఆదరణ ఉంది. అరుదైన ఈ కళకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే ఉద్దేశంతో... ఇటీవల ఓ సంస్థ జియోగ్రాఫికల్ ఇండెక్స్ (జీఐ) కోరుతూ నివేదిక పంపింది. ఈ నేపథ్యంలో ఎమ్మిగనూరు చేనేతలపై 'నవ్య' ప్రత్యేక కథనం.

ఎమ్మిగనూరు చేనేత... మన సంస్కృతికి చిహ్నం

కర్నూలు జిల్లాలో చేనేతపురిగా ఖ్యాతి పొందింది... ఎమ్మిగనూరు పట్టణం. మూడు వేల కుటుంబాలు ఇక్కడ చేనేతపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ అరుదైన కళకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. 1930ల్లో పేదరికం, నిరుద్యోగం, కరువు, ఆకలి చావులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న వేళ మగ్గం ఆదుకుంది. ఆకలి తీర్చింది. పద్మశ్రీ పురస్కార గ్రహీత, దివంగత మాచాని సోమప్ప 1938లో 'ఎమ్మిగనూరు చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం లిమిటెడ్'ను స్థాపించారు. స్వాతంత్ర్యానికి ముందే సహకార వ్యవస్థకు బీజం వేశారు. నేతన్నలకు ఉపాధి కల్పించారు. ఆయన కృషితో అత్యుత్తమ చేనేత వస్త్రాలకు ఎమ్మిగనూరు ఒక బ్రాండ్‌గా ఎదిగింది. జిందగీ దుప్పట్లు, బర్ఫ్ ఐ తువాళ్లు, లుంగీలు, చేతి రుమాళ్లు, దోమతెరలు, దోతీలు, చీరల తయారీకి కేంద్రంగా మారింది. ఎప్పటికప్పుడు వినూత్న హంగులు అద్దుతూ ఆకట్టుకొంటున్న నేతన్నలు... తరువాతి కాలంలో జరీ అంచు కుట్టు సీకో, పట్టు, కాటన్ చీరలు రూపొందించడం ప్రారంభించారు. సహజసిద్ధమైన రంగులు, సంప్రదాయ సొగసులతో విభిన్న డిజైన్ల చీరలు నేస్తున్నారు. వారసత్వంగా వస్తున్న కళకు జీవం పోస్తూ... ప్రత్యేకతను చాటుకొంటున్నందుకు గానూ గతంలో జాతీయ పురస్కారం సైతం అందుకున్న ఘనత ఇక్కడి కళాకారులది.

ఎంతో ప్రత్యేకం...

సీకో, పట్టు చీరల తయారీకి బెంగళూరు, ధర్మవరం, రాయదుర్గం నుంచి నాణ్యమైన పట్టును నేతన్నలు దిగుమతి చేసుకొంటున్నారు. వీరు తయారు చేసే చీరలకు మరో ప్రత్యేకత ఉంది. అదే 'కుట్టు'. అంటే అల్లిక. సాధారణంగా చీర నేసేటప్పుడు ఈ చివర నుంచి ఆ చివరకు ఒకే దారం వేస్తారు. కానీ ఇక్కడ అంచును, చీర బాడీని విభిన్న రంగు దారాలతో కలుపుతూ కుట్టు వేస్తారు. ఈ చీరలను హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, బెంగళూరు, కోల్‌కత్తా తదితర ప్రధాన నగరాలకు సరఫరా చేస్తారు. అక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ తదితర దేశాలకు కూడా ఎగుమతి అవుతాయి.

ఐదు వేల కుటుంబాలకు...

ఒక చీర నేయడానికి డిజైన్, జరీ బుట్టల సంఖ్యను బట్టి ఐదు నుంచి పన్నెండు రోజుల సమయం పడుతుంది. జరీ అంచు కాటన్ చీరకు రూ.3 వేలు, సీకో చీరకు రూ.3,500 నుంచి రూ.4 వేలు, పట్టు చీరకు రూ.5 నుంచి 8 వేలు, టర్నింగ్ బోర్డర్ చీరకు గరిష్ఠంగా రూ.12 వేల వరకు కూలీ చెల్లిస్తారు. ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని ప్రాంతాల్లో 120 మందికిపైగా మాస్టర్ వీవర్స్ ఉన్నారు. దాదాపు ఐదు వేల చేనేత కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు.

అంతర్జాతీయ గుర్తింపు కోసం...

స్వాతంత్ర్యానికి పూర్వమే ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు ఎనలేని గుర్తింపు తీసుకువచ్చారు మాచాని సోమప్ప. చెక్క మగ్గంపై నేతన్నలు ఉత్పత్తి చేసే జిందగీ దుప్పట్లు, బర్ఫ్ ఐ తువ్వాళ్లు వారి నైపుణ్యానికి అద్దం పడతాయి. 'నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' పంపిణీ చేసే మృదువైన నూలు దారాలను వీటి తయారీకి ఉపయోగిస్తున్నారు. ఇక్కడ మాత్రమే ఉత్పత్తి చేసే ఈ చేనేతలకు అంతర్జాతీయ గుర్తింపును ఇచ్చే జియోగ్రాఫికల్ ఇండెక్స్ (జీఐ) లేదు. దాని కోసం హైదరాబాద్‌కు చెందిన 'రిజల్యూట్ బీ2బీ' సంస్థ ఎమ్మిగనూరులో క్షేత్ర స్థాయిలో పర్యటించింది. ఒక నివేదిక సిద్ధం చేసి, జీఐ కోసం సంబంధిత శాఖకు పంపించింది. అంతేకాదు... కేంద్ర ప్రభుత్వం 2025-26కు 'ఒక జిల్లా- ఒక ఉత్పత్తి' (ఓడీఓపీ) కింద ఎమ్మిగనూరు చేనేతలను ఎంపిక చేసింది.

'మిస్ వరల్డ్'లో మెరుపులు...

గద్వాల పట్టు చీరలుగా మార్కెట్‌లో అమ్మకాలు సాగించే ఎమ్మిగనూరు చేనేతలు 'మిస్ వరల్డ్'లో పోటీపడ్డ అందగత్తెల మనసు దోచుకున్నాయి. హైదరాబాద్‌లో ఈ ఏడాది మేలో జరిగిన ఈ మెగా ఈవెంట్‌కు వచ్చిన విదేశీ భామలు... ఓరుగల్లు, వేయిస్తంభాల గుడి, రామప్ప ఆలయాలను సందర్శించారు. ఆ సమయంలో కొందరు అందగత్తెలు ఎమ్మిగనూరు పట్టు చీరలు, పరికిణీలు ధరించి అలరించారు.

● గోరంట్ల కొండప్ప, కర్నూలు
ఫొటోలు, ఎస్‌ఎండీ రఫీ

బతుకుతూ... బతుకునిస్తూ...



నేను మాస్టర్ వీవర్ని. జరీ అంచు పట్టు, సీకో చీరలు తయారు చేస్తున్నాను. మగ్గమే నాకు ఆధారం. నేనే కాకుండా... మరో యాభై మంది మహిళలకు కూడా ఉపాధి కల్పిస్తున్నాను. అందుకు నాకు ఎంతో సంతృప్తిగా, సంతోషంగా ఉంది. మా అమ్మ లక్ష్మమ్మ, నాన్న కాశీనాథప్పలది నందవరం గ్రామం. మేం ముగ్గురు సంతానం. అందరికీ చేనేతే జీవనాధారం. ఈ కళ నాకు వారసత్వంగా వచ్చింది. నేను ఆరో తరగతిలో ఉండగా, చదువు మాన్పించి ఇంట్లో వాళ్లు మగ్గంపై నేయడం నేర్పించారు. తరువాత ఎమ్మిగనూరుకు చెందిన ఈరన్నకు ఇచ్చి నా పెళ్లి చేశారు. మాకు ఇద్దరు కూతుళ్లు, కొడుకు. అత్తింటివారికి కూడా మగ్గమే ఆధారం. నేను, మావారు పట్టు చీరలు నేసేవాళ్లం. మాస్టర్ వీవర్ అయిన మావారు... ఆర్థిక స్థోమత లేని కార్మికులకు మగ్గాలు ఇచ్చి ఆదుకున్నారు. అంతా ఆనందంగా సాగిపోతుందనుకున్న సమయంలో అనారోగ్యంతో మావారు మరణించారు. అప్పటి నుంచీ కుటుంబ భారం నా మీద పడింది. ఆత్మస్థైర్యంతో నిలబడ్డాను. నా కళకు మరింత సృజన జోడించి మాస్టర్ వీవర్‌గా రాణిస్తున్నాను. నెలకు దాదాపు వంద చీరలు నేస్తున్నాను. హైదరాబాద్, గద్వాలకు సరఫరా చేస్తున్నాను. అయితే మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహమూ లేదు. అన్‌సీజన్‌లో తక్కువ వడ్డీలకు బ్యాంకు రుణాలు ఇప్పించి ఆదుకొంటే... ఈ కళను నమ్ముకుని జీవిస్తున్న మాలాంటి కుటుంబాలకు భరోసా కలుగుతుంది.

- జొల్లి శాంతి ఈరమ్మ, మాస్టర్ వీవర్

ఆరోగ్యానిచ్చే అటిక మామిడి!

చాలా అనారోగ్యాలకు సహజ పరిష్కారాలు మన చుట్టూనే ఉన్నా చాలామందికి వాటి గురించి తెలియదు. అలాంటి ఓ మొక్క 'అటిక మామిడి'. ఈ మొక్క గురించి వివరాలు తెలుసుకుందాం..



ఈ మొక్కను పునర్నవ మొక్క అని కూడా అంటారు. ఇది రోడ్ల పక్కన, పొలాల్లో, ఖాళీ స్థలాల్లో విరివిగా పెరుగుతుంది. ఇది భారతదేశంతో పాటు ఆసియా, ఆఫ్రికా, అమెరికా దేశాలలోనూ పెరుగుతుంది. ఈ మొక్కకు చిన్నని గులాబీ రంగు పువ్వులు పూస్తాయి. ఈ మొక్కను ఆయుర్వేద వైద్యంలో వినియోగిస్తారు. దీనిని మూత్రపిండాల సమస్యలను తగ్గించేందుకు వాడతారు.

కాలేయ సమస్యలు, రక్తహీనత, ఉబ్బసం, వాపులు తగ్గించేందుకు కూడా వినియోగిస్తారు. ఇంకా ఈ మొక్క వేరులను అధిక మూత్ర విసర్జన సమస్యకు పరిష్కారంగా వాడతారు. ఈ మొక్క మధుమేహం, రక్తపోటును నియంత్రణలో ఉంచేందుకు ఉపయోగపడుతుంది. అలాగే నేలంతా పరుచుకుని నేల కోతకు గురి కాకుండా కాపాడుతుందీ మొక్క.

● డాక్టర్ శ్రీనాథ్,
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్

నోటి పూత తగ్గేదెలా?




శరీరంలో పోషకాలు తగ్గితే రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. అందులో నోటిపూత కూడా ఒకటి. కొందరికి తరచూ ఈ సమస్య తలెత్తుతుంది. దీని వలన తినడానికి, తాగడానికే కాదు మాట్లాడడానికి కూడా చాలా ఇబ్బంది అవుతుంది. దీని నుంచి ఎలా ఉపశమనం పొందాలో తెలుసుకుందాం..

- తేనెలో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు నోటిపూత నుంచి ఉపశమనం కలిగిస్తాయి. కాబట్టి నోటిలో పుండ్లకు తేనె రాయాలి.
- కొబ్బరి నీరు తాగడం వలన కూడా నోటి పూతను తగ్గించుకోవచ్చు. అలాగే కొబ్బరి నూనె రాయడం, కొబ్బరి నమలడం వలన కూడా ప్రయోజనం ఉంటుంది.
- నోటి అపరిశుభ్రత వలన కూడా నోటి పూత వస్తుంది. కాబట్టి ప్రతిరోజూ రెండుసార్లు బ్రష్ చేసుకోవాలి.
- నోటి పూతకు ఓ ముఖ్య కారణం బి విటమిన్ లోపం. కాబట్టి బి విటమిన్, పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలి.

మైలురాయి రంగుల మర్మం ఇదే..!

మనం రోడ్డు మీద నడుస్తున్నప్పుడు, బస్సు లేదా రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు రకరకాల రంగుల్లో ఉన్న మైలురాళ్లను చూస్తూ ఉంటాం. మైలురాయి కింది భాగంలో తెలుపు రంగు ఉంటుంది. దీనిమీద నిర్ణీత నగరానికి లేదా గ్రామానికి ఉన్న దూరం.. కిలోమీటర్లలో రాసి ఉంటుంది. పై భాగంలో పసుపు, ఆకుపచ్చ, నీలం, కాషాయం రంగుల్లో ఒకటి ఉంటుంది. దీనిమీద కొన్ని ఆంగ్ల అక్షరాలు, కొన్ని నెంబర్లు ఉంటాయి. ఇలా మైలురాయి మీద ఉన్న ఒక్కో రంగు... ఆ రహదారికి సంబంధించిన సమాచారాన్ని సూచిస్తుంది. ఆ వివరాలు...



- పసుపు-తెలుపు రంగుల మైలురాయి ఉంటే ఆ రహదారి నేషనల్ హైవే అని అర్థం. ఇలాంటి రోడ్లు దేశంలోని ప్రధాన నగరాలను, రాష్ట్రాలను కలుపుతుంటాయి. వీటిని సుదూర ప్రయాణాలు, వేగంగా వెళ్లే వాహనాలకు అనుకూలంగా రూపొందిస్తారు. ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా పసుపు రంగు స్పష్టంగా కనిపిస్తుంది. కాబట్టి మైలురాయిమీద పసుపు రంగు వేసి ఎన్‌హెచ్ (నేషనల్ హైవే) నెంబరు రాస్తారు.



- ఆకుపచ్చ-తెలుపు రంగుల మైలురాయి కనిపిస్తే ఆ రహదారి స్టేట్ హైవే అని అర్థం. ఈ రోడ్లు రాష్ట్రంలోని నగరాలను, పట్టణాలను కలుపుతాయి. వీటి మీద ఎస్‌హెచ్(స్టేట్ హైవే) నెంబరు ఉంటుంది.



- నీలం లేదా నలుపు-తెలుపు రంగుల మైలురాయి... సిటీ రోడ్ లేదా డిస్ట్రిక్ట్ రోడ్‌లను సూచిస్తుంది. ఇవి పట్టణ కేంద్రాలు, మునిసిపాలిటీలను అనుసంధానిస్తాయి.



- కాషాయం-తెలుపు రంగుల మైలురాయి... విలేజ్ రోడ్‌ను సూచిస్తుంది. ఈ రోడ్లు జిల్లాలోని గ్రామాలను కలుపుతుంటాయి. నారింజ రంగును గ్రామీణాభివృద్ధికి సూచికగా పరిగణిస్తారు. అందుకే గ్రామాల మధ్య రాకపోకలకు అనువుగా ఈ రోడ్లను నిర్మిస్తారు.

ఫ్యాషన్ వరల్డ్‌లో దశ దిశలా...

విశ్వవేదికపై భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమంటే సాధారణ విషయం కాదు. అందులోనూ ఫ్యాషన్ వరల్డ్ అంటే పోటీ తీవ్రంగా ఉంటుంది. అటువంటి పోటీల్లో తొలిసారి పాల్గొని ఓవరాల్ విన్నర్‌గా నిలిచింది విశాఖకు చెందిన దిశ పల్నాటి. దుబాయ్ వేదికగా జరిగిన మిస్ అండ్ మిస్టర్ గ్రాండ్ సీ వరల్డ్ పోటీల్లో పాల్గొని దిశ తన ప్రతిభను చాటింది. ఈ సందర్భంగా 'నవ్య'తో పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లో...





"మాది విశాఖపట్నం. నాన్న పీఎస్ రవికుమార్ ఇండియన్ నేవీలో కెప్టెన్‌గా పని చేస్తున్నారు. అమ్మ వాలంటీనాకు ఫ్యాషన్ రంగంతో సంబంధం ఉంది. జాతీయ స్థాయిలో నిర్వహించిన అనేక కల్చరల్ ఫెస్ట్‌లకు అమ్మ డైరెక్టర్‌గా వ్యవహరించింది. చిన్నప్పటి నుంచి అమ్మను చూస్తూ పెరిగిన నాకు తెలియకుండానే ఫ్యాషన్ రంగం పట్ల ఆసక్తి పెరిగింది. నేను నాలుగో తరగతి చదువుతున్న సమయంలో దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో 'లిటిల్ మోడల్ ఎర్త్' పోటీల్లో పాల్గొన్నా. చిన్నపిల్లల కేటగిరిలో 'సూపర్ గ్రాండ్ ప్రీ విన్నర్‌'గా నిలిచాను. ఆ తరువాత 2016లో గ్రీస్‌లో నిర్వహించిన 'లిటిల్ మిస్ యునైటెడ్ వరల్డ్' పోటీల్లో పాల్గొన్నా. దాంట్లో కూడా రెండు విభాగాల్లో నాకు బహుమతులు దక్కాయి. ఈ పురస్కారాలు నాలో కొత్త ఉత్సాహాన్ని రేకెత్తించాయి. 2018లో టర్కీలో జరిగిన లిటిల్ మిస్ యూనివర్స్ పోటీల్లో 'క్వీన్ ఆఫ్ యూనివర్స్' టైటిల్ దక్కించుకున్నా. ప్రస్తుతం నేను మణిపాల్ జైపూర్ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ చేస్తున్నా.

దేశాన్ని ప్రతిబింబించేలా..

ఇటీవల దుబాయ్ వేదికగా నిర్వహించిన మిస్ అండ్ మిస్టర్ గ్రాండ్ సీ వరల్డ్-2025 కాంపిటీషన్‌లో పాల్గొన్నా. ఈ పోటీల్లో 19 దేశాల నుంచి లిటిల్, టీన్, మిస్, మిసెస్ కేటగిరీల నుంచి 60 మంది పాల్గొన్నారు. ఈ పోటీల ప్రత్యేకత ఏమిటంటే- వీటిలో వ్యక్తిగతంగా ఎవరికీ గుర్తింపు ఉండదు. అందరూ తమ తమ దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. తొలిరోజు క్యాట్‌వాక్ సెషన్ జరిగింది. ఆ తరువాత నేషనల్ కాస్ట్యూమ్ రౌండ్ నిర్వహించారు. ఈ రౌండ్‌లో ఇన్‌క్రెడిబుల్ ఇండియా థీమ్‌తో దేశాన్ని ప్రతిబింబించేలా కాస్ట్యూమ్ వేసుకున్నా. బ్లూ శారీ, వింగ్స్. తలపై కిరీటం పెట్టుకున్నా. దానిపై జాతీయ పక్షి నెమలి ఉండేట్టు చూసుకున్నా. 'నీ బట్టలకు నేవీ బ్లూ ఎందుకు వాడారు?' అని జడ్జీలు ప్రశ్నించారు. "తాతగారు నేవీలో పనిచేశారు. నాన్న ఇప్పుడు పనిచేస్తున్నారు. అందుకోసమే.. వారికి గౌరవ సూచకంగా ఈ రంగు బట్టలు వేసుకున్నా" అని చెప్పాను. ఆ తర్వాత- " చీర అంటే ఏమిటి " అని అడిగారు. " శరీరాన్ని చూపించకుండా అందాన్ని చూపించేది చీర.. మా దేశ సంప్రదాయానికి ప్రతీక" అని చెప్పాను. జడ్జీలు మెచ్చుకొని నాకు బెస్ట్ కాస్ట్యూమ్ అవార్డు ఇచ్చారు. ఆ తర్వాత ఇంటర్వ్యూ రౌండ్, గ్రాండ్ సీ కాస్ట్యూమ్ రౌండ్, టాలెంట్ రౌండ్‌లు జరిగాయి. అన్ని కేటగిరీలు పూర్తయిన తరువాత విజేతల ప్రకటన దశ వచ్చింది. మూడు కేటగిరీల్లో విజేతలను ప్రకటించారు. టీన్ కేటగిరీ పేరు అనౌన్స్ చేయగానే అంతా ఇండియా అంటూ నినాదాలు చేశారు. అయితే అనూహ్యంగా బల్గేరియాకు టీన్ కేటగిరీ విన్నర్ అవార్డును ఇచ్చారు. దాంతో నాకు అవార్డు రాలేదని నిరాశ చెందా. బాధపడ్డా. ఆ తర్వాత ఈ సారి ఓవరాల్ విన్నర్ అవార్డులు ఇస్తున్నామని ప్రకటించారు. అందులో ఇండియా పేరును ప్రకటించడంతో నా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

ఇండియన్ నేవీలో చేరతా..

ఫ్యాషన్ పట్ల చిన్నప్పటి నుంచి అమ్మను చూసి ఆసక్తి పెరిగింది. ఆసక్తి ఉన్న రంగంలోనే ఎదగాలని.. ఎవరో ఏదో అనుకుంటారని ఆగిపోకూడదని అమ్మ నాన్న చెప్పేవారు. నేను ఆ దారిలోనే ప్రయాణిస్తున్నా. నాకు ఫ్యాషన్ ఒక హాబీ. కానీ నేవీలో చేరడమనేది నా కల. ఇక మీదట దాని కోసమే ప్రయత్నిస్తా.

● బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం

తాజా కూరగాయలను ఇలా గుర్తించాలి...!

బజార్లో కూరగాయలు కొనేటప్పుడు అన్నీ బాగున్నట్లే కనిపిస్తుంటాయి. కానీ ఇంటికి తెచ్చిన మరుసటి రోజే పాడైపోతూ ఉంటాయి. అలాకాకుండా చిన్న చిట్కాలతో తాజా కూరగాయలను ఎలా గుర్తించాలో తెలుసుకుందాం...



- బంగాళ దుంపలు గుండ్రంగా, గోధుమ రంగులో ఉండాలి. ఆకుపచ్చ లేదా నల్లని మచ్చలు ఉన్న వాటిని కొనకూడదు. దుంప గట్టిగా ఉండాలి. ఏమాత్రం మెత్తగా అనిపించినా అవి తొందరగా పాడవుతాయని గుర్తించాలి.
- నాలుగు లేదా అంతకుమించి తమ్మెలు ఉన్న క్యాప్సికమ్... ఎక్కువ గింజలతో తియ్యగా ఉంటుంది. మూడు తమ్మెలు ఉన్నవి ఒక్కోసారి చేదుగా ఉండవచ్చు.
- టమాటాలు కొనేటప్పుడు లేత పసుపు రంగులో గుండ్రంగా గట్టిగా ఉన్నవాటిని ఎంచుకోవాలి. ఎర్రగా మెత్తగా ఉండేవి తొందరగా పాడవుతాయి. ఆకుపచ్చగా కనిపించేవి చేదుగా ఉండవచ్చు.
- బీన్స్ కొనేటప్పుడు ఒకదాన్ని మధ్యకు విరిస్తే తేలికగా విరిగినట్లయితే అవి తాజావని గుర్తించాలి. ఆకుపచ్చని రంగులో సన్నగా నిటారుగా ఉన్నవి కూరకు బాగుంటాయి. లేత పసుపు రంగులో కాస్త లావుగా ఉంటే అవి ముదిరినవని అర్థం.
- పొట్లకాయ, సొరకాయలను బొటనవేలి గోటితో గుచ్చినప్పుడు లోతైన ఆకుపచ్చని గుర్తు ఏర్పడితే అవి తాజా కాయలని చెప్పవచ్చు.
- బెండకాయలు నున్నగా, సన్నగా ఉంటే లేత కాయలని తెలుసుకోవచ్చు. వీటి కొనలను చేత్తో విరిస్తే విరుగుతాయి. అలా విరగకపోయినా వాటిపై సన్నని నూగు కనిపిస్తున్నా, మరీ లావుగా ఉన్నా వాటిని ముదురు కాయలుగా గుర్తించాలి.
- దోసకాయలు.... గట్టిగా ముదురు ఎరుపు రంగులో ఉన్నవాటిని మాత్రమే తీసుకోవాలి. ఇవి పులుపు లేదా తీపి రుచుల్లో ఉంటాయి. బంగారు లేదా లేత పసుపు రంగులో ఉండేవి, ఆకుపచ్చని చారలు ఉన్నవి ఒక్కోసారి చేదుగా ఉండవచ్చు.
- దొండకాయలు కొనేటప్పుడు గట్టిగా ఉన్నవాటినే ఏరుకోవాలి. మెత్తగా ఉంటే పండినవని గుర్తించాలి.

మేకప్

దీపికలా దేదీప్యంగా...

బాలీవుడ్ నటి దీపికా పడుకొనె కాటుక కళ్లకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. అందుకోసం ఆమె అనుసరించే మేకప్ చిట్కాలను తెలుసుకుందాం!

మేకప్ ముఖం మీద సమంగా పరుచుకోవాలన్నా, ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉండాలన్నా ముఖం శుభ్రంగా ఉండాలి. కాబట్టి ముఖాన్ని సబ్బుతో కడిగి నునుపుదనం కోసం, మెరిసే బేస్ కోసం హైడ్రేటింగ్ మాయిశ్చరైజర్ పూసుకోవాలి. ఆ తర్వాత మేకప్ నిలిచి ఉండేలా ప్రైమర్‌ను అప్లై చేసుకోవాలి.



- చర్మపు ఛాయను మెరుగుపరిచేలా లైట్‌వెయిట్ ఫౌండేషన్‌ను ఎంచుకుని, నీళ్లలో తడిపి పిండిన స్పాంజ్‌తో ఫౌండేషన్‌ను ముఖం మీద అద్దుకోవాలి.
- కళ్ల దిగువన కన్‌సీలర్‌ను పూసుకుని, మచ్చలు చర్మంలో కలిసిపోయేలా సరి చేసుకోవాలి
- కనురెప్పలకు షిమ్మరింగ్ గోల్డ్ ఐల్యాషెస్ పెట్టుకోవాలి. కోల్ పెన్సిల్‌తో పైన, కింద కనురెప్పలను దిద్దుకోవాలి. తర్వాత వాల్యుమైజింగ్ మస్కారాతో కనురెప్పలను ఒత్తుగా మలుచుకోవాలి
- మెత్తని కాంటూర్ పౌడర్ లేదా క్రీమ్‌తో చెక్కిళ్ల ఎముకలు, దవడ ఎముకలు, నుదురులను చక్కని ఆకృతిలో మలుచుకోవాలి
- ఎత్తైన ప్రదేశాలైన కాలర్‌బోన్స్, ముక్కుల పైన హైలైటర్ అద్దుకోవాలి
- కనుబొమలను బ్రష్ చేసి, ఖాళీ జాగాల్లో బ్రో పెన్సిల్‌తో దిద్దుకోవాలి. క్లియర్ లేదా టింటెడ్ బ్రో జెల్ అద్దుకోవాలి
- న్యూడ్ లేదా మావ్ లిప్ లైనర్‌తో పెదవులకు ఆకృతినివ్వాలి. తర్వాత గ్లాసీ మావ్ లిప్‌స్టిక్‌ను అప్లై చేసి పెదవులను అందంగా తీర్చిదిద్దుకోవాలి
- చివర్లో, సెట్టింగ్ స్ప్రేతో మేకప్‌ను చెక్కుచెదరకుండా లాక్ చేసేయాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే అందానికి అందం సమకూరడంతో పాటు దీర్ఘకాలం పాటు చెక్కుచెదరని మేకప్ మీ సొంతమవుతుంది.

దిక్సూచి



సీఏ ఎవర్ గ్రీన్ కోర్సు

ఒకప్పుడు ఆర్ట్స్, కామర్స్ గ్రూపుల విద్యార్థులంటే చిన్న చూపు ఉండేది. చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ) లాంటి ప్రొఫెషన్స్ పాపులర్ అయ్యాక పరిస్థితి మారింది. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న సీఏల సంఖ్య కేవలం నాలుగు లక్షలు. 2050 నాటికి మన దేశానికి 50 లక్షల మంది సీఏలు అవసరం అని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' ప్రెసిడెంట్ చరణ్ జోత్ సింగ్ నంద ఇటీవలే ఒక మీడియా సమావేశంలో తెలిపారు. అంటే రాబోయే రోజుల్లో ఈ కోర్సుకు డిమాండ్ ఎలా ఉంటుందో అర్థం అవుతోంది. పాతికేళ్లుగా మన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు విదేశాల్లో ఎలా విజయం సాధిస్తున్నారో, అదేమాదిరిగా భవిష్యత్తులో చార్టర్డ్ అకౌంటెంట్లు కూడా మారే అవకాశం ఉంది. ఇంజనీరింగ్, మెడిసిన్‌తో పోలిస్తే ఈ కోర్సుకయ్యే ఖర్చు తక్కువ. ఉద్యోగం గ్యారంటీ. మారుతున్న అవసరాలు, మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా ఈ కోర్సులో మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి.

ఇటీవలి మార్పులు...

- గతంలో సీఏ ఇంటర్, ఫైనల్‌లో 8 పేపర్లు ఉంటే ఇప్పుడు అవి 6కి తగ్గాయి. విద్యార్థులు తరచూ ఫెయిల్ అయ్యే పేపర్లు తీసేశారు. ఒక ఎలక్టివ్ పేపర్‌ను జత చేశారు.
- ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్ పరీక్షలు గతంలో సంవత్సరానికి రెండు సార్లు జరిపితే ఇప్పుడు ఏటా మూడు సార్లు నిర్వహిస్తున్నారు.
- అలాగే సీఏ ఫైనల్ చేస్తూ మూడు సంవత్సరాల పాటు ఆర్టికల్‌షిప్(ప్రాక్టికల్ ట్రైనింగ్) చేయాల్సి వచ్చేది. కొత్త విధానంలో ఇది రెండు సంవత్సరాలు మాత్రమే.

కమ్యూనికేషన్ స్కిల్స్‌కి పెద్దపీట

సీఏ కోర్సులోని మొదటి దశ సీఏ-సీపీటీ స్థానంలో ఇప్పుడు సీఏ ఫౌండేషన్ చేరింది. పాత సీపీటీలో పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో, నెగెటివ్ మార్కింగ్‌లతో ఉండేది. కొత్త విధానంలో 50 శాతం ప్రశ్నలు వ్యాసరూపంలో, 50 శాతం ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఇవ్వనున్నారు. అంటే మొత్తం 4 పేపర్లలో 2 పేపర్లు డిస్క్రిప్టివ్ పేపర్లు. దీంతో నెగెటివ్ మార్కులకు అవకాశం లేదు.

● అలాగే సీపీటీ విధానం ఉన్నప్పుడు అందులోని నాలుగు పేపర్లకు ఒకేరోజు పరీక్ష నిర్వహించేవారు. కానీ కొత్త విధానంలో ఫౌండేషన్‌లోని 4 పేపర్లను నాలుగు రోజులు(ఒక్కోరోజు ఒక్కోపేపర్) పరీక్ష నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్ష రాసే అవకాశం ఏర్పడింది. అలాగే 'ఆర్టికల్‌షిప్'(ప్రాక్టికల్ ట్రైనింగ్)లో కూడా కొన్ని మార్పులు చేశారు. ఒకప్పుడు ఐపీసీసీలో(ఇప్పటి సీఏ ఇంటర్మీడియట్) రెండు గ్రూపులు(లేదా) కనీసం మొదటి గ్రూపు పాస్ అయిన వారికే ఆర్టికల్‌షిప్‌కి అవకాశం ఉండేది. ఇప్పుడు సీఏ ఇంటర్‌లో రెండు గ్రూపులు పూర్తి చేసిన వారికి మాత్రమే ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో చేరే అవకాశం కల్పించారు.

రెండో దశ ఇంటర్

సీఏ ఫౌండేషన్ పూర్తి చేసినవారు ఇంటర్ చదవడానికి అర్హులు. గ్రాడ్యుయేట్లు/ సీఎంఏ ఇంటర్/ సీఎస్ ఇంటర్ పూర్తి చేసిన వారు ఫౌండేషన్‌తో సంబంధం లేకుండా నేరుగా సీఏ ఇంటర్ పరీక్ష రాయవచ్చు. సీఏ ఇంటర్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 18,000/-. ఈ పరీక్షని మే నెలలో రాయాలనుకుంటే ముందు సంవత్సరం సెప్టెంబరు 1లోగా, సెప్టెంబరులో రాయాలనుకుంటే అదే సంవత్సరం జనవరి 1లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. జనవరిలో రాయాలనుకుంటే ముందు సంవత్సరం మే 1లోగా నమోదు చేయించుకోవాలి.

డిగ్రీ అర్హతతో: డిగ్రీ అభ్యర్థులు ఫౌండేషన్‌తో సంబంధం లేకుండా నేరుగా సీఏ ఇంటర్‌కు నమోదు చేయించుకోవచ్చు. కామర్స్ యూజీ/పీజీ అయితే 55శాతం మార్కులు, ఇతర డిగ్రీ/ పీజీ అయితే 60శాతం మార్కులు ఉండాలి. అయితే వీరు సీఏ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే నాలుగు వారాల ఐసీఐటీఎస్ఎస్(ఇంటిగ్రేటెడ్ కోర్సు ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్ స్కిల్స్) శిక్షణ తరగతులకు హాజరు కావాలి. దీని తరవాత ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రారంభించాలి. 8 నెలల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తిచేసిన వారే సీఏ ఇంటర్ పరీక్షకు అర్హులు.

● ఇంటర్‌లోని 6 పేపర్లను 2 గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో 3 పేపర్లు ఉంటాయి. ఒక్కోక్క పేపరు 100 మార్కులకు ఉంటుంది. ఇంటర్ పాస్ కావాలంటే ప్రతి పేపరులో 40 శాతం మార్కులు, గ్రూపు మొత్తం మీద 50 శాతం మార్కులు రావాలి. సీఏ ఇంటర్ రెండు గ్రూపులూ పూర్తి చేసిన వారు రెండు ఏళ్ల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తి చేయాలి.

ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఆర్టికల్‌షిప్): సీఏ ప్రాక్టికల్ ట్రైనింగ్‌ను గతంలో ఆర్టికల్‌షిప్ అని పిలిచేవారు. గతంలో ఈ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఆర్టికల్‌షిప్) మూడు సంవత్సరాలు ఉండేది. ఇప్పుడు దానిని రెండు సంవత్సరాలకు తగ్గించారు.

● సీఏ ఇంటర్ రెండు గ్రూపులూ పూర్తి చేసిన వారు ఇన్‌స్టిట్యూట్ వారి 4 వారాల ఏఐసీఐటీఎస్ఎస్(అడ్వాన్స్‌డ్ ఇంటిగ్రేటెడ్ కోర్సు ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్ స్కిల్స్) శిక్షణ కూడా తీసుకోవాలి. వీరికి ఉపకారవేతనం లభించే అవకాశం ఉంది.

మొదటి దశ ఫౌండేషన్

సీఏ ఫౌండేషన్ పరీక్ష సంవత్సరానికి మూడుసార్లు (జనవరి, మే, సెప్టెంబర్) నిర్వహిస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 9,000/-. ఈ ఫౌండేషన్ పరీక్ష మే నెలలో రాయాలనుకుంటే అదే సంవత్సరం జనవరి 1లోగా, సెప్టెంబరులో రాయాలనుకుంటే అదే సంవత్సరం మే 1లోగా నమోదు చేయించుకోవాలి. ఇక జనవరిలో రాయాలనుకుంటే ముందు సంవత్సరం సెప్టెంబరు 1లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇంటర్మీడియట్(లేదా), 10+2(లేదా) అందుకు సమానమైన పరీక్ష రాసిన వారు ఫౌండేషన్ కోర్సుకి నమోదు చేయించుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేసుకున్న నాలుగు నెలలకు ఫౌండేషన్ పరీక్ష రాయవచ్చు.

● ఇప్పటి సీఏ ఫౌండేషన్ స్థానంలో గతంలో నిర్వహించిన సీపీటీ పరీక్ష మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల రూపంలోనే ఉండేది. కానీ, ప్రస్తుత ఫౌండేషన్ పరీక్షలో 50 శాతం మార్కులను డిస్క్రిప్టివ్ పరీక్షగా, మరో 50 శాతం మార్కులను మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుగా పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇక ఫౌండేషన్‌లో ఉత్తీర్ణత సాధించాలన్న విద్యార్థి ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం మార్కులు సాధించాలి అలాగే 4 పేపర్లు కలిపి 400 మార్కులకు గాను 50 శాతం మార్కులు అంటే 200 మార్కులు సాధించాలి.

మూడో దశ ఫైనల్

సీఏ ఇంటర్ తదుపరి రెండు సంవత్సరాల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తిచేసిన వారు సీఏ ఫైనల్‌కు నమోదు(రిజిస్ట్రేషన్) చేయించుకొవచ్చు. దీని రిజిస్ట్రేషన్ ఫీజు 22,000/-. ఫైనల్ నమోదుకి తుది గడువు అంటూ ఏమీలేదు. ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తి కాబోతున్న సమయంలో ఫైనల్‌కి నమోదు కావచ్చు. అంటే ఫైనల్ పరీక్షకు దరఖాస్తు చేసేలోగా రిజిస్ట్రేషన్ పూర్తి కావాలి. ఫైనల్ పరీక్షను కూడా సంవత్సరానికి మూడు సార్లు అంటే జనవరి, మే, సెప్టెంబరు నెలల్లో నిర్వహిస్తారు.

● ఈ పరీక్ష మొత్తం 6 పేపర్లు. 2 గ్రూపులుగా(గ్రూపుకి 3 పేపర్ల చొప్పున) ఒక్కొక్క పేపర్ 100 మార్కులకు మొత్తం 600 మార్కులకి ఉంటుంది. విద్యార్థి వీలును బట్టి 6 పేపర్లు ఒకేసారి లేదా ఒక్కో గ్రూపు విడివిడిగా రాసుకోవచ్చు.

● ఇందులో పాస్ కావాలంటే ప్రతి పేపరులో 40 శాతం మార్కులు, గ్రూపు మొత్తం మీద 50 శాతం మార్కులు రావాలి.

రిజిస్ట్రేషన్ కోసం: www.icai.org/post/studentsservices లేదా 98851250001, 98851250003 హెల్ప్ లైన్ నెంబర్లని సంప్రదించవచ్చు.



ప్రకాశ్
డైరెక్టర్, మాస్టర్ మైండ్స్

జామ్ 2026



'జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్'(జామ్-2026) నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 22 ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ(టెక్నాలజీ), ఎంఎస్ రిసెర్చ్, ఎంఎస్సీ ఎంటెక్, జాయింట్ పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ(డ్యూయల్ డిగ్రీ) కోర్సుల్లో అడ్మిషన్లు జరుపుతారు. ఈసారి ఎంట్రెన్స్‌ను ఐఐటీ బాంబే నిర్వహించనుంది. 2025 సెప్టెంబరు 5 నుంచి దరఖాస్తులు దాఖలు చేయవచ్చు. ఎంట్రెన్స్ 2026 ఫిబ్రవరి 15న జరుగుతుంది. ఫలితాలు మార్చి 18న వెలువడుతాయి.

అర్హత: నిర్దేశిత విభాగాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా అర్హులే.

సబ్జెక్టులు: బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మేథ్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ జియాలజీ.

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి

దరఖాస్తులకు తుది గడువు: 2025 అక్టోబర్ 12 **వెబ్‌సైట్:** https://jam2026.iitb.ac.in

కేసీ మహీంద్రా స్కాలర్‌షిప్

'మహీంద్రా ఆల్ ఇండియా టాలెంట్ స్కాలర్‌షిప్-2025' కోసం కె.సి. మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో డిప్లొమా కోర్సులు అభ్యసించేందుకు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు సహాయం చేయడానికి స్కాలర్‌షిప్‌లను అందించనున్నారు.



- ఏటా రూ. 10,000 చొప్పున 550 మంది విద్యార్థులకు గరిష్ఠంగా 3 సంవత్సరాలపాటు ఈ స్కాలర్‌షిప్ అందజేస్తారు.
- 10/12వ తరగతి లేదా తత్సమాన పరీక్షలలో 60 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించి ఉండాలి. అలాగే డిప్లొమా కోర్సు కోసం ప్రభుత్వ/ గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశం పొంది ఉండాలి. కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హులు.
- **చివరి తేదీ:** 2025 ఆగస్టు 27.
- **వెబ్‌సైట్ :** www. kcmet.org

జాబ్ కార్నర్

హెడ్ కానిస్టేబుల్(రేడియో ఆపరేటర్), హెడ్ కానిస్టేబుల్(రేడియో మెకానిక్) గ్రూప్-సీ నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీకి అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ నోటిఫికేషన్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతోంది.

బీఎస్ఎఫ్‌లో 1121 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

- హెడ్ కానిస్టేబుల్(రేడియో ఆపరేటర్) 910
- హెడ్ కానిస్టేబుల్(రేడియో మెకానిక్) 211

వయసు: 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 23

వెబ్‌సైట్: https//rectt.bsf.gov.in/

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులో లోకల్ ఆఫీసర్లు


పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో తెలంగాణలో 50, ఆంధ్రప్రదేశ్‌లో 80 ఖాళీలు ఉన్నాయి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉండాలి. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. **చివరి తేదీ:** 2025 సెప్టెంబర్ 4

వెబ్‌సైట్: punjabandsindbank.co.in/

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మదరాసి యాక్షన్



అమరన్ చిత్రం ఘన విజయం తర్వాత శివ కార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మదరాసి'. ఏ.ఆర్ మురగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. తాజాగా చిత్రబృందం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది. 'నీలాగే ఇతరులను ప్రేమించు... అందరినీ నీ కుటుంబమే అనుకో' అంటూ హీరోయిన్ రుక్మిణి వసంత్ పలికిన డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆకట్టుకునేలా ఉంది. డైలాగ్ పూర్తయిన వెంటనే పవర్‌ఫుల్ లుక్, పవర్‌ప్యాక్డ్ యాక్షన్‌తో కథానాయకుడిని పరిచయం చేశారు. ఆయుధ అక్రమ రవాణా నేపథ్యంలో మురగదాస్ కథను తీర్చిదిద్దారని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ చిత్రంలో విద్యుత్ జమ్వాల్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. సెప్టెంబర్ 5న 'మదరాసి' ప్రేక్షకుల ముందుకు రానుంది.

రెండో పాటతో రెడీ



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. సెప్టెంబర్ 25న విడుదలవుతోంది. చిత్రబృందం ఆదివారం మరో అప్డేట్‌ను పంచుకుంది. వినాయక చవితి సందర్భంగా ఈ నెల 27న 'ఓజీ' నుంచి 'సువ్వీ సువ్వీ' అంటూ సాగే గీతాన్ని విడుదల చేయనున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రియాంక మోహన్‌తో కలసి పవన్ కల్యాణ్ కోనేటిలో దీపాలు వదులుతున్న లుక్‌ను పంచుకున్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బాలకృష్ణ



- భారతీయ సినీరంగంలో హీరోగా 50 సంవత్సరాల కెరీర్
- అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు, లోకేశ్

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకే గోల్డ్ ఎడిషన్‌లో ప్రముఖ సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేరు నమోదైంది. భారతీయ సినిమాలో 50 సంవత్సరాల పాటు హీరోగా సుదీర్ఘ కెరీర్‌ను సాధించినందుకు ఆయన పేరును నమోదు చేశారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సీఈవో సంతోష్ శుక్లా ఓ ప్రకటనలో.. బాలకృష్ణ ఐదు దశాబ్దాల సినిమా సేవలు లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని ప్రశంసించారు. ఈ నెల 30న వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు సంబంధించిన గుర్తింపు పత్రాన్ని హైదరాబాద్‌లో స్వయంగా బాలకృష్ణకు అందించనున్నట్లు శుక్లా తెలిపారు. లండన్ ప్రధాన కార్యాలయంగా ఉన్న వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంస్థ. బాలకృష్ణకు దక్కిన గుర్తింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. బాలకృష్ణ అసాధారణ సినీ ప్రస్థానానికి దక్కిన గుర్తింపుగా చంద్రబాబు కొనియాడారు. బాలయ్యకు అభినందనలు తెలిపారు. మంత్రి లోకేశ్ కూడా బాలకృష్ణకు అభినందనలు తెలిపారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

ఆ రోజే 'ఏం జరుగుతుందో..'

రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తోన్న సినిమా 'ది గర్ల్‌ఫ్రెండ్'. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్‌ని మేకర్స్ అనౌన్స్ చేశారు. 'ఏం జరుగుతోంది...' అంటూ సాగే గీతాన్ని ఈనెల 26న విడుదల చేయనున్నట్లు తెలిపారు. రాకేందు మౌళి సాహిత్యం అందించగా, చిన్మయి పాడారు. దీన్ని ఫీల్ గుడ్ లవ్ సాంగ్‌గా రూపొందించామని, సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.



రానా ఆవిష్కరించిన గీతం



అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి ముఖ్య తారాగణంగా మున్నా ధులిపూడి తెరకెక్కిస్తోన్న వినోదాత్మక చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్‌లైన్. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఇలా చూసుకుంటానే..' అంటూ సాగే గీతాన్ని హీరో రానా దగ్గుబాటి తన సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా ఆవిష్కరించారు. చంద్రబోస్ సాహిత్యానికి అనూప్ రూబెన్స్ స్వరాలు సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. 'ఈ పాటను జమ్మూ కశ్మీర్, మలేసియాలోని ప్రకృతి అందాలలో చిత్రీకరించామని, పూర్తిగా ఇది వినోద భరిత చిత్రం' అని యూనిట్ పేర్కొంది.

విశాల్ 'మకుటం'



హీరో విశాల్ 35వ ప్రాజెక్టుకు సంబంధించిన అప్డేట్ వచ్చింది. ఈ చిత్రానికి 'మకుటం' అనే పేరును మేకర్స్ ఖరారు చేసి టైటిల్ టీజర్‌ని రిలీజ్ చేశారు. రవి అరసు దర్శకత్వంలో సూపర్ గుడ్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆర్‌బీ చౌదరి నిర్మిస్తున్నారు. విశాల్ సరసన అంజలి కథానాయికగా నటిస్తున్నారు. టీజర్‌ను గమనిస్తే..ఇది సముద్రం నేపథ్యంలో నడిచే ఓ మాఫియా కథ అని అర్థమవుతోంది. జీవీ ప్రకాశ్ కుమార్ ఆర్‌ఆర్ అదిరిపోయింది. ఈ మూవీకి ఎన్.బి.శ్రీకాంత్ ఎడిటర్‌గా, దురైరాజ్ కళా దర్శకుడిగా, ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ రిచర్డ్ ఎం.నాథన్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, ఇతర వివరాల్ని త్వరలో వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు.

సీనియర్ కార్టూనిస్టు దర్శకుడు శంకు కన్నుమూత



సీనియర్ వ్యంగ్య చిత్రకారుడు, రచయిత, దర్శక, నిర్మాత సంపర భీమ శంకర కుమార్ అలియాస్ శంకు(78) ఇకలేరు. ఆయన ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో గుండెపోటుతో బాగ్ అంబర్ పేటలోని స్వగృహంలో హఠాన్మరణం చెందారు. శంకు స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా తణుకు. బాపూ బొమ్మల స్ఫూర్తితో 1962లో తన 16వ ఏట కుంచె పట్టిన శంకు ఆంధ్ర పత్రికకు రెండు దశాబ్దాలు బొమ్మలు, కార్టూన్లు గీశారు. ఉన్నత విద్య అనంతరం ప్రఖ్యాత దర్శకుడు బాపు దగ్గర తొమ్మిది సినిమాలకు దర్శకత్వ శాఖలో పని చేశారు. ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో కొంతకాలం పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 'మిస్టర్ పెళ్లాం' సినిమాకు నిర్మాతగా వ్యవహరించినా, ఉద్యోగ నిబంధనల కారణంగా టైటిల్స్ లో మాత్రం సహ నిర్మాతగా వేయించినట్లు తానే ఓ సందర్భంలో చెప్పారు. మునిమాణిక్యం 'కాంతం కథలు', శంకరమంచి 'అమరావతి కథలు' , వంశీ 'మా పసలపూడి కథలు', సయ్యద్ సలీం కథలను టెలివిజన్ ధారావాహికలుగా రూపొందించారు. అందుకుగాను నాలుగు నంది పురస్కారాలు అందుకున్నారు. తెలుగు కార్టూనిస్టులందరినీ ఒక వేదిక మీదకు తీసుకురావడంలో శంకు ప్రముఖ పాత్ర పోషించారు. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన 13 మంది కార్టూనిస్టుల జీవితంపై 'ఎమినెంట్ కార్టూనిస్ట్స్ ఆఫ్ ఇండియా' పేరుతో దూరదర్శన్‌కు డాక్యుమెంటరీ చిత్రాలు తీశారు. క్రోక్విల్ హాస్య ప్రియ పేరుతో ఓ మాస పత్రికను కూడా నిర్వహించారు. క్రోక్విల్ అకాడమీ ద్వారా వ్యంగ్య చిత్రకారులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణం ఇతివృత్తంగా శంకు గీసిన కార్టూన్‌కు బెల్జియంలోని నాకీస్ట్ అంతర్జాతీయ పురస్కారం లభించింది. సాహిత్య, కళా రంగాలలో శంకు అందించిన సేవలకుగాను 2015లో తెలుగు విశ్వవిద్యాలయం కీర్తిపురస్కారంతో సత్కరించింది. శంకు భార్య పేరు ఎల్లాప్రగడ శోభారాణి. ఆమె దూరదర్శన్ లో న్యూస్ రీడర్ గా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలందించారు. వీరికి ఇద్దరు పిల్లలు, కుమార్తె సత్య, కుమారుడు చైతన్య. శంకు భౌతికకాయానికి సినీ ప్రముఖులు వంశీ, బ్రహ్మానందం, రచయితలు భీం, సుధామ, కార్టూనిస్టు సరసి తదితరులు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆదివారం సాయంత్రం అంబర్ పేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తయ్యాయి.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

దుబాయ్‌లో 'గామా' వేడుక



'గామా'(గల్ఫ్ అకాడెమీ మూవీ అవార్డ్స్) అవార్డులకు టాలీవుడ్‌లో ఓ ప్రత్యేకత ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇప్పుడు ఐదో ఎడిషన్ వేడుకలను ఈనెల 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు ఏ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్, హీరోయిన్లు ఫరియా అబ్దుల్లా, మానస వారణాసి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'గామా' సీఈవో సౌరభ్ కేసరి మాట్లాడుతూ 'ఇది కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న ఈవెంట్ కాదు. కళాకారులపై మా నాన్న త్రిమూర్తులుకు ఉన్న అభిమానంతో అవార్డులు ఇస్తున్నాం. వచ్చే ఏడాది మరింత ఘనంగా నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం. అలాగే ఇతర దేశాల్లోనూ గామా అవార్డులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రపంచంలోని తెలుగు వారందర్నీ అబ్బురపరిచేలా ఈవెంట్‌ను నిర్వహించబోతున్నాం' అని చెప్పారు.

చికిత స్వర్ణ చరిత్ర

- ఆర్చరీ వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన తెలుగమ్మాయి
- సూరజ్‌కు రజతం



విన్నిపెగ్ (కెనడా): తెలుగమ్మాయి, యువ ఆర్చర్ తాని పర్తి చికితరావు స్వర్ణ చరిత్ర సృష్టించింది. ఆదివారం కెనడాలో ముగిసిన ఆర్చరీ ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ కాంపౌండ్ విభాగం అండర్-21లో చికిత పసిడి పతకం కొల్లగొట్టింది. ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా ఆర్చర్ చికితానే కావడం విశేషం. హోరాహోరీగా సాగిన ఫైనల్లో 20 ఏళ్ల చికిత 142-133తో స్పెయిన్ ఆర్చర్ పౌలా డియాజ్ మోరిల్లాస్‌పై విజయం సాధించింది. అంతకుముందు సెమీస్‌లో చికిత 142-136తో పార్క్ యెరిన్ (రిపబ్లిక్ ఆఫ్ కొరియా)పై, క్వార్టర్స్‌లో ఆసియా చాంపియన్, భారత్‌కే చెందిన పర్నీత్ కౌర్‌పై 146-143తో గెలిచింది. ఇక, పురుషుల అండర్-18 టీమ్ ఈవెంట్‌లో తెలుగు సంతతికి చెందిన అమెరికా ఆర్చర్ నాళం సూరజ్ కార్తికేయ బృందానికి రజత పతకం లభించింది. సూరజ్ తల్లిదండ్రుల స్వస్థలం రాజమండ్రి. సూరజ్ కూడా గతంలో రాజమండ్రిలో శిక్షణ తీసుకొన్నాడు.

ఆఖరి నిమిషం వరకు టెన్షన్..

'ఆంధ్రజ్యోతి'తో చికిత

మా స్వస్థలం తెలంగాణలోని పెద్దపల్లి. నాన్న శ్రీనివాస రావు రైతు. బాల్యం నుంచి ఆర్చరీపై మక్కువ. దీంతో విలు క్రీడనే కెరీర్‌గా ఎంచుకున్నా. గత రెండు జాతీయ క్రీడల్లో రజత, కాంస్య పతకాలు సాధించా. ఈ ఏడాది జరిగిన ఆసియాకప్‌లో నాలుగో స్థానంలో నిలిచి, త్రుటిలో పతకం కోల్పోయా. అమెరికాలో జరిగిన గత వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించినా వీసా సమస్యతో బరిలోకి దిగలేకపోయా. ఈసారి వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్‌నకు వీసా లభించినా కెనడా ఎయిర్‌లైన్స్ సమ్మె కారణంగా మా ప్రయాణ షెడ్యూల్ మొత్తం తలకిందులైంది. ఆఖరి నిమిషం వరకు కెనడా వెళ్లేందుకు మార్గం సుగమం కాలేదు. భారత్ నుంచి మొత్తం 36 మందితో కూడిన బృందం అక్కడికి వెళ్లాల్సి ఉండగా సమ్మె కారణంగా విడతల వారీగా వెళ్లాల్సి వచ్చింది. చివరి విడతకు వచ్చేసరికి ప్రయాణ అవకాశాలన్నీ దాదాపుగా మూసుకుపోగా 'సాయ్' అధికారుల గట్టి ప్రయత్నంతో నాతో పాటు మరో ఐదుగురు ఆర్చర్లు పోటీలకు కొన్ని గంటల ముందు కెనడాలో అడుగు పెట్టాం. సరైనా విశ్రాంతి లేకుండానే తొలి రెండు రౌండ్లలో పాల్గొన్నా. ఉత్కంఠభరితంగా జరిగిన క్వార్టర్స్‌లో ఆసియా చాంపియన్ పర్నీత్ కౌర్‌పై గెలిచాక పసిడి పతకం గెలుస్తానన్న నమ్మకం కలిగింది. అదే ఆత్మవిశ్వాసంతో సెమీస్, ఫైనల్‌లో పోటీపడి ఫలితం రాబట్టా. సీనియర్ క్రీడాకారుడు అభిషేక్ వర్మ సలహాలు సూచనలతో ఈ విజయం సాధించగలిగా.



అనిమేశ్.. అదిరెన్!

- 200 మీటర్ల రేసులో ప్రపంచ చాంపియన్‌షిప్ బెర్త్
- ఈ ఘనత సాధించిన తొలి భారత పురుష స్ప్రింటర్

న్యూఢిల్లీ: యువ స్ప్రింటర్ అనిమేశ్ కుజుర్ రికార్డు సృష్టించాడు. 200 మీటర్ల రేసులో ప్రపంచ చాంపియన్‌షిప్ బెర్త్ దక్కించుకున్నాడు. చెన్నైలో జరుగుతున్న జాతీయ అంతరాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో చత్తీస్‌గఢ్‌కు చెందిన అనిమేశ్.. 200 మీటర్ల రేసును 20.63 సెకన్ల రికార్డు టైమింగ్‌తో అధిగమించి స్వర్ణం సాధించాడు. ఈ ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో మెరుగైన అనిమేశ్.. వచ్చేనెల 13 నుంచి టోక్యో వేదికగా జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించాడు. ప్రపంచ టోర్నీలో 200 మీటర్ల రేసులో మొత్తం 48 మంది అథ్లెట్లు పోటీపడతారు. అయితే వీరిలో కొందరు కటాఫ్ టైమింగ్ (20.15 సెకన్లు)తో నేరుగా ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు ఎంపికైతే, మరికొందరికి ర్యాంకింగ్స్ ఆధారంగా బెర్త్ దక్కుతుంది. అంతరాష్ట్ర టోర్నీకి ముందు ప్రపంచ టోర్నీ రేసులో 42వ స్థానంలో ఉన్న అనిమేశ్.. తాజా ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో ముందుకెళ్లి బెర్త్ సాధించినట్టు భారత అథ్లెటిక్స్ సమాఖ్య తెలిపింది. ఈ క్రమంలో ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించిన తొలి పురుష స్ప్రింటర్‌గా 22 ఏళ్ల అనిమేశ్ చరిత్ర సృష్టించాడు.

నందిని దూరం

తెలుగు అథ్లెట్ నందిని అగసర ప్రపంచ చాంపియన్‌షిప్ నుంచి వైదొలిగింది. తెలంగాణకు చెందిన నందిని ఇప్పటికే హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో ప్రపంచ టోర్నీకి ఎంపికైనా.. గాయం కారణంగా టోక్యో క్రీడల్లో పాల్గొనడం లేదని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన నందిని.. ఆ ప్రదర్శనతో ప్రపంచ టోర్నీకి బెర్త్ దక్కించుకుంది. అయితే, ఆసియా చాంపియన్‌షిప్ సందర్భంగానే మోచేతికి గాయమైందనీ, తానింకా కోలుకోకపోవడంతోనే టోక్యో ఈవెంట్‌కు దూరమవుతున్నట్టు 22 ఏళ్ల నందిని స్పష్టం చేసింది.




రెండు స్వర్ణాలూ మనవే!

- ఐశ్వరీ, అడ్రియన్‌కు టైటిళ్లు
- ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప్ సీనియర్, జూనియర్ విభాగాల్లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. ఆదివారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3-పీ సీనియర్, జూనియర్ విభాగాల స్వర్ణ పతకాలు రెండూ మనోళ్లే కొల్లగొట్టారు. సీనియర్ పురుషుల 50 మీ. రైఫిల్ 3-పీ విభాగం తుది పోరులో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ టోమర్ 462.5 పాయింట్లతో పసిడి అందుకున్నాడు. చైనా, జపాన్ రజత, కాంస్యాలు నెగ్గాయి. అంతకుముందు..ఐశ్వరీ ప్రతాప్, చెయిన్ సింగ్, షెరాన్ త్రయం 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ టీమ్ విభాగంలో రజత పతకం చేజిక్కించుకుంది. జూనియర్ పురుషుల 50 మీ. రైఫిల్ 3-పీ కేటగిరీ ఫైనల్లో అడ్రియన్ కర్మాకర్ (463.8) ఆసియా రికార్డుతో స్వర్ణం సొంతం చేసుకున్నాడు. హన్ (చైనా) రజతం, వేదాంత్ నితిన్ (భారత్) కాంస్య పతకాలు సాధించారు. వేదాంత్, అడ్రియన్, రోహిత్‌తో కూడిన భారత జట్టు 50 మీ. రైఫిల్ 3-పీ టీమ్ పసిడి పతకం నెగ్గింది.

అమ్మాయిలు.. అదే జోరు

- భారత్ హ్యాట్రిక్ విజయం
- శాఫ్ అండర్-17 చాంపియన్‌షిప్

థింపూ (భూటాన్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-17 చాంపియన్‌షిప్‌లో భారత అమ్మాయిల దూకుడు కొనసాగుతోంది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ప్రత్యర్థిని చిత్తుచేసి హ్యాట్రిక్ విజయాన్నందుకున్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన పోరులో భారత్ 8-0తో ఆతిథ్య భూటాన్‌ను ఓడించింది. అనుష్క కుమారి (53వ, 61వ, 73వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించి భారత్ భారీ గెలుపులో కీలకపాత్ర పోషించింది. అభిస్త బాస్నెట్ (23వ, 89వ) రెండు.. పెర్ల్ ఫెర్నాండెజ్ (71వ), దివ్యాని లిండా (77వ), వలైనా ఫెర్నాండెజ్ (90+2వ నిమిషం) తలో గోల్ కొట్టారు. దీంతో టోర్నీలో ఓటమన్నదే లేని భారత అమ్మాయిలు.. మూడు విజయాలతో మొత్తం 9 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. బంగ్లాదేశ్, నేపాల్ చెరో మూడు పాయింట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

చటేశ్వర్ పుజార.. టెస్టు క్రికెట్‌కు అసలు సిసలైన పర్యాయపదం. యుద్ధభూమిలో సైనికుడి మాదిరి పట్టుదల, ఓర్పు అతడి సొంతం. ఓవైపు వికెట్లు పడుతున్నా నేనున్నాగా అనే భరోసాతో క్రీజులో గంటలకొద్దీ పాతుకుపోయి అతనాడిన ఇన్నింగ్స్ ఎన్నెన్నో. అతడికి బంతులు వేసీ వేసీ బౌలర్ల భుజాలు నొప్పి పుట్టాల్సిందేగానీ అతను మాత్రం అంత సులువుగా పెవిలియన్ చేరడు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలో బౌన్సీ, సీమ్ పిచ్‌లపై పేసర్ల బుల్లెట్‌లాంటి బంతులకు ఒళ్లు హూనమవుతున్నా బెదరకుండా శతకాలతో జట్టును గెలిపించిన ధీరుడు. టీమిండియా నయా వాల్‌గా మన్ననలందుకున్న ఈ సౌరాష్ట్ర హీరో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.

నయా వాల్ నిష్క్రమణ

క్రికెట్‌కు పుజార వీడ్కోలు

వన్‌డౌన్‌లో తిరుగులేని బ్యాటర్



న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో సీనియర్ల రిటైర్మెంట్ కొనసాగుతూనే ఉంది. తాజాగా చటేశ్వర్ పుజార 15 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకొంటున్నట్టు ఆదివారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. సౌరాష్ట్రకు చెందిన 37 ఏళ్ల పుజార 2010లో ఆస్ట్రేలియాపై బెంగళూరులో టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. దశాబ్దానికి పైగా వన్‌డౌన్ స్థానంలో జట్టుకు నమ్మదగ్గ బ్యాటర్‌గా సేవలందించాడు. ఈక్రమంలో జట్టుకు ఇంటా, బయటా చిరస్మరణీయ విజయాలు అందించాడు. కెరీర్‌లో ఆడిన 103 టెస్టుల్లో 43.60 సగటుతో 7,195 పరుగులు సాధించాడు. ఇందులో మూడు డబుల్ సెంచరీలు, 16 శతకాలున్నాయి. ఇక ఐదు వన్డేల్లో 51 పరుగులున్నాయి. జూన్, 2023లో జరిగిన వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ పుజార కెరీర్‌లో చివరిది. ఆ తర్వాత కొత్త తరం ఆటగాళ్లపై మేనేజ్‌మెంట్ దృష్టి సారించడంతో అతనికి ద్వారాలు మూసుకుపోయాయి. అయినా దేశవాళీల్లో సౌరాష్ట్ర, కౌంటీల్లో ససెక్స్ తరఫున కొనసాగాడు. ఓవరాల్‌గా కెరీర్ మొత్తంలో పుజార 278 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 51.82 సగటుతో 66 శతకాలు, మూడు ట్రిపుల్ సెంచరీలతో 21,301 పరుగులు చేశాడు.

మారథాన్ ఇన్నింగ్స్‌తో..

ద్రవిడ్ రిటైర్మెంట్ తర్వాత మూడో స్థానంలో పుజార జట్టుకు ఆశాకిరణంగా మారాడు. 2012, జూన్‌లో తొలి టెస్టు సెంచరీ కొట్టాడు. రెండు నెలల తర్వాత స్వదేశంలోనే ఇంగ్లండ్‌పై తొలి డబుల్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. అయితే క్రీజులో సుదీర్ఘ సమయం గడపడంలో తనను మించిన వారు లేరనే చెప్పవచ్చు. 2013 జొహాన్నెస్‌బర్గ్ టెస్టులో ఆరు గంటలపాటు క్రీజులో నిలిచి 153 పరుగులు సాధించడమే కాదు మ్యాచ్‌ను ఉత్కంఠభరిత డ్రాగా ముగించాడు. 2015లో కొలంబోలోనూ 289 బంతులనెదుర్కొని 145 పరుగులు చేశాడు. ఇక 2017లో రాంచీలో పుజార ఆడిన ఇన్నింగ్స్ గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే. ఆసీస్‌తో జరిగిన ఈ టెస్టులో తను ఏకంగా 11 గంటలపాటు పట్టు వదలకుండా పోరాటం సాగించి డబుల్ సెంచరీతో నిలిచాడు. ఈక్రమంలో భారత్ తరఫున రికార్డు స్థాయిలో 525 బంతుల (87.5 ఓవర్లు)ను ఆడడం విశేషం. అదే ఏడాది ఈడెన్ గార్డెన్స్‌లో శ్రీలంకపై 5రోజుల పాటు క్రీజులో నిలిచి అరుదైన ఫీట్ సాధించాడు. భారత్ తరఫున ఎంఎల్ జైసింహ, రవిశాస్త్రి తర్వాత ఈ ఘనత అందుకున్న మూడో భారత ఆటగాడిగా పుజార రికార్డులకెక్కాడు.

ఆసీస్ గడ్డపై తొలిసారి..

భారత క్రికెట్ చరిత్రలో 2018-19 ఆస్ట్రేలియా పర్యటన చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. ఎందుకంటే ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా తొలిసారి టెస్టు సిరీస్ సాధించగలిగింది. ఈ ఘనతలో పుజారదే కీలక పాత్ర. అడిలైడ్, మెల్‌బోర్న్, సిడ్నీలలో శతకాలు బాదిన తను అత్యధికంగా 521 పరుగులతో జట్టుకు తొలి సిరీస్ విజయాన్నందించాడు. ఆ తర్వాత రెండేళ్లకు భారత్ అక్కడ మరో సిరీస్ గెల్చుకోగలిగింది. ఈసారి పుజార నాలుగు అర్ధశతకాలతో అండగా నిలిచాడు. బ్రిస్బేన్ టెస్టులో ఆసీస్ బౌలర్లు అతడి శరీరాన్ని లక్ష్యంగా చేసుకున్నా నొప్పిని భరిస్తూనే 200కి పైగా బంతులు ఆడి 56 రన్స్ చేయడం గమనార్హం.

క్రికెట్ నాకెంతో ఇచ్చింది..

"**రా**జ్‌కోట్‌లాంటి పట్టణం నుంచి వచ్చిన నేను చిన్నతనం నుంచే భారత జట్టులో చోటు కోసం కలలు కన్నాను. కానీ క్రికెట్ నాకెంతో ఇవ్వబోతున్నదనే విషయం అప్పట్లో నాకు తెలీదు. కాలక్రమంలో భారత జెర్సీ ధరించి జాతీయ గీతాలాపన చేయడం, జట్టుకు నా తరఫున అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నించడం.. ఇవన్నీ మాటల్లో వర్ణించలేని అనుభవాలు. కానీ ఎప్పుడైనా సరే ఇలాంటి మధుర అనుభూతులకు కూడా ముగింపు పలకాల్సిందే. అందుకే అపారమైన కృతజ్ఞతతో అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ నా ధన్యవాదాలు. కెరీర్ ఆసాంతం నాకు అండగా నిలిచిన బీసీసీఐ, సౌరాష్ట్ర క్రికెట్ సంఘానికి ధన్యవాదాలు. నా మార్గదర్శకులు, కోచ్‌లు, మెంటార్, ఆధ్యాత్మిక గురువు నా ఎదుగుదలలో తోడ్పడ్డారు. ముఖ్యంగా నా తల్లిదండ్రులు, భార్య, కూతురు, ఇతర కుటుంబ సభ్యుల అండ లేకుంటే ఇక్కడిదాకా వచ్చేవాణ్ని కాదు. సహచర క్రికెటర్లు, సహాయక సిబ్బంది, నెట్ బౌలర్లు, అంపైర్లు అనలిస్టులు, గ్రౌండ్ స్టాఫ్, మేనేజ్‌మెంట్‌ల సహకారం కూడా మరువలేనిది."

పుజార కెరీర్ ఇలా..

ఫార్మాట్	మ్యాచ్‌లు	పరుగులు	సెంచరీలు
టెస్టులు	103	7,195	19
వన్డేలు	5	51	0
ఫస్ట్ క్లాస్	278	21,301	66

ఉక్కు సంకల్పం



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఆశలు కొడిగడుతున్న వేళ.. అలుపెరుగని యోధుడిలా అవకాశాలు సృష్టిస్తాడు. ప్రత్యర్థుల దెబ్బకు జట్టు అల్లకల్లోలమైనా.. నేనున్నానంటూ ధీశాలిలా ఎదురొడ్డుతాడు. ఓర్పు.. నేర్పుతో పరిస్థితులను చక్కదిద్దుతాడు.. తర్వాతి బ్యాటర్లకు భరోసాగా నిలుస్తాడు. అతడే భారత జట్టు నయా వాల్ చటేశ్వర్ పుజార. దశాబ్దానికి పైగా టీమిండియాకు పెట్టని కోటగా నిలిచిన పుజార శకం ముగిసింది.

కోహ్లీలా కవర్ డ్రైవ్ ఆడలేడు.. రిషభ్ పంత్‌లా విధ్వంసం సృష్టించనూలేడు. బంతిని బలంగా బాదుతూ.. వీక్షకులకు వెర్రెత్తిస్తున్న టీ20 జమానాలో.. క్లాసిక్ క్రికెట్‌కు మచ్చుతునక! టీమిండియా వాల్ రాహుల్ ద్రవిడ్ రిటైరైనప్పుడు.. నేనున్నాంటూ జట్టుకు అండగా నిలిచాడు. నిస్వార్థం, ఉక్కు సంకల్పంతో.. మూడో నెంబర్‌లో గుబాళించాడు. ఆటగాడిగా పెద్దగా స్టార్‌డమ్ లేకపోవచ్చు.. అంతులేని అభిమాన గణం మాత్రం అతని సొంతం.

ఫోర్లు, సిక్స్‌లు, స్ట్రయిక్ రేట్‌తో పుజార సేవలను కొలవలేం. జట్టు కోసం సర్వస్వం ధారపోస్తాడు. ప్రపంచంలోని అత్యుత్తమ బౌలింగ్‌ను ఎదుర్కొని.. జట్టును ప్రమాదం నుంచి గట్టెక్కించేందుకు శతవిధాలా పాటుపడతాడు. బుల్లెట్ లాంటి బంతులు శరీరాన్ని తాకుతున్నా.. అదరడు.. బెదరడు. కోహ్లీ లాంటి వాళ్లు టెస్టుల్లో శతకాల మీద శతకాలు బాదొచ్చు.. కానీ, దానికి బలమైన పునాది మాత్రం పుజారానే!

మాజీ రంజీ ఆటగాడు అరవింద్ కుమారుడే చటేశ్వర్ పుజార. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన పుజారకు చిన్నతనం నుంచే క్రికెట్‌పై మక్కువ ఉండేది. చిన్నవయసులోనే తల్లిని కోల్పోవడంతో.. పుజారకు అరవింద్ అన్నీ తానై చూసుకొన్నాడు. అసలుసిసలు టెస్టు క్రికెట్ మనస్తత్వాన్ని అతడిలో నాటుకొనేలా చేశాడు. తన తల్లి మరణించినప్పుడు కూడా పుజార ఆ బాధను బయటకు కనిపించకుండా తనలోనే తాను దిగమింగుకోవడం అతడి సహనశీలతకు నిదర్శనమని అరవింద్ ఒకానొక సమయంలో చెప్పాడు. అండర్-14 క్రికెట్‌లో త్రిశతకం బాదిన పుజార ఇంగ్లండ్‌లో అండర్-19 విభాగంలో డబుల్ సెంచరీ సాధించాడు. స్ట్రోక్ ప్లేయర్ కాకపోయినా.. పటిష్టమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థి బౌలర్లను అలసిపోయేలా చేస్తాడు. గంటల కొద్దీ క్రీజులో ఉన్నా ఏమాత్రం అలసట దరిచేరనీయకుండా ఆడడం అతడి ప్రత్యేకత. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించిన చటేశ్వర్.. 2010లో బెంగళూరులో ఆస్ట్రేలియాపై అరంగేట్రం చేశాడు. పదేళ్లకుపైగా భారత టెస్టు క్రికెట్‌కు వెన్నుముకగా నిలిచిన పుజార 2023లో చివరగా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఆడాడు. గాయాలు, వరుస వైఫల్యాలతో జట్టులో చోటు కోల్పోయాడు.

మాటల్లో పొదుపు..



'ద డైరీ ఆఫ్ ఏ క్రికెటర్స్ వైఫ్: ఎ వెరీ అన్ యూజువల్ మెమోయిర్' పుస్తకంలో తన భర్త స్వభావం గురించి పుజార భార్య పూజ కొన్ని విషయాలు పంచుకొంది. 'తక్కువగా మాట్లాడతాడు. చిరునవ్వుతో పనైపోతుందనుకొంటే.. మౌనం పాటిస్తాడు. అతడి నోటి వెంట పదాలు పొదుపుగా వెలువడతాయి. ఈ తరం క్రికెటర్లకు భిన్నం' అని రాసింది. పుజార కెరీర్ కోసం అతని కుటుంబం చేసిన త్యాగాల గురించి రాసుకొచ్చింది. ఇక భగవద్గీత తమ జీవితాల్లో చూపిన ప్రభావం గురించి తన పుస్తకంలో వివరించింది.

- మూడో స్థానంలో నువ్వు బ్యాటింగ్‌కు వెళ్తున్నప్పుడల్లా అదే భరోసా. ఆడిన ప్రతిసారీ టెస్ట్ క్రికెట్ స్థాయిని పెంచావు. నీ బలమైన టెక్నిక్, సంయమనంతో జట్టుకు మూలస్తంభంగా నిలిచావు. 2018లో ఆస్ట్రేలియాపై గెలుపు నువ్వు లేకుంటే సాధ్యమయ్యేదే కాదు. **-సచిన్ టెండూల్కర్**
- కష్టకాలంలో జట్టుకు గోడలా అడ్డు నిలిచావు. ఆశలు ఆవిరవుతున్న వేళ.. పోరాటంతో స్ఫూర్తిని రగిలించావు **- గంభీర్**
- గాబాలో నీ ఆటతో ఫ్యాన్‌గా మారిపోయా. జట్టు కోసం ఏదైనా చేస్తావు. సెకండ్ ఇన్నింగ్స్‌లో నీకు మరిన్ని శుభాలు కలగాలి. **- వీవీఎస్ లక్ష్మణ్**
- నిజమైన పోరాట యోధుడు. నా హయాంలో జట్టు నెం.1 ర్యాంక్‌ను సొంతం చేసుకోవడంలో పుజారది ముఖ్య భూమిక. ఆస్ట్రేలియాపై వరుసగా సిరీస్ నెగ్గడంలో నీ ప్రదర్శన అమోఘం. **- రవిశాస్త్రి**
- నిస్వార్థం, దృఢ సంకల్పానికి నిలువెత్తు నిదర్శనం. టెస్ట్ క్రికెట్ స్ఫూర్తిని కొనసాగించావు. అకుంఠిత దీక్షతో జట్టుకు గోడలా నిలిచావు. నిబద్ధతతో దేశ క్రికెట్‌కు సేవలందించావు. **- బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా**
- క్రికెట్‌కు అత్యుత్తమ రాయబారివి. నీ ఘనతలను చూసి గర్విస్తున్నాం. నీతో కలసి పనిచేసే అవకాశం దక్కడం గొప్పగా భావిస్తున్నా. **- కుంబ్లే**

సింధు, సేన్‌కు సవాల్




ప్రపంచ చాంపియన్‌షిప్ నేటి నుంచి

పారిస్: ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత ఏస్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్‌కు కఠిన పరీక్ష ఎదురుకానుంది. చాంపియన్‌షిప్‌లో ఐదు పతకాలు సాధించిన సింధు ఈ సీజన్‌లో పేలవ ఫామ్‌లో సాగుతోంది. ఇండియా ఓపెన్‌లో క్వార్టర్స్ చేరడమే ఆమె అత్యుత్తమ ప్రదర్శన. సోమవారం నుంచి జరిగే ప్రపంచ టోర్నీ తొలి రౌండ్‌లో కలోయానా నల్బంటోవాతో సింధు తలపడనుంది. ఒకవేళ ముందుకు సాగితే ప్రీక్వార్టర్స్‌లో వరల్డ్ నెం.2 వాంగ్ జి యి రూపంలో సింధుకు గండం పొంచి ఉంది. లక్ష్య సేన్, ప్రణయ్ ప్రదర్శన కూడా అంతంత మాత్రంగానే ఉంది. పారిస్ ఒలింపిక్స్ సెమీస్‌లో ఓటమి తర్వాత సేన్ కోలుకోలేక పోతున్నాడు. తొలి రౌండ్‌లో షి యు కితో సేన్, జోయాకిమ్‌తో ప్రణయ్ ఆడనున్నారు. డబుల్స్‌లో 9వ సీడ్ సాత్విక్-చిరాగ్, మిక్స్‌డ్‌లో ధ్రువ్-తనీషా జంటలకు తొలిరౌండ్‌లో బై లభించింది. హరిహరన్-రుబన్, ప్రియ-శ్రుతి, రితు-శ్వేత, రోహన్-రుత్విక శివాని జోడీలు బరిలో ఉన్నాయి.

రికార్డుల హోరు

సఫారీలపై ఆఖరి వన్డేలో 276 రన్స్‌తో ఆస్ట్రేలియా గెలుపు



హెడ్ (142)

మెకే (ఆస్ట్రేలియా): దక్షిణాఫ్రికాతో ఇప్పటికే సిరీస్ కోల్పోయిన ఆస్ట్రేలియా నామమాత్రమైన మూడో వన్డేలో దుమ్ము రేపింది. టాప్-3 బ్యాటర్లు హెడ్ (142), కెప్టెన్ మిచెల్ మార్ష్ (100), కామెరూన్ గ్రీన్ (118 నాటౌట్) సెంచరీలతో కదం తొక్కిన వేళ రికార్డులతో హోరెత్తించింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఏకంగా 276 పరుగులతో సఫారీలపై ఘన విజయం సాధించింది. తద్వారా వన్డేలలో దక్షిణాఫ్రికాకు అత్యంత భారీ ఓటమిని రుచి చూపించింది. తొలుత ఆతిథ్య జట్టు 50 ఓవర్లలో 431/2 స్కోరు చేసింది. వన్డేలలో ఆసీస్‌కిది రెండో అత్యధిక స్కోరు. అనంతరం యువ స్పిన్నర్ కూపర్ కొనొలీ (5/22) ధాటికి దక్షిణాఫ్రికా 24.5 ఓవర్ల 155 పరుగులకే కుప్పకూలింది. బ్రేవిస్ (49), జోర్జి (33) ఆదుకోకపోతే పర్యాటక జట్టు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. మొత్తంగా..తొలి రెండు వన్డేలలో ఓడి సిరీస్ చేజార్చుకున్న ఆస్ట్రేలియా ఆఖరి మ్యాచ్‌లో గెలిచి ఓదార్పు దక్కించుకుంది.

కొద్దిలో రికార్డు చేజారింది: అంతకుముందు ఆస్ట్రేలియా వన్డేలలో తమ అత్యధిక స్కోరు 434/4ను తిరగరాసే అవకాశాన్ని 4 పరుగుల తేడాతో కోల్పోయింది. ఆ స్కోరును కూడా సౌతాఫ్రికాపైనే 2006లో సాధించడం గమనార్హం. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఓపెనర్లు హెడ్, మార్ష్ విరుచుకుపడ్డారు. 34 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 250 పరుగులు జత చేశారు. ఎంపాక 6 ఓవర్లలో 73, ముల్డర్ 7 ఓవర్లలో 93, ముత్తుసామి 9 ఓవర్లలో 75 రన్స్ సమర్పించుకున్నారు. 35వ ఓవర్లో హెడ్‌ను కేశవ్..కొద్దిసేపటికే మార్ష్‌ను ముత్తుసామి అవుట్ చేశారు. ఆ తర్వాత గ్రీన్.. బౌలర్ల భరతం పట్టాడు. దాంతో చివరి 10 ఓవర్లలో ఆసీస్ 126 రన్స్ రాబట్టింది. ఈక్రమంలో గ్రీన్ సెంచరీ, కేరీ హాఫ్ సెంచరీ పూరించారు.

ఆస్ట్రేలియా: 50 ఓవర్లలో 431/2 (హెడ్ 142, మార్ష్ 100, గ్రీన్ 118 నాటౌట్, కేరీ 50 నాటౌట్, కేశవ్ మహరాజ్ 1/57, ముత్తుసామి 1/75).

దక్షిణాఫ్రికా: 24.5 ఓవర్లలో 155 ఆలౌట్ (బ్రేవిస్ 49, జోర్జి 33, కొనొలీ 5/22, అబాట్ 2/27, బార్ట్‌లెట్ 2/45).

దిగ్గజాల సరసన..

హాల్ ఆఫ్ ఫేమ్‌లో షరపోవా, బ్రయాన్ బ్రదర్స్



న్యూపోర్ట్ (యూఎస్): మాజీ టెన్నిస్ స్టార్ మరియా షరపోవా, డబుల్స్ లెజెండ్స్ బ్రయాన్ బ్రదర్స్‌కు టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటుదక్కింది. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో షరపోవాతోపాటు మైక్, బాబ్ బ్రయాన్‌ల పేర్లను దిగ్గజాల సరసన చేర్చారు. ఈ కార్యక్రమానికి అమెరికా టెన్నిస్ క్వీన్ సెరెనా విలియమ్స్ ప్రత్యేక అతిథిగా హాజరై అందరినీ ఆశ్చర్యపర్చింది. స్టేజ్ వెనుక నుంచి రంగప్రవేశం చేసిన సెరెనా.. 'మాజీ ప్రత్యర్థి, మాజీ అభిమాని.. చిరకాల స్నేహితురాలు' అంటూ షరపోవాను సభకు పరిచయం చేసింది. ప్రతిష్ఠాత్మక హాల్ ఆఫ్ ఫేమ్‌లో మరియా షరపోవాను చేర్చుతున్నట్టు ప్రకటించింది.



సెరెనాతో షరపోవా

షెల్టన్, రదుకాను శుభారంభం: మాజీ చాంపియన్ ఎమ్మా రదుకాను, ఆరో సీడ్ బెన్ షెల్టన్ యూఎస్ ఓపెన్‌లో శుభారంభం చేశారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో రదుకాను 6-1, 6-2తో షిబహారాపై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో వోండ్రుసోవా 6-3, 7-6 (3)తో సెలెఖిమెటోవాని, 31వ సీడ్ ఫెర్నాండెజ్ 6-2, 6-1తో మరీనోను ఓడించి రెండో రౌండ్‌కు చేరారు. పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో షెల్టన్ 6-3, 6-2, 6-4తో బుసెపై , 16వ సీడ్ మెన్సిక్ 7-6(5), 6-3, 6-4తో జారీపై, 18వ సీడ్ డవిడోవిచ్ 6-1, 6-1, 6-2తో షెవ్‌చెంకోపై నెగ్గారు.

సొసైటీ డైరెక్టర్ ఇంట్లో యూరియా స్వాధీనం

- 26 బస్తాలు అక్రమంగా నిల్వ.. కేసు నమోదు
- రాష్ట్రంలో యూరియా కోసం రైతుల పాట్లు
- ఉదయం నుంచి క్యూలో నిల్చున్నా నిరాశే



కరీంనగర్ జిల్లా ఇందుర్తిలో యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఓ సొసైటీ డైరెక్టర్ 26 యూరియా బస్తాలను దారి మళ్లించి ఇంట్లో దాచేశాడు. రైతుల ఫిర్యాదుతో అతని బండారం బయటపడింది. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలాయపెల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రాయపర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా తిర్మలాయపెల్లిలో గోదాం ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి లారీలో 444 యూరియా బస్తాలు రాగా, అందులో 26 బస్తాలను సొసైటీ డైరెక్టర్ దొంతరబోయిన యాదగిరి తన ఇంట్లో దింపుకున్నాడు. మిగతా బస్తాలను గోదాంలో నిల్వ ఉంచారు. రైతులకు టోకెన్లు ఇచ్చి యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్నారు. అయితే, యూరియా బస్తాలు అయిపోగా, టోకెన్లు మిగలడంతో అధికారులు కంగుతిన్నారు. యూరియా బస్తాలు డైరెక్టర్ యాదగిరి ఇంట్లో ఉన్నాయని ఫిర్యాదు చేయడంతో పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రా రెడ్డి, ఏవో వీరభద్రం, ఏఈవోలు అతని ఇంటికి వెళ్లి చూడగా బస్తాలు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని యాదగిరిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఏవో తెలిపారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో యూరియా కోసం రైతుల కష్టాలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేశారు. నంగునూరు మండలం పాలమాకుల, రాంపూర్, మగ్దుంపూర్, ముండ్రాయి, ఓబులాపూర్, బద్దిపడగ, నర్మెట్ట, వెంకటాపూర్ తదితర గ్రామాల రైతులు యూరియా కోసం బారులు తీరారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదిక వద్ద టోకెన్లు ఇస్తే, సొసైటీ వద్ద యూరియా బస్తాలు అందజేశారు. పాలమాకులలో పోలీస్ పహారాలో అధికారులు రైతులకు యూరియా పంపిణీ చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో రైతులు శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు యూరియా కోసం పడిగాపులు కాశారు. చెప్పులు లైన్‌లో పెట్టి దాదాపు 500 మంది వేచి చూశారు. చివరికి 410 యూరియా బస్తాలు రావడంతో అధికారులు ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. దీంతో దాదాపు 300 మంది రైతులు తీవ్ర నిరాశతో వెనుతిరిగాల్సి వచ్చింది. ఖమ్మం జిల్లా కారేపల్లి సొసైటీ ఎదుట భారీ సంఖ్యలో రైతులు ఆదివారం తెల్లవారుజాము నుంచే క్యూ కట్టారు. 500 మందికి పైగా రైతులు క్యూలో నిల్చుని ఉండగా.. 335 బస్తాల యూరియా మాత్రమే వచ్చింది. దీంతో అధికారులు, సొసైటీ సిబ్బంది రైతులకు నచ్చచెప్పి.. ముందుగా క్యూలో ఉన్న వారికి యూరియా బస్తాలు ఇచ్చి పంపించారు.



సురవరం భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఎండీ వేమూరి రాధాకృష్ణ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, డిప్యూటీ సీఎం భట్టి తదితరులు

సురవరానికి తుది వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా సంఘాల నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. మధ్యాహ్నం 3 గంటలకు సురవరం భౌతిక కాయానికి పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయాన్ని గాంధీ వైద్య కళాశాలకు అప్పగించేందుకు అంతిమ యాత్ర మొదలైంది. ఇందులో భాగంగా హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు పోలీసుల మార్చ్ సాగింది. అక్కడి నుంచి రెడ్ వాలంటీర్లు కవాతు చేశారు. నారాయణగూడ చౌరస్తా, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, ముషీరాబాద్ మీదుగా యాత్ర సాగింది. సాయంత్రం 4.45 గంటలకు సురవరం భౌతిక కాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఈ సందర్భంగా విప్లవ జోహార్లు అంటూ కార్యకర్తలు పాటలు పాడుతూ సుధాకర్‌రెడ్డికి కడసారి వీడ్కోలు పలికారు.

రేవంత్, చంద్రబాబు నివాళి..

సీపీఐ దిగ్గజ నేత సురవరం సుధాకర్ రెడ్డి పేరును శాశ్వతంగా గుర్తుండేలా చేస్తామని, ఈ మేరకు క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలకు ఆదర్శంగా నిలిచిన వారిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. మఖ్దూం భవన్‌లో సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి రేవంత్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును హార్టికల్చర్ యూనివర్సిటీకి, జైపాల్‌రెడ్డి పేరును పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నామకరణం చేసి వారిని గౌరవించుకున్నామని, అదే కోవలో సుధాకర్‌రెడ్డి పేరు కూడా శాశ్వతంగా నిలిచిపోయేలా చేస్తామని తెలిపారు. సుధాకర్‌రెడ్డి లాంటి గొప్ప నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. చిన్న నాటి నుంచి ప్రజల పక్షాన నిలబడి.. ప్రజల కోసం పోరాడారని కొనియాడారు. సురవరం మృతి సీపీఐకి, దేశానికి తీరని లోటని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి చంద్రబాబు అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సురవరంతో తనకు సుదీర్ఘ స్నేహం ఉందని చంద్రబాబు తెలిపారు. ఆయనకు అనేక ఉద్యమాలు నడిపిన అనుభవం ఉందని అన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సురవరం భౌతిక కాయానికి నివాళులు అర్పించి, సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్, జానారెడ్డి, కోదండరాం తదితరులు సురవరం భౌతిక కాయానికి నివాళులర్పించారు.



మఖ్దూం భవన్ నుంచి గాంధీ వైద్య కళాశాలకు సాగుతున్న సురవరం అంతిమ యాత్ర

సురవరం మద్దతు మరువలేనిది : కేటీఆర్

తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించి చిరస్మరణీయ ముద్ర వేసుకున్న సురవరం సుధాకర్‌రెడ్డి మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సురవరం భౌతిక కాయానికి ఆదివారం ఆయన నివాళులు అర్పించారు. సురవరంతో ఉన్న అనుభవాలను కేసీఆర్ గుర్తుచేసుకున్నారని, కేసీఆర్ తరఫున సుధాకర్ రెడ్డికి నివాళులర్పిస్తున్నామని చెప్పారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, పలువురు బీఆర్‌ఎస్ నేతలు సుధాకర్‌రెడ్డికి నివాళులర్పించారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు కె.శ్రీనివాస్, అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి, జయ ప్రకాష్ నారాయణ, మాజీ సీజేఐ ఎన్వీ రమణ తదితరులు సుధాకర్‌రెడ్డికి నివాళులు అర్పించారు.

సురవరం మా తొలి ప్రొఫెసర్

సుధాకర్ రెడ్డి భౌతిక కాయాన్ని వైద్య కళాశాలకు అప్పగించడం స్ఫూర్తిదాయకం. ఆయన గాంధీ కళాశాల విద్యార్థులకు తొలి అనాటమీ ప్రొఫెసర్ అవుతారు. ఆయన శరీరం ద్వారా ఎంతో మంది విద్యార్థులు వైద్య శాస్త్రాన్ని నేర్చుకుంటారు. మరణంలోనూ సేవ చేయాలన్న ఆయన ఆశయం మాకు గొప్ప స్ఫూర్తి. ఆయన కుటుంబ సభ్యులు, సీపీఐ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

- ఇందిర, గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్

కాటేపల్లి టైర్ల రీసైక్లింగ్ పరిశ్రమలు మూసివేయాలి

- కాలుష్యంతో అనారోగ్యాల బారిన స్థానికులు
- మూసివేయకపోతే ఆందోళనలు చేపడతాం
- అఖిలపక్ష సమావేశంలో వక్తలు

పంజాగుట్ట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి, దాని పరిసర గ్రామాలలో కాలుష్యాన్ని వెదజల్లుతున్న టైర్ల రీసైక్లింగ్ పరిశ్రమలను మూసివేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు, వ్యవసాయ భూములను కాపాడాలని కోరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కాటేపల్లి, పొరుగు పల్లెలను కాష్టంలో కాలుస్తున్న టైర్ల రీసైక్లింగ్ పరిశ్రమల కాలుష్యంపై అఖిలపక్ష సమావేశం జరిగింది. తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జస్టిస్ బి.చంద్ర కుమార్, బీఆర్‌ఎస్ నాయకురాలు తుల ఉమ, మాజీ ఎమ్మెల్యే వి.శ్రీరాములు, శాస్త్రవేత్త ప్రొఫెసర్ బాబూరావు, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి తదితరులు పాల్గొని మాట్లాడారు. పర్యావరణ నిబంధనల ప్రకారం ఇటువంటి పరిశ్రమలను పారిశ్రామిక వాడలలో ఏర్పాటు చేయాలని, కానీ చట్టాలకు విరుద్ధంగా వ్యవసాయ భూములలో స్థాపించారని వారు తెలిపారు. అక్రమ పద్ధతుల్లో కాలుష్య నియంత్రణ మండలి నుంచి సర్టిఫికెట్లు పొంది ఈ పరిశ్రమలను నడిపిస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమల నుంచి వచ్చే దట్టమైన పొగ, నల్లటి బూడిద, భరించలేని దుర్వాసన వల్ల స్థానికులు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లటి బూడిద వల్ల పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు దెబ్బతిని మార్కెట్లో వాటికి సరైన ధర లభించడం లేదని రైతులు తెలిపారు. పరిశ్రమల నిర్మాణ సమయంలోనే వాటిని అడ్డుకున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదని గ్రామ ప్రజలు ఆరోపించారు. ఎనిమిది నెలలుగా ఈ సమస్యతో బాధపడుతున్నా ఎవరూ స్పందించడం లేదని వారు వాపోయారు. కాలుష్యం వెదజల్లుతున్న ఈ పరిశ్రమలను వెంటనే మూసి వేయకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

టీవీవీపీలో క్యాడర్స్‌ను తగ్గించవద్దు

- ఆస్కీ సిఫారసులను సవరించాలి
- వైద్య ఉద్యోగుల ఐక్య వేదిక డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని జిల్లా, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ కేంద్రాలు, మాతాశిశు సంరక్షణ కేంద్రాల్లో ఉద్యోగుల సంఖ్య నిర్ధారణ, సెకండరీ హెల్త్ కేర్ సర్వీసెస్‌గా మార్చడం కోసం ఏర్పాటైన ఆస్కీ (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా) సిఫారసులు ఉద్యోగుల్లో ఆందోళన రేపేలా ఉన్నాయని వైద్య ఉద్యోగుల ఐక్య వేదిక ఓ ప్రకటన విడుదల చేసింది. టీవీవీపీలో క్యాడర్స్‌ను తగ్గించవద్దని పేర్కొంది. 'టీవీవీపీలో ప్రస్తుతమున్న 117 క్యాడర్స్‌ను 81కు కుదించాలని.. 36 క్యాడర్స్‌కు చెందిన ఉద్యోగాలను ఎత్తేయాలని.. ప్రస్తుతమున్న 12,589 మంది ఉద్యోగులను 11,662కు కుదించాలని ఆస్కీ నివేదికలో పేర్కొంది. ఈ సిఫారసులను వెంటనే సవరించాలి' అని ఐక్య వేదిక చైర్మన్ ఎంఎస్ మూర్తి, కన్వీనర్ పరబ్ కుమార్ సర్కారును డిమాండ్ చేశారు.

25,000 వద్ద పరీక్ష



వి. సుందర్ రాజా

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం మానసిక అవధి 25,000 వరకు వెళ్లినా అక్కడ నిలదొక్కుకోలేకపోయింది. శుక్రవారం నాడు ఏర్పడిన బలమైన రియాక్షన్‌తో ఆ స్థాయి కన్నా దిగజారింది. వారం మొత్తానికి 240 పాయింట్ల లాభంతో 24,870 వద్ద వారం కనిష్ఠ స్థాయికి చేరువలో ముగిసింది. గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తతకు ఇది సంకేతం. మార్కెట్లో ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. అయితే మిడ్‌క్యాప్-100 సూచీ 1125 పాయింట్లు లాభపడి 57,630 వద్ద స్మాల్‌క్యాప్-100 సూచీ 370 పాయింట్ల లాభంతో 17,920 వద్ద ముగిశాయి. ట్రెండ్‌లో సానుకూలత కోసం తదుపరి నిరోధాల వద్ద బలంగా నిలదొక్కుకోవాల్సి ఉంది. అమెరికన్ మార్కెట్లో గత శుక్రవారం నాటి ర్యాలీ కారణంగా ఈ వారం మన మార్కెట్ పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు.

బుల్లిష్ స్థాయిలు: గరిష్ఠ స్థాయిల్లో మరింత కన్సాలిడేషన్ ఉండవచ్చు. మార్కెట్ ఈ వారంలో స్వల్పకాలిక నిరోధం, మానసిక అవధి 25,000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఆ పైన ప్రధాన నిరోధం 25,250.

బేరిష్ స్థాయిలు: 25,000 వద్ద విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయి 24,850. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 24,500.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో 56,000 స్థాయిని బ్రేక్ చేసినా శుక్రవారం నాటి బలమైన రియాక్షన్ కారణంగా వారం మొత్తానికి 190 పాయింట్ల నష్టంతో 55,150 వద్ద ముగిసింది. ప్రధాన మద్దతు స్థాయి 55,000 కన్నా పైనే ఉంది. తదుపరి నిరోధం 55,700 కన్నా పైన నిలదొక్కుకుంటే పాజిటివ్ సంకేతం ఇస్తుంది. తదుపరి ప్రధాన నిరోధం 56,200.

పాటర్న్: నిఫ్టీ ఇప్పుడు 25,000 సమీపంలో ఉన్న 50 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. అదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద కూడా నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళ, శుక్రవారాల్లో మైనర్ రివర్సల్స్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,000, 25,060
మద్దతు	24,940, 24,850

టెక్, ఏఐకు భారత్ అద్భుత మార్కెట్

- ఏఐతో కొత్త రకం ఉద్యోగాలు
- మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్



న్యూఢిల్లీ: టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ)కు భారత్ అద్భుతమైన మార్కెట్ అని మైక్రోసాఫ్ట్ ఇండియా భావిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఏడాది లేదా ఏడాదిన్నరలో నూటికి 82 కంపెనీలు తమ ఉద్యోగులకు ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతుంటే, భారత్‌లో మాత్రం 93 శాతం కంపెనీలు ఇందుకు సిద్ధంగా ఉన్నట్టు సంస్థ ప్రెసిడెంట్ పునీత్ చందోక్ చెప్పారు. ఈ గిరాకీని తట్టుకునేందుకు పెద్దసంఖ్యలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, అప్లికేషన్స్ ఇంజనీర్లు అవసరమవుతారన్నారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ కోడింగ్‌లో 30 శాతం ఏఐ ద్వారానే రాస్తున్నట్టు తెలిపారు. భారత్‌లో తమ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐలో 300 కోట్ల డాలర్లు పెట్టుబడి పెడుతున్నట్టు తెలిపారు.

ఏఐపై అనవసర భయాలు: ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలను చందోక్ తోసిపుచ్చారు. కొన్ని ఉద్యోగాలు పోయినా, ఏఐ ఆర్కెస్ట్రేటర్, ఏఐ ఏజెంట్ మేనేజర్, ఏజెంట్ బాస్, ప్రాంప్ట్ ఇంజనీర్ వంటి అనేక కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయన్నారు. అయితే ఇందుకు అవసరమైన పూర్తి స్థాయి ఏఐ నైపుణ్యాలను యువత అలవర్చుకోక తప్పదన్నారు. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావంపై అడిగిన ప్రశ్నకు మాత్రం చందోక్ నేరుగా సమాధానం ఇవ్వలేదు. అయితే ఆర్థిక సంబంధాలు ప్రపంచ పురోగతికి దోహదం చేస్తాయన్నారు. ఐదేళ్లలో భారత్‌లో కోటి మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యానికి మైక్రోసాఫ్ట్ ఇండియా కట్టుబడి ఉన్నట్టు తెలిపారు.

ఫార్మా ఎగుమతుల్లో 5 % వృద్ధి



జూన్ త్రైమాసికంలో రూ.65,860 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: అనిశ్చిత పరిస్థితుల్లోనూ భారత ఫార్మా ఎగుమతులు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో భారత్ నుంచి 757 కోట్ల డాలర్ల (సుమారు రూ.65,860 కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 5.21 శాతం ఎక్కువ. ఫార్ములేషన్లు, బయోలాజిక్స్ విభాగాలు ఎగుమతులు పెరిగేందుకు బాగా దోహదం చేశాయి. కాగా ఇదే కాలంలో విదేశాల నుంచి మన దేశానికి దిగుమతయ్యే ఫార్మా ఉత్పత్తులు 4.21 శాతం పెరిగి 78.6 కోట్ల డాలర్లకు చేరినట్టు ఫార్మెగ్జిల్ చైర్మన్ నమిత్ జోషి చెప్పారు. జూన్ త్రైమాసికంలో భారత్‌కు దిగుమతైన ఫార్మా ఉత్పత్తుల్లో 46 శాతం బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియరీలు ఉన్నాయి. అమెరికా మార్కెట్లో ధరల ఒత్తిడి, టారిఫ్ సమస్యలు ఉన్నా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగతా త్రైమాసికాల్లోనూ ఎగుమతుల వృద్ధి రేటు కొనసాగుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) లో భారత్ నుంచి 3,047 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.65 లక్షల కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 9.39 శాతం ఎక్కువ.

బిజినెస్

ఆర్‌కామ్‌ది మోసపూరిత ఖాతానే : బీఓఐ

న్యూఢిల్లీ: అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణ ఖాతాను బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) కూడా మోసపూరిత ఖాతాగా ప్రకటించింది. ఆర్‌కామ్ వ్యాపార విస్తరణ పేరుతో 2016 ఆగస్టులో అనిల్ అంబానీ తమ నుంచి తీసుకున్న రూ.700 కోట్లను దారి మళ్లించి జేబులో వేసుకున్నట్టు బీఓఐ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఆర్‌కామ్ రుణ ఖాతాను ఎస్‌బీఐ ఈ ఏడాది జూన్‌లోనే మోసపూరిత ఖాతాగా ప్రకటించింది. కాగా తమ నుంచి తీసుకున్న రూ.700 కోట్ల రుణ మొత్తాన్ని ఆర్‌కామ్ నిబంధనలకు విరుద్ధంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిందని బీఓఐ పేర్కొంది. మరోవైపు అనిల్ అంబానీపై సీబీఐ నమోదు చేసిన కేసుల ప్రభావం తమ వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలు, వాటాదారులు, ఉద్యోగులపై ఏ మాత్రం ఉండదని రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రా ప్రకటించాయి.

ఎగుమతులకు రూ.25,000 కోట్ల ప్రోత్సాహకాలు!

న్యూఢిల్లీ: ట్రంప్ సుంకాలతో ఆందోళనలో ఉన్న ఎగుమతిదారులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే ఆరేళ్లలో ఎగుమతిదారులకు ప్రోత్సాహకాల రూపంలో రూ.25,000 కోట్లు అందించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ (ఈపీఎం) కింద ప్రభుత్వం ఈ మొత్తాన్ని అందించనుంది. ఎగుమతిదారులకు తక్కువ వడ్డీతో సులభంగా రుణాలు అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని అధికార వర్గాలు చెప్పాయి. కేంద్ర వాణిజ్య మంతిత్వ శాఖ ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఎక్స్‌పెండీచర్ ఫైనాన్స్ కమిటీ (ఈఎఫ్‌సీ)కి పంపించినట్టు సమాచారం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25 తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	540
వరంగల్	497	గోదావరి	535
చిత్తూరు	558	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	112
వరంగల్	98	గుంటూరు	112
కరీంనగర్	98	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	85
కర్నూలు	98	నెల్లూరు	90
విశాఖపట్నం	116	అనంతపురం	90
గోదావరి	112		

డిమాండ్‌ను తట్టుకునేందుకు
మహీంద్రా కొత్త ప్లాంట్ ఏర్పాటు

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) కొత్త ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం అన్వేషిస్తోంది. దేశీయ, అంతర్జాతీయ డిమాండ్ తట్టుకునేందుకు ఉత్పత్తి సామర్థ్యాలను పెంచడం కోసం కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయాలని కంపెనీ నిర్ణయించింది. ఎం అండ్ ఎం ఆటో డివిజన్ సీఈఓ నళినీకాంత్ గొల్లగుంట ఈ విషయం తెలిపారు. తమ చకాన్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 2.4 లక్షల యూనిట్ల మేరకు పెంచనున్నట్టు చెప్పారు. తమకు అంతకు మించిన సామర్థ్యం అవసరమని, దాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకుంటున్నామని తెలియచేశారు. అయితే ఈ ప్లాంట్ ఎప్పటిలోగా ఏర్పాటు చేసేది ఆయన వెల్లడించలేదు. కేవలం ఈవీల విభాగంలో 2027 నాటికి 10 లక్షల ఉత్పత్తి సామర్థ్యం సాధించాలని భావిస్తున్నట్టు చెప్పారు.

- సెమీ కండక్టర్ ఆర్ అండ్ డీ, టాలెంట్ డెవలప్‌మెంట్ కోసం తైవాన్‌కు చెందిన నేషనల్ యాంగ్ మింగ్ చియో తుంగ్ యూనివర్సిటీ (ఎన్‌వైసీయూ), తైవాన్ సెమీకండక్టర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (టీఎస్‌ఆర్‌ఐ)తో టీ-చిప్ (టెక్నాలజీ-చిప్ ఇన్నోవేషన్ ప్రొగ్రామ్) జట్టు కట్టింది. 2030 నాటికి తెలంగాణలో 10 వేల మంది సెమీకండక్టర్స్ నిపుణులను తయారు చేసే లక్ష్యంతో టీ-చిప్ ఈ ఒప్పందం కుదుర్చుకుంది.

ఆచితూచి వ్యవహరించండి..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం కనిపిస్తోంది. సెప్టెంబరులో యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉండటం, జీఎస్‌టీ సంస్కరణలు సూచీలకు దన్నుగా నిలిచే వీలుంది. అయితే ట్రంప్ టారిఫ్స్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ విరమణపై స్పష్టత లేకపోవటం సూచీలపై ప్రభావం పడే అవకాశం ఉంది. వీటిని దృష్టిలో ఉంచుకుని ఇన్వెస్టర్లు ఎంపిక చేసుకున్న షేర్లలో పెట్టుబడులు పెట్టడం మంచిది. నిఫ్టీ గత శుక్రవారం 200 పాయింట్లకు పైగా పతనమవ్వటం లాభాల స్వీకరణను సూచిస్తోంది. మద్దతు లభిస్తే మళ్లీ పుల్‌బ్యాక్ ర్యాలీకి అవకాశం ఉంటుంది.

స్టాక్ రికమండేషన్స్

ఎన్‌ఎస్‌డీఎల్: కొన్ని రోజుల కిందే స్టాక్ మార్కెట్లో లిస్టయిన ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. ఐపీఓ గరిష్ఠ స్థాయి తర్వాత షేరు టైట్‌గా చలిస్తోంది. ఫ్లాగ్ స్ట్రక్చర్ కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.1,275 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,450 టార్గెట్ ధరతో రూ.1,250 స్థాయిలో అక్యుములేట్ చేసుకుంటూ పడే కొద్ది కొనుగోలు చేయాలి. రూ.1,210 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎక్సైడ్ ఇండస్ట్రీస్: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ షేరు ప్రస్తుతం రివర్సల్ అవుతోంది. హయ్యర్ హై ఫామ్ చేస్తూ అక్యుములేషన్ జోన్‌లో ఉంది. బ్యాటరీ ఇండస్ట్రీ ట్రెడ్ సైతం మెరుగవుతోంది. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ బాగుంది. గత శుక్రవారం రూ.396 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.380/390 శ్రేణిలో ఎంటరై రూ.455 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.370 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సుప్రీమ్ ఇండస్ట్రీస్: గత ఏడాది జూన్ నుంచి డౌన్ ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ కౌంటర్ ఈ ఏడాది మే నుంచి రివర్సల్ బాట పట్టింది. ప్రస్తుతం కీలక నిరోధ స్థాయి రూ.4,700 వద్ద చలిస్తోంది. దీన్ని అధిగమిస్తే మరింత పెరగటం ఖాయం. మూమెంటమ్ క్రమంగా మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.4,637 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.4,600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,780 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,560 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇప్కా ల్యాబ్స్: కొన్ని నెలలుగా అక్యుములేషన్ జోన్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం కీలక మద్దతు స్థాయి రూ.1,350 నుంచి రివర్సల్ అయ్యింది. డార్వాస్ బాక్స్ మాదిరిగా కొంతమేర స్వింగ్ లభించే సూచనలు ఉన్నాయి. గత శుక్రవారం రూ.1,418 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,400 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,580/1,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,360 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆదిత్య ఇన్ఫోటెక్: కొన్ని రోజుల క్రితమే మార్కెట్లో లిస్టయిన ఈ షేరు దూకుడు మీద ఉంది. నిఫ్టీతో పోల్చితే జోరు ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం రూ.1,360 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,300 శ్రేణిలో ప్రవేశించి రూ.1,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రిస్క్ ప్రొఫైల్‌ను బట్టి దీర్ఘకాలం మదుపు చేసుకోవచ్చు. రూ.1,260 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ఫాస్టాగ్ వార్షిక పాస్‌తో 10 రోజుల్లో 1.70 లక్షల వాహనాల ప్రయాణం

» రాష్ట్రంలోని 36 టోల్ ప్లాజాల పరిధిలో నమోదు

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ప్రయాణించే కార్లు, జీపులు, వ్యాన్లు తదితర వాణిజ్యేతర వాహనాల కోసం కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఫాస్టాగ్ వార్షిక పాస్ వినియోగం రాష్ట్రంలో బాగానే ఉంటోంది. ఈ నెల 15న ఈ వార్షిక పాస్‌ను అందుబాటులోకి తెచ్చినప్పటి నుంచి ఆదివారం వరకు (10 రోజుల్లో) 1.70 లక్షల వాహనాలు వార్షిక పాస్‌ను వినియోగించుకున్నాయి. రాష్ట్రంలోని 36 టోల్ ప్లాజాల గుండా ఈ పాసులతో వాహనాలు రాకపోకలు సాగించినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ పాస్ జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపైనే చెల్లుబాటు అవుతుంది. రాష్ట్రాల పరిధిలోని టోల్ ప్లాజాల్లో ఇది వర్తించదు. రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్‌ఏఐ వెబ్‌సైట్ ద్వారా ఈ పాస్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. రూ.3వేలతో ఈ పాస్‌ను కొనుగోలు చేసిన తర్వాతి నుంచి ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు వినియోగించుకోవచ్చు. ఆ తర్వాత మళ్లీ రూ.3వేలతో యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాల వారీగా చేప పిల్లల పంపిణీకి టెండర్లు

» రాష్ట్ర వ్యాప్తంగా 26,326 నీటి వనరుల్లో 84.62 కోట్ల చేపపిల్లలు వేసేందుకు ఏర్పాట్లు

» ప్రతిపాదిత అంచనా వ్యయం రూ.93.62 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఉపాధి నిమిత్తం ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు రూ.93.62కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26,326 నీటి వనరుల్లో 84.62 కోట్ల చేప పిల్లలు పోసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వారంలోగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, అక్టోబరులోగా ఉచిత చేప పిల్లల పంపిణీ, చెరువుల్లో పోసే కార్యక్రమం చేపట్టేందుకు మత్స్యశాఖ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు టెండర్ల నోటిఫికేషన్ ఈ నెల 18నే జారీ కాగా, 20వ తేదీ ఉదయం నుంచీ టెండరు బిడ్ల స్వీకరణ ప్రారంభమైంది. సెప్టెంబరు ఒకటో తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ బిడ్లు స్వీకరిస్తారు. అదేరోజు మూడున్నర గంటలకు టెండర్ బిడ్లు తెరుస్తారు. ఈ మేరకు జిల్లాల వారీగా బిడ్ డాక్యుమెంట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ టి. శ్రీనివాస్ తెలిపారు. 35-40 మిల్లీమీటర్ల సైజులో ఉండే లక్ష చేప పిల్లలకు రూ. 62,670 చొప్పున, 80-100 మిల్లీమీటరు సైజులో ఉండే లక్ష చేప పిల్లలకు రూ.1,66,130 చొప్పున ప్రతిపాదిత వ్యయం నిర్ణయించినట్లు వెల్లడించారు.

అర్చకులకు ఇన్సూరెన్స్ పథకం!

» ప్రభుత్వంతో కొనసాగుతున్న సంప్రదింపులు: అర్చక జేఏసీ

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అర్చకులకు ఇన్సూరెన్స్ పథకం తీసుకురావాలని, ఈ మేరకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుగుతున్నాయని తెలంగాణ అర్చక సమాఖ్య జేఏసీ చైర్మన్ గంగ ఉపేంద్ర శర్మ చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో అర్చక సమస్యలపై జరిగిన పోరాటాల ఫలితంగానే ధూప, దీప, నైవేద్యం పథకం అమలులోకి వచ్చిందన్నారు. 65-ఎ ద్వారా వేతనాలు సాధించామని, అర్చక వెల్ఫేర్ ఫండ్ ద్వారా చిన్న అర్చకులకు ప్రయోజనం చేకూర్చామని తెలిపారు. హైదరాబాద్‌లో తెలంగాణ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అర్చకుల హక్కులు, సంక్షేమం, ఆలయాల అభివృద్ధిపై పలు తీర్మానాలు ఆమోదం పొందాయి.

గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్

తెలంగాణ వ్యాప్తంగా గణేశ్, దుర్గా మాత మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతి తీసుకున్న మండపాలకు ఉచిత విద్యుత్ అందించనున్నారు. ఈ నెల 27 నుంచి గణేశ్ ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ మండపాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఖైరతాబాద్ గణనాథుడి విగ్రహ నిర్మాణం తుది దశకు చేరుకుందని ఉత్సవ కమిటీ వర్గాలు వెల్లడించాయి.

శ్రీవారిసేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి నగేశ్



తిరుమల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఈ మేరకు జస్టి‌స్‌కు ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఫిరంగి కాలువపై ఆక్రమణలు తొలగించండి

» సర్కారుకు టీటీడీపీ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లిలో సాగు, తాగు నీటి కోసం నిర్మించిన ఫిరంగి కాలువ ఆక్రమణలకు గురైందని, తక్షణమే స్పందించి ఆక్రమణలను తొలగించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి టీటీడీపీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం టీటీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు సీఎ‌స్‌కు లేఖ రాశారు.

పైన అట్టపెట్టెలు.. కింద గోవులు

» డీసీఎంలో తరలిస్తుండగా గుర్తించిన పోలీసులు

» యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన

» 56 మూగజీవాలు గోశాలలకు తరలింపు



యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా వద్ద గోవులను తరలిస్తున్న వాహనంతో పోలీసులు

చౌటుప్పల్ రూరల్/వలిగొండ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి మీదుగా వేర్వేరు ఘటనల్లో వాహనాల్లో తరలిస్తున్న 56 మూగజీవాలను పోలీసులు కాపాడారు. వీటిలో 31గోవులు, 25ఎద్దులు ఉన్నాయి. రాజమండ్రి నుంచి హైదరాబాద్ బహదూర్‌పూర్ కబేళాకు డీసీఎంలో గోవులను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఓ డీసీఎం వాహనం పైభాగంలో అట్టపెట్టెలు, వాటి కింద తాళ్లతో కట్టేసిన మూగజీవాలను గుర్తించారు. మొత్తం 21ఎద్దులు, 12ఆవులను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించారు. డీసీఎం డ్రైవర్ పెద్దపూడి అప్పల కుమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ సీఐ మన్మధకుమార్ తెలిపారు. మరొక ఘటనలో కోదాడ నుంచి హైదరాబాద్‌కు మినీ వాహనంలో 4 ఎద్దులు, 5గోవులను తరలిస్తుండగా చౌటుప్పల్ వద్ద పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ ఘటనలో భానోతు సురేందర్‌పై కేసు నమోదు చేశారు. మరోవైపు వలిగొండ మండల కేంద్రంలో 14 గోవులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. శ్రీకాకుళం నుంచి కంటైనర్ వాహనంలో హైదరాబాద్‌లోని తుక్కుగూడ కబేళాకు తరలిస్తుండగా పట్టుకుని అనకాపల్లి జిల్లాకు చెందిన జోగ శివాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యుగేందర్ తెలిపారు.

వ్యవస్థల్ని నియంత్రిస్తే ఊరుకోం

(మొదటిపేజీ తరువాయి)

అవసరమని, ఇండస్ట్రీకి ఏం కావాలనే దానిపై ఒక కొత్త పుస్తకం రాసుకుందామని అన్నారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి సినిమాల చిత్రీకరణ కూడా జరుగుతోందని, తెలుగు సినిమాల చిత్రీకరణ ఎక్కువగా రాష్ట్రంలోనే జరిగేలా చూడాలని సూచించారు. తెలుగు సినిమా పరిశ్రమ అంతర్జాతీయ స్థాయికి వెళ్లిందని, ఇలాంటి పరిస్థితుల్లో ఇండస్ట్రీలో వివాదం ఉండకూడదనే కార్మికుల సమ్మె విషయంలో తాను చొరవ చూపించానని తెలిపారు. త్వరలోనే సినీ పరిశ్రమలోని కార్మికులతోనూ మాట్లాడతానన్నారు. అయితే కార్మికుల పట్ల నిర్మాతలు మానవత్వంతో వ్యవహరించాలని, ఈ విషయంలో సంస్కరణలు అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. కార్మికులు, నిర్మాతలను తమ ప్రభుత్వం కాపాడుకుంటుందని, వారితోపాటు ప్రభుత్వమూ కలిసి ఒక పాలసీ తీసుకువస్తే బాగుంటుందని పేర్కొన్నారు. పరిశ్రమకు కొత్తగా వచ్చేవారిలో నైపుణ్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ అంశాల్లో నైపుణ్యాల పెంపు కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. ఇక సినిమా పరిశ్రమ కోసం స్కిల్ యూనివర్సిటీలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కాగా, ప్రభుత్వం నుంచి సినీ పరిశ్రమకు పూర్తి సహకారం ఉంటుందని సీఎం చెప్పినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, నిర్మాతలు అల్లు అరవింద్, డి.సురేష్ బాబు, జెమిని కిరణ్, స్రవంతి రవికిశోర్, నవీన్ ఎర్నేని తదితరులతోపాటు దర్శకులు త్రివిక్రమ్, బోయపాటి శ్రీనివాస్, సందీప్‌రెడ్డి వంగా, వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి తదితరులు పాల్గొన్నారు.



సినీ దర్శక, నిర్మాతలతో సమావేశమైన సీఎం రేవంత్

మన మేధస్సు.. మన కోసం!

సొంత మనుషులకు సహాయపడేలా వినియోగించాలి.. పరిశోధనలకు అవసరమైన చారిత్రక డాటా అందిస్తాం

» ఏసియా-ఫసిఫిక్ బయో డిజైన్ సదస్సులో సీఎం రేవంత్



'ఇన్నోవేటింగ్ ఫర్ భారత్ బయోడిజైన్ బ్లూ ప్రింట్'ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): "మన మేధావులు ఎన్నో ఏళ్లుగా ఇతర దేశాల సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నారు. ఇప్పుడు మన సొంత మనుషులకు సహాయపడేలా మన మేధస్సును వినియోగించాల్సిన సమయం ఆసన్నమైంది" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వారికి అవసరమైన పూర్తి మద్దతును తమ ప్రభుత్వం అందిస్తుందన్నారు. డాటా గోప్యత చట్టాలకు లోబడి పరిశోధనలకు అవసరమైన చారిత్రక డాటాను కూడా పంచుకుంటామని తెలిపారు. విద్యాసంస్థలతో పరిశోధకులను అనుసంధానించడంతోపాటు పరిశోధన, ఆవిష్కరణలు, స్కిల్ వర్సిటీలతో కలిపే ప్రయత్నం చేస్తామన్నారు. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో జరుగుతున్న ఆసియా-పసిఫిక్ బయో డిజైన్ ఇన్నొవేషన్-2025 సదస్సును ప్రారంభించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్లు, పరిశోధకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. బయో డిజైన్‌ను ఉపయోగించి వైద్య ఉత్పత్తులలో ఆవిష్కరణలపై ఇక్కడ చర్చించడం సంతోషంగా ఉందన్నారు. దేవుడు గొప్ప డిజైనర్ అని, ప్రకృతి అత్యుత్తమ టీచర్ అని, కానీ.. మనం మంచి విద్యార్థులుగా ఉంటున్నామా అనేదే ప్రశ్న అని అన్నారు. ప్రకృతిని పరిశీలించడంతోపాటు దాని నుంచి నేర్చుకుంటే వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం రాదన్నారు. బయో డిజైన్‌కు సంబంధించి కృత్రిమ మేధస్సు దీనికి చక్కటి ఉదాహరణగా పేర్కొన్నారు. మనుషులు కృత్రిమ మెదడును రూపొందించడానికి మానవ మెదడు ఉపయోగిస్తున్నారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. భారతదేశపు లైఫ్ సైన్సెస్, మెడికల్ డివైజెస్, టెక్నాలజీ రంగాలకు కేంద్రంగా తెలంగాణ వెలుగొందుతోందని, సాంకేతిక రంగాన్ని అత్యంత కీలకంగా తాము భావిస్తున్నామని వివరించారు. ఫార్మా, ఐటీ, బయోటెక్, లైఫ్‌సైన్సెస్, మెడికల్ టెక్నాలజీలకు నిలయంగా హైదరాబాద్ వెలుగొందుతోందని, ఈ రంగాల్లో తయారీ నుంచి ఆవిష్కరణల వరకూ మనం ఎదిగామని అన్నారు.

సుల్తాన్‌పూర్‌లో మెడికల్ డివైజెస్ పార్క్..

దేశంలో అతి పెద్ద మెడికల్ డివైజెస్ పార్క్‌ను తాము సుల్తాన్‌పూర్‌లో ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ తెలిపారు. అక్కడ పరిశోధన, ప్రొటోటైపింగ్, టెస్టింగ్, తయారీకి సంబంధించి అత్యుత్తమ మౌలిక సదుపాయాలున్నాయని అన్నారు. దాదాపు 60 కంపెనీలు అక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. డయాగ్నస్టిక్ డివైజెస్, ఇమేజింగ్ టెక్నాలజీస్, ఇంప్లాంట్స్, సర్జికల్ ఎక్విప్‌మెంట్స్, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్ విభాగాల్లో పెట్టుబడులు అధికంగా వస్తున్నాయని వివరించారు. అంతర్జాతీయ కంపెనీలతోపాటు స్థానిక స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు ఈ రంగాలలో చక్కగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని ప్రశంసించారు. హైదరాబాద్‌ను ఇవి వినూత్న స్థానంలో నిలుపుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో నైపుణ్యంతో కూడిన మానవ వనరులున్నాయని, చక్కటి విద్యాసంస్థలు, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు, విద్య-పరిశ్రమ భాగస్వామ్యాలు దీనికి తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. సామాన్య భారతీయుల సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఈ తరహా సదస్సులను ఏర్పాటు చేయడంతోపాటు పరిశోధనలు చేస్తున్న ఏఐజీని, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని అభినందిస్తున్నట్లు తెలిపారు.

బయో డిజైన్‌కు కేంద్రంగా హైదరాబాద్..

దేశంలో బయో డిజైన్‌కు కేంద్రంగా హైదరాబాద్ నిలవనుందని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అల్పాదాయ వర్గాలకు సైతం మెరుగైన ఆరోగ్య సేవలందించే అవకాశం బయో డిజైన్ ఉత్పత్తులతో కలుగుతుందన్నారు. హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రావు- భారత్ బయోడిజైన్ విజన్ డాక్యుమెంట్ గురించి వివరించారు. ఏఐ మెడ్‌టెక్ అలయెన్స్‌తో కలిసి ఏఐజీ హాస్పిటల్స్ 'ఇన్నోవేటింగ్ ఫర్ భారత్ బయోడిజైన్ బ్లూ ప్రింట్' పేరిట ఈ డాక్యుమెంట్‌ను రూపొందించిందన్నారు. కాగా, బయో డిజైన్ పరంగా అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన 10 మంది నిపుణులు హైదరాబాద్‌కు వచ్చారని ఏఐఎం ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్ కల్పాల చెప్పారు.

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ఎక్కడ్నుంచి..?

(మొదటిపేజీ తరువాయి)

కొత్త రైలు మార్గాన్ని మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరుతోంది. ఈ రోడ్డు, రైలు మార్గాన్ని హై స్పీడ్ కారిడార్‌గా నిర్మించాలని కోరింది. అటు ఏపీ కూడా ఈ రోడ్డును మంజూరు చేయాలని ఇప్పటికే కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఫలితంగా ఇటీవల ఏపీలో పలు జాతీయ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలకు వెళ్లిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేకు సుముఖత వ్యక్తం చేశారు. ప్రతిపాదిత మార్గం వివరాలను సమర్పించాలని సూచించారు. ఈ రహదారి నిర్మిస్తే పొరుగు రాష్ట్రాలకు వెళ్లేందుకు ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ఎగుమతులు, దిగుమతులకు కూడా ఉపయోగపడనుంది. తెలంగాణ పరిధిలో ఈ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు ఎంట్రీ పాయింట్ ఎక్కడన్నది తేలడం లేదు. హైదరాబాద్‌కు ఇప్పటికే ఔటర్ రింగు రోడ్డు ఉండగా, దీనికి కొంత దూరంలో రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), రీజినల్ రింగు రైలు రానున్నాయి. ఈ నేపథ్యంలో అమరావతి గ్రీన్‌ఫీల్డ్ కోసం ఓఆర్ఆర్ నుంచి ఎంట్రీ పాయింట్ ఇవ్వాలా లేక ఆర్ఆర్ఆర్ నుంచి ఇవ్వాలా అనేదానిపై సమాలోచనలు జరుగుతున్నాయి. ఒకవేళ ఆర్ఆర్ఆర్ నుంచి ఇవ్వాలనుకుంటే ఫ్యూచర్‌సిటీకి దగ్గర్లో ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. కానీ, ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంపై కేంద్రం ఇంకా ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. ఈ అలైన్‌మెంట్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపితే.. దాని ప్రకారం అమరావతి హైవేకు ఎంట్రీ పాయింట్ కూడా ఖరారవుతుందని అధికారవర్గాలు అంటున్నాయి. లేదంటే ఆర్ఆర్ఆర్ దక్షిణభాగంతో సంబంధం లేకుండా ప్రస్తుతమున్న ఓఆర్ఆర్ నుంచే ఫ్యూచర్‌సిటీకి దగ్గరగా ఉండేలా ఒకటి లేదా రెండు ఎంట్రీ పాయింట్లను గుర్తించాల్సి ఉంటుందనే అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ఉభయ రాష్ట్రాల పరిధిలో ఎంట్రీ పాయింట్లు తేలితేనే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు వేగవంతం కానున్నాయి.

యూరియా కొరతపై.. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావు

» వాస్తవాలు పక్కదారిపట్టేలా.. ఆయన చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

» కేంద్రం నిర్లక్ష్యం వల్లే కొరత: తుమ్మల



హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు సరికావని, వాస్తవాలను దాచి ఉల్టా రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో 11 ఏళ్లుగా లేని యూరియా కొరత ఇప్పుడెందుకు వచ్చిందో తెలియదా? అని నిలదీశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డికి యూరియా కొరత ఎందుకు ఏర్పడిందో తెలియదా అని ప్రశ్నించారు. జియో పొలిటిక్స్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఎర్ర సముద్రంలో నౌకాయానం నిలవడం వల్ల యూరియా దిగుమతి డిమాండ్‌కు తగ్గ స్థాయిలో లేదని కిషన్ రెడ్డి ఓ పక్క చెబుతూనే.. మరోపక్క యూరియా పక్కదారి పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని తుమ్మల మండిపడ్డారు. యూరియా దిగుమతులు లేకపోవడం, దేశీయంగా ఏర్పడిన కొరతపై కేంద్ర ప్రభుత్వం వాస్తవాలు దాచిపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నిర్లక్ష్యం వల్ల యూరియా కొరత నెలకొంటే కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లేలా వ్యాఖ్యలు చేయడం ఆయన స్థాయికి సరికాదన్నారు. తెలంగాణ ప్రజల ఓట్లతో ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి అయిన కిషన్‌రెడ్డి.. సొంత రాష్ట్ర రైతాంగం యూరియా కోసం ఇబ్బందులు పడుతుంటే ఎందుకు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా చొరవ తీసుకుని రాష్ట్రానికి యూరియా సరఫరా చేయించాలని డిమాండ్ చేశారు. వాస్తవ పరిస్థితులను రాష్ట్ర మంత్రులు రైతాంగానికి వివరిస్తుంటే.. తమపైనే అభాండాలు వేయడం మంచిది కాదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇది మూడో పంట కాలమని, ఏడాదిన్నరగా రైతులు యూరియా కోసం ఆందోళన చెందలేదని, ఈసారి కేంద్రం సరిపడా యూరియా సరఫరా చేయకపోవటంతోనే కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. కేంద్రం కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయకపోవడం వల్లే రైతులు ఆందోళనకు దిగుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ అలసత్వంతో ఏర్పడిన యూరియా కొరతపై వాస్తవాలు దాచి రాజకీయ ఆరోపణలు చేయటం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కేంద్రం తెలంగాణకు ఆగస్టు 31 నాటికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని, కానీ ఇప్పటివరకు కేవలం 5.66 లక్షల మెట్రిక్ టన్నుల యూరియానే సరఫరా చేసిందని, దీంతో రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందన్నారు. కేంద్ర మంత్రి హోదాలో కిషన్ రెడ్డి బాధ్యతగా ప్రకటించిన 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా తక్షణమే సరఫరా అయ్యేలా చూడాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

బీసీ కోటాకు న్యాయమెలా?

(మొదటిపేజీ తరువాయి)



ప్రజాభవన్‌లో సమావేశమైన భట్టి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు

తీసుకోనుంది. ఆదివారం ప్రజాభవన్‌లో సమావేశమైన మంత్రుల కమిటీ.. ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై న్యాయకోవిదులు, రాజ్యాంగ నిపుణులను సంప్రదించేందుకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్కతో కమిటీ ఏర్పాటైన విషయం తెలిసిందే. ఈ కమిటీ.. న్యాయకోవిదులతో సంప్రదింపుల ప్రక్రియను మంగళవారం కల్లా పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రజాభవన్‌లో కమిటీ సమావేశమై.. రిజర్వేషన్ల విషయంలో వివిధ కోర్టులు ఇచ్చిన తీర్పులు ఎలా ఉన్నాయి? ఇతర రాష్ట్రాల్లో రిజర్వేషన్లను ఏ విధంగా అమలు చేస్తున్నారు? వంటి అంశాలను ప్రాథమికంగా పరిశీలించింది. న్యాయపరంగా వివాదాలు రాకుండా.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు ఉన్న మార్గాలపై అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి అభిప్రాయాన్ని మంత్రులు తెలుసుకున్నారు. విస్తృత అభిప్రాయ సేకరణకుగాను జాతీయ స్థాయిలో ప్రముఖ న్యాయ కోవిదులు,రాజ్యాంగ నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించారు.

బిహార్ టూర్.. వయా ఢిల్లీ..

రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వే నివేదికను అధ్యయనం చేసి.. సూచనలు చేసేందుకు ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ చైర్మన్, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి అయిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అభిప్రాయాన్ని సోమవారం తీసుకోవాలని మంత్రుల కమిటీ నిర్ణయించింది. ఆయనతోపాటు ప్రముఖ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మనుసింఘ్వీ సలహా కూడా తీసుకోనున్నారు. ప్రస్తుతం ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రచారంలో ఉన్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి.. సోమవారం ఢిల్లీకి వెళుతున్నారు. దీంతో శ్రీధర్‌బాబు మినహా మంత్రుల కమిటీ సభ్యులు కూడా ఢిల్లీకి వెళ్లనున్నారు. అక్కడే జస్టిస్ సుదర్శన్‌రెడ్డితోపాటు ఇతర న్యాయ కోవిదులనూ కలిసి అభిప్రాయం తీసుకోనున్నారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి కూడా సోమవారం మధ్యాహ్నం ఢిల్లీకి వెళుతున్నారు. మంగళవారం ఢిల్లీ నుంచి బిహార్ రాజధాని పట్నాకు చేరుకుంటారు. 'ఓటు చోరీ' అంశంపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రస్తుతం బిహార్‌లో చేస్తున్న పాదయాత్రలో రేవంత్‌రెడ్డి పాల్గొంటారు. రేవంత్‌తోపాటు రాష్ట్ర మంత్రులు, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఇతర ముఖ్య నాయకులూ పాల్గొననున్నారు. ఢిల్లీ మీదుగా బిహార్‌కు చేరుకోనున్నారు. కాగా, సోమవారం స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చించేందుకు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, అభిషేక్ మనుసింఘ్వీతో మంత్రుల కమిటీ భేటీలో సీఎం రేవంత్ కూడా పాల్గొనే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

దొంగ ఓట్లతోనే 8 మంది గెలిచారు

(మొదటిపేజీ తరువాయి)



కరీంనగర్ జిల్లా మధురానగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్; హాజరైన ప్రజలు

మధురానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. తెలంగాణలోనూ దొంగ ఓట్లతోనే బండి సంజయ్ సహా 8 మంది ఎంపీలు గెలుపొందారని దుయ్యబట్టారు. ఎన్నికలు వస్తేనే బీజేపీకి దేవుళ్లు గుర్తుకువస్తారని ధ్వజమెత్తారు. రాముడి అక్షింతలనూ రాజకీయాలకు వాడుకున్న ఘనత బీజేపీదని మండిపడ్డారు. కులం, మతం లేకపోతే బీజేపీ గెలవదని, దేవుడి పేరుతో ఓట్లు అడిగే బిచ్చగాళ్లు బీజేపీ నేతలని ఎద్దేవా చేశారు.

బీసీ బిల్లులను ఎందుకు ఆమోదించరు?

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం బిల్లులను రూపొందించి, కేంద్రానికి పంపిస్తే ఎందుకు ఆమోదించడం లేదని మహేశ్‌గౌడ్ ప్రశ్నించారు. బీసీల గురించి బండి సంజయ్ ఒక్క సారైనా మాట్లాడలేదని, ఉన్నత వర్గాలకు వత్తాసు పలుకుతూ పత్తా లేకుండా పోయాడని విమర్శించారు. బండి సంజయ్.. బీసీల్లో ఉన్న దేశ్‌ముఖ్ అని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ముఖ్య నేత జీవన్‌రెడ్డి వద్దకు వెళ్లి తెలుసుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, పదేళ్ల అధికారంలో ఉన్న ఆ పార్టీ ఏనాడూ పేదల గురించి ఆలోచించలేదని ధ్వజమెత్తారు. ఇప్పటికే మూడు ముక్కలైన ఆ పార్టీ.. వచ్చే ఎన్నికల నాటికి పూర్తిగా కనుమరుగు అవుతుందని జోస్యం చెప్పారు. గతంలో ఐటీ మంత్రిగా పని చేసిన కేటీఆర్.. కనీసం రూ.10వేల పెట్టుబడులైనా తీసుకురాలేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం తాము ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, 40 లక్షల రేషన్ కార్డులు అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 65 వేల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేశామని, రానున్న రోజుల్లో మరో 35వేల నియామకాలు చేపడతామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు గెలుపొంది.. చొప్పదండిలోనే విజయోత్సవ సమావేశం నిర్వహిస్తామన్నారు. కాగా, పేదల కష్టాలు తెలుసుకోవడానికే జనహిత పాదయాత్ర నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తెలిపారు. పేదల కళ్లలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. జనహిత పాదయాత్ర అనంతరం మహేశ్‌గౌడ్, మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎమ్మెల్యేలు మధురానగర్‌లోని కాంగ్రెస్ కార్యకర్త వినోద్ ఇంటికి చేరుకున్నారు. సోమవారం నాటి కార్యక్రమాలపై చర్చించుకున్న అనంతరం మీనాక్షి నటరాజన్ అక్కడే బస చేశారు.

ఓట్ చోరీపై ఉద్యమానికి సిద్ధం కావాలి: మీనాక్షి

మేడ్చల్ టౌన్: ఓట్ చోరీతో అధికారంలోకి వచ్చిన బీజేపీని గద్దె దించేంత వరకూ రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమం ఆగదని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. మేడ్చల్‌లో కాంగ్రెస్ జిల్లా నూతన కార్యాలయాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ నిజస్వరూపాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బిహార్‌లో రాహుల్ యాత్ర చేపడుతున్నారని, ఈ బాధ్యతను రాష్ట్రంలోని ప్రతి కార్యకర్త పంచుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్‌ను తన గుప్పిట్లో పెట్టుకున్నందునే మోదీ మూడోసారి ప్రధాని అయ్యారని ఆరోపించారు. బీజేపీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నాలుగు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసిన మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డిని అభినందించారు. ఎన్నికల సంఘం బీజేపీకి తొత్తులా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆరోపించారు.

వివాహేతర సంబంధం అనుమానంతో
భార్యను కడతేర్చిన భర్త

» అడవిలోకి తీసుకెళ్లి పెట్రోల్ పోసి దహనం

» సోమశిల వెళ్దామని నమ్మించి దారుణం


శ్రావణి (ఫైల్)

పెద్దకొత్తపల్లి/మహబూబ్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు తన భార్యకు వివాహేతర సంబం ధం ఉందనే అనుమానంతో అడవిలోకి తీసుకెళ్లి హత్య చేసి, అనంతరం పెట్రోల్ పోసి కాల్చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని కొత్తరాయవరం గ్రామానికి చెందిన శ్రీశైలం, దేవరకద్రకు చెందిన శ్రావణి (27) పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో శ్రావణి కొన్నాళ్లుగా పిల్లలతో కలిసి మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటోంది. శ్రీశైలం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో వెల్డర్‌గా పని చేస్తున్నాడు. భార్యకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో తరుచూ ఆమెతో గొడవ పడేవాడు. విసిగిపోయిన ఆమె జనవరిలో మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో సోమశిలకు వెళ్దామని నమ్మించిన శ్రీశైలం ఈ నెల 21న మహబూబ్‌నగర్‌కు వచ్చి, భార్యను బైక్‌పై తీసుకెళ్లాడు. పథకం ప్రకారం కత్తి, పెట్రోల్‌ను బైక్ కవర్‌లో ఉంచుకున్నాడు. పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్ అడవిలోకి తీసుకెళ్లి కత్తితో పొడిచి హత్య చేశాడు. తర్వాత మృతదేహానికి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. కూతురు నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో అనుమానించిన ఆమె తల్లి శనివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదేరోజు రాత్రి శ్రీశైలం పోలీసుల వద్ద లొంగిపోయాడు.

మత్తు మందు ఇచ్చి
బాలికపై అత్యాచారం

» భద్రాచలం ఏజెన్సీలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..

కొత్తగూడెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ఓ గిరిజన బాలిక. తన కుటుంబ సభ్యులను చూడాలనుకుని ఎంతో ఆనందంతో స్వగ్రామానికి బయలుదేరింది. తన అన్నయ్యకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నానని చెప్పింది. అలాంటి బాలిక ఉసురు తీశారు కొందరు నీచులు. కన్నూమిన్నూ కానక.. ఆ 17ఏళ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏపీలోని యేటపాక మండలానికి చెందిన ఆదివాసీ బాలికకు రెండేళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాకు చెందిన యువకుడితో వివాహం జరిగింది. గతంలోనే బాలిక తల్లిదండ్రులు చనిపోగా.. పుట్టింటి వద్ద ఉంటున్న బంధువులను కలిసేందుకు కుంట మండల కేంద్రానికి చేరుకుంది. అక్కడి నుంచి ప్యాసింజర్ ఆటో ఎక్కింది. అప్పటికే ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి ఉన్నట్టు సమాచారం. మార్గమధ్యలో ఆ ఇద్దరు వ్యక్తులు మద్యం తాగడంతో పాటు బాధితురాలికి మత్తు మందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డారు. పాల్వంచ మండలం జగన్నాథపురం వద్ద అపస్మారక స్థితిలో ఉన్న సదరు బాలికను గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. బాలిక చెప్పిన వివరాల ఆధారంగా ఆమెపై అత్యాచారం జరిగినట్టుగా అనుమానించిన అధికారులు పాల్వంచ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీడీపీవో లక్ష్మీప్రసన్న ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బాలికను సంరక్షణ కేంద్రానికి తరలించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

భార్యను ముక్కలు చేసి
మూసీలో పారేశాడు

5 నెలల గర్భిణిని హతమార్చిన భర్త.. హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో దారుణం

హైదరాబాద్ సిటీ/పీర్జాదిగూడ, వికారాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రేమించి, పెద్దలను ఎదిరించి పెళ్లాడిన పక్కింటి కుర్రాడే ఆ యువతి పాలిట కాలయముడయ్యాడు. ఐదు నెలల గర్భిణి అని కూడా చూడకుండా.. కట్టుకున్న భర్తే ఆమెను హతమార్చాడు. ఆపై, చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నరరూప రాక్షసుడిగా మారిన ఆ భర్త.. భార్య శవాన్ని ముక్కలు ముక్కలు చేసి వాటిని విడతలవారీగా మూసీ నదిలో పారేశాడు. మొండాన్ని మాత్రం ఇంట్లోనే ఉంచి.. నా భార్య కనిపించడం లేదు సాయం చెయ్యండంటూ పోలీసుస్టేషన్‌కు వెళ్లిన ఆ కిరాతకుడు.. విచారణలో పోలీసులకు దొరికిపోయాడు. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్, మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోడుప్పల్‌లో వెలుగుచూసిన ఈ ఘటనలో వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడకు చెందిన స్వాతి(21) తన భర్త చేతిలో దారుణ హత్యకు గురైంది. ఇందుకు సంబంధించిన వివరాలను మల్కాజిగిరి డీసీపీ పద్మజ ఆదివారం విలేకరులకు వెల్లడించారు.

పెళ్లయిన మూడు నెలలకే వేధింపులు

డీసీపీ కథనం ప్రకారం.. కామారెడ్డిగూడలో పక్కపక్క ఇళ్లలో ఉండే మహేందర్‌రెడ్డి (27), స్వాతి (21) ప్రేమించుకున్నారు. వేర్వేరు కులాలకు చెందిన వీరి ప్రేమను పెద్దలు అంగీకరించకపోవడంతో ఎవ్వరికీ తెలియకుండా గతేడాది జనవరిలో కూకట్‌పల్లిలోని ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. అనంతరం స్వగ్రామంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరగ్గా సయోధ్య కుదుర్చిన పెద్దలు.. యాదగిరిగుట్టలో మరోమారు పెళ్లి చేశారు. అనంతరం వీరు బోడుప్పల్‌లోని బాలాజీనగర్‌లో కాపురం పెట్టారు. ఇంటర్ వరకు చదివిన మహేందర్ రెడ్డి ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తుండగా, డిగ్రీ మధ్యలోనే ఆపేసిన స్వాతి టెలీకాలర్‌గా పని చేస్తోంది. అయితే, పెళ్లయిన నెల రోజులు తర్వాత దంపతుల మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. పెళ్లయిన రెండు నెలలకే స్వాతి గర్భం దాల్చగా వద్దని చెప్పి మహేందర్ రెడ్డి అబార్షన్ చేయించాడు. ఆ తర్వాత భర్త వేధింపులు భరించలేకపోయిన స్వాతి వికారాబాద్ మహిళా పోలీసుస్టేషన్‌లో గృహహింస కేసు పెట్టింది. గ్రామపెద్దలు దంపతుల మధ్య రాజీ కుదిర్చారు. కానీ, స్వాతిపై కోపం పెట్టుకున్న మహేందర్ రెడ్డి ఆమెను మరింత వేధించడం మొదలుపెట్టాడు. స్వాతి తన తల్లిదండ్రులతో మాట్లాడకుండా, కలవకుండా కట్టడి చేసేవాడు. ఈ గొడవలు కొనసాగుతుండగా మరోమారు గర్భం దాల్చిన స్వాతి ఇటీవల స్వగ్రామానికి వెళ్లింది. మహేందర్ రెడ్డి వద్దకు వెళ్లనంటే పెద్దలు సర్దిచెప్పడంతో 20 రోజుల క్రితమే తిరిగి బోడుప్పల్‌కు వచ్చింది.


భర్తతో స్వాతి (ఫైల్)

గొంతు నులిమి చంపి.. ముక్కలు చేసి

5 నెలల గర్భిణి అయిన స్వాతి వినాయకచవితికి పుట్టింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటానని 22వ తేదీ, శుక్రవారం భర్తకు చెప్పింది. ఇందుకు మహేందర్ రెడ్డి ఒప్పుకోకపోవడంతో ఆ రోజు రాత్రి ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. మరుసటి రోజు, శనివారం(ఆగస్టు 23) ఉదయం 11 గంటల వరకు స్వాతి నిద్ర లేవలేదు. అయితే, భార్యను అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్న మహేందర్.. ఉదయం 11:30 గంటలప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం నాలుగు గంటలకు తిరిగొచ్చాడు. వచ్చేటప్పుడు ఓ ఎక్సా బ్లేడు కొనుగోలు చేసి తెచ్చి ఇంట్లో దాచిపెట్టాడు. వెంటనే పథకం ప్రకారం భార్యతో గొడవ ప్రారంభించి ఆమె గొంతు నులిమి చంపేశాడు. అనంతరం భార్య మృతదేహాన్ని మంచంపై పడేసి ఎక్సా బ్లేడుతో ముక్కలు చేశాడు. తల, కాళ్లు, చేతులను మొండం నుంచి వేరు చేసి ప్లాస్టిక్ కవర్లలో కుక్కి మూటగట్టాడు. మొండెంను మాత్రం ప్లాస్టిక్ కవర్‌లతో కప్పి ఒక దిండులా ప్యాక్ చేసి పక్కన పెట్టాడు. పరుపును మడిచి మూటగట్టి ఓ మూల పెట్టాడు. రాత్రి ఏడు గంటల తర్వాత ఒక్కో మూటను బ్యాక్‌ప్యాక్‌లో పెట్టుకుని ద్విచక్రవాహనంపై వెళ్లి ప్రతాపసింగారం ప్రాంతంలోని మూసీ నదిలో పారేశాడు.

భార్య కనిపించడం లేదని నాటకం

హత్యా నేరం నుంచి తప్పించుకునేందుకు మహేందర్ రెడ్డి మరో నాటకానికి తెర తీశాడు. మేము బానే ఉన్నాం, ఇప్పుడే భోజనం చేశామంటూ రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో స్వాతి ఫోన్ నుంచి ఆమె తల్లిదండ్రులకు మెసేజ్ పెట్టాడు. అలాగే, తన చెల్లికి ఫోన్ చేసి స్వాతి కనిపించడం లేదంటూ నమ్మబలికాడు. ఆ మాటలను నమ్మని ఆమె.. వెంటనే తన భర్తను మహేందర్ రెడ్డి వద్దకు పంపింది. బావ వచ్చే లోపు కాళ్లు, చేతులు, తలను మహేందర్ రెడ్డి మూసీలో పడేశాడు. మహేందర్‌రెడ్డిని కలిసిన అతని బావ ఏం జరిగిదంటూ వాకబు చేశాడు. హత్య సంగతి దాచిపెట్టి భార్య కనిపించడం లేదని మహేందర్ రెడ్డి అతని వద్ద వాపోయాడు. దీంతో మిస్సింగ్ కేసు పెడదామని చెప్పి మహేందర్ రెడ్డిని అతని బావ రాత్రి 11 గంటల ప్రాంతంలో ఉప్పల్ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లాడు. మహేందర్ రెడ్డి నివాసమున్న ప్రాంతం మేడిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుందంటే రాత్రి 12 గంటలకు అక్కడికి చేరుకున్నారు. అయితే, కేసు నమోదులో భాగంగా ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి వేసిన ప్రశ్నలకు మహేందర్ రెడ్డి పొంతన లేని సమాధానాలు ఇవ్వగా.. ఇన్‌స్పెక్టర్ గట్టిగా ప్రశ్నించడంతో చేసిన దారుణాన్ని బయటపెట్టాడు. వెంటనే మహేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వైద్య పరీక్షల అనంతరం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు.

దొరకని స్వాతి శరీర భాగాలు

మహేందర్‌రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం ఉదయం స్వాతి శరీర భాగాల కోసం మూసీలో గాలింపు చేపట్టారు. కానీ, మూసీలో వరద ఉండడంతో ఫలితం లేకపోయింది. స్వాతి మొండాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

ప్రేమంటూ నా బిడ్డను అంతం చేశాడు: స్వాతి తండ్రి

ప్రేమ పేరుతో నమ్మించి, పెళ్లి చేసుకొని లొంగదీసుకుని తమ బిడ్డను తమకు దూరం చేసిన మహేందర్ రెడ్డి.. ఇప్పుడు ఏకంగా ప్రాణాలు తీసేశాడంటూ స్వాతి తండ్రి రాములు మేడిపల్లి పోలీస్ స్టేషన్ వద్ద బోరున విలపించారు. పెళ్లయిన నెల రోజుల నుంచే వేధించడం మొదలుపెట్టాడని, ఇప్పుడు గర్భవతి అని తెలిసి కూడా దారుణంగా హతమార్చాడంటూ ఆయన రోదించారు. తమకు ఇష్టం లేని పెళ్లి చేసుకున్నా బిడ్డ బాగుంటే చాలు అనుకున్నామని, ఇలా జరుగుతుందని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహేందర్ రెడ్డిని కఠినంగా శిక్షించాలని వేడుకున్నారు. ఇక, శనివారం ఉదయమే స్వాతితో ఫోన్‌లో మాట్లాడానని, అర్ధరాత్రి రెండు గంటల తర్వాత పోలీసులు వచ్చి విషయం చెప్పడంతో గుండె పగిలినంత పనైందని స్వాతి తల్లి స్వరూప విలపిస్తున్నారు.

భార్యపై కత్తిపోటు

6 నెలల గర్భవతిపై భర్త హత్యాయత్నం

» అనుమానంతో గొడవలు. మద్యం మత్తులో కత్తితో దాడి

» ఖమ్మం జిల్లాలో ఘటన


నిందితుడు వాడిన కత్తి

మధిర రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి మద్యం మత్తులో దారుణానికి ఒడిగట్టాడు. తన భార్య ఆరు నెలల గర్భిణి అని కూడా చూడకుండా కత్తితో దాడి చేసి హతమార్చబోయాడు. అదృష్టవసాత్తు భర్త నుంచి తప్పించుకున్న ఆమె ప్రాణాలతో బయటపడగా.. ఆ భర్త పరారయ్యాడు. ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరు గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితురాలు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. విజయవాడలో లారీ డ్రైవర్‌గా పని చేసే మాటూరు గ్రామానికి చెందిన చిల్లా సూర్యనారాయణ.. ఏపీలోని మంగళగిరికి చెందిన సాయి నాగలక్ష్మి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఏడు, నాలుగేళ్ల వయస్సు ఉన్న ఇద్దరు కుమారులు ఉండగా నాగలక్ష్మి ప్రస్తుతం ఆరు నెలల గర్భిణి. వీరి కాపురం కొంతకాలం సజావుగా సాగగా.. సూర్యనారాయణ తన భార్య నాగలక్ష్మిపై అనుమానం పెంచుకోవడంతో ఇరువురి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. సూర్యనారాయణ మద్యానికి బానిసై పనికి కూడా సరిగా వెళ్లడం లేదు. ఈ క్రమంలో విధులు ముగించుకుని శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి తిరిగొచ్చిన సూర్యనారాయణ.. వచ్చేటప్పుడు ఓ కత్తిని తెచ్చుకున్నాడు. పిల్లలు ఇద్దరూ నిద్రలో ఉండగా భార్యాభర్తల మధ్య గొడవ జరగ్గా.. అర్ధరాత్రి 12 గంటల సమయంలో సూర్యనారాయణ తన భార్య నాగలక్ష్మి మెడపై కత్తితో దాడి చేసి విచక్షణారహితంగా పొడిచాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన నాగలక్ష్మి ఇంటి నుంచి బయటికి పరుగు తీసింది. తీవ్ర రక్తస్రావంతో ఉన్న నాగలక్ష్మిని గమనించిన స్థానికులు ఆమెను అంబులెన్స్‌లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాగలక్ష్మి ప్రస్తుతం మధిరలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. భార్యపై దాడి చేసిన అనంతరం సూర్యనారాయణ పరారయ్యాడు. నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మధిర రూరల్ పోలీసులు ఆదివారం మాటూరు గ్రామానికి వెళ్లి ఘటనాస్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. పరారీలో ఉన్న సూర్యనారాయణ కోసం గాలిస్తున్నారు.

చట్ట సభలు ప్రతిష్ఠను కోల్పోయినప్పుడల్లా విపరిణామాలు

» ప్రజాస్వామ్య చోదక శక్తి పార్లమెంటు

» అక్కడ రూపుదిద్దుకునే సరైన విధానాలే దేశాన్ని సన్మార్గంలో నడిపిస్తాయి

» స్పీకర్ల సమావేశంలో అమిత్ షా



స్పీకర్ల సదస్సులో మాట్లాడుతున్న అమిత్ షా; పాల్గొన్న తెలుగు రాష్ట్రాల స్పీకర్లు ప్రసాద్‌కుమార్, అయ్యన్నపాత్రుడు, చిత్రంలో రఘురామ కృష్ణం రాజు, బండ ప్రకాశ్

న్యూఢిల్లీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లే చోదక శక్తి పార్లమెంటేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. చట్టసభలో రూపుదిద్దుకునే సరైన విధానాలే మన దేశాన్ని సన్మార్గంలో నడిపిస్తాయని తెలిపారు. చట్టసభలు రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, ప్రజల సమస్యలను లేవనెత్తడానికి సభ నిష్పక్షపాత వేదిక కావాలని అన్నారు. కేంద్ర శాసన సభ మొదటి స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికై వందేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఢిల్లీ అసెంబ్లీలో రెండు రోజులపాటు జరిగే అఖిల భారత స్పీకర్ల సమావేశాన్ని ఆదివారం అమిత్ షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సభతో పాటు స్పీకర్ గౌరవాన్ని పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం సభ జరిగేలా చూసుకోవాల్సిన బాధ్యత స్పీకర్లు, చైర్మన్లతోపాటు ప్రతి సభ్యుడిపై ఉందన్నారు. 13 వేల ఏళ్ల భారత దేశ చరిత్రలో చట్ట సభలు గౌరవాన్ని కోల్పోయినప్పుడల్లా మనం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వచ్చిందని అమిత్ షా అన్నారు. శాసన సభలు సరిగా పనిచేయకపోతే ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు ఉత్పన్నమవుతాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు తెలిపారు. ఈ స్పీకర్ల సమావేశం ఉత్తమ పద్ధతులను నేర్చుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, దేశంలోని 29 రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లు, 17 మంది డిప్యూటీ స్పీకర్లు, ఆరు రాష్ట్రాల శాసన మండలి చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లు.. కేంద్ర, ఢిల్లీ మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షాను గడ్డం ప్రసాద్ శాలువాతో సత్కరించారు. కాగా, శాసన సభల పనిదినాలు పెరగాల్సిన అవసరం ఉందని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అభిప్రాయ పడ్డారు. "అసెంబ్లీల్లో నిజమైన ప్రజాస్వామ్యం ఉందా..? అన్న కీలక ప్రశ్నను మనం ఎదుర్కొంటున్నాం. తొలి పార్లమెంట్ సుమారు 135 రోజులు నడిచింది. నేను 17వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్నాను. ఈ సభ పని దినాలు ఏడాదికి 55 రోజులకు పడిపోయాయి. ఇక్కడ కొంతమందితో మాట్లాడినప్పుడు తమ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు 30 నుంచి 40 రోజులు నడుస్తున్నాయని చెప్పారు. దీనిపై మనం ఎంతో ఆలోచించాల్సిన అవసరం ఉంది. సభలు ఇలాగే నడిస్తే ప్రజా సమస్యలపై చర్చించడం కష్టమే కదా..? అందుకే.. పనిదినాలు పెరగాల్సిన అవసరం ఉంది. 180 రోజులకు తక్కువ కాకుండా సభ నడవాలని రాజ్యాంగం చెబుతోంది. తొలి పార్లమెంట్‌ను సభాపతి 180 రోజులు నిర్వహించిన తీరును మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలి" అని రఘురామ తెలిపారు.

'సింగూరు'లో 8 టీఎంసీలు వృథా

శాశ్వత మరమ్మతులు చేపట్టని ఫలితం.. పూర్తి సామర్థ్యం నింపితే డ్యామ్‌కు ప్రమాదమే

» ఇటీవల స్పష్టం చేసిన నిపుణుల బృందం

» 30 టీఎంసీలకు 17 టీఎంసీలే నిల్వ

» వరదను దిగువకు వదిలేస్తున్న వైనం

మరమ్మతులపై ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

సంగారెడ్డి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టులో పూర్తి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేసే పరిస్థితి లేకపోవడంతో మంజీరా వరద ప్రవాహాన్ని వచ్చింది వచ్చినట్లు నీటిపారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. ఐదు గేట్లు ఎత్తి వరదతో పాటు రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న దాదాపు 8 టీఎంసీల నీటిని వృథాగా వదిలేశారు. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు సింగూరు రిజర్వాయర్‌పై కొంతకాలంగా నిర్లక్ష్యపు ఛాయలు అలుముకున్నాయి. తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు పరివాహక ప్రాంత భూములకు సాగునీరు అందిస్తున్న ఈ రిజర్వాయర్‌కు ముప్పు వాటిల్లే పరిస్థితి దాపురించింది. ఈ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు. కానీ ప్రస్తుతమున్న నిల్వ 16.854 టీఎంసీలే. దాదాపు 13 టీఎంసీలను తక్కువగా నిల్వ చేశారు. ఇందుకు ప్రధాన కారణం మరమ్మతులు చేపట్టకపోవడమే. గతంలో ప్రాజెక్టు ఆనకట్టకు బుంగ పడింది. దీనికి తాత్కాలికంగా కంకర చిప్స్ బస్తాలు అడ్డుపెట్టి చేతులు దులుపుకున్నారు. ఇటీవల ప్రాజెక్టుల భద్రతా నిపుణుల బృందం ఈ రిజర్వాయర్‌ను సందర్శించి, పలు లోపాలను ఎత్తి చూపింది. పూర్తి సామర్థ్యం మేరకు నీరు నింపితే కట్టకు ప్రమాదమని హెచ్చరించారు.


సింగూరు రిజర్వాయర్ ఆనకట్టకు బుంగ పడిన చోట వేసిన కంకర చిప్స్ సంచులు

శాశ్వత మరమ్మతులపై నిర్లక్ష్యం

సింగూరు ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేపట్టే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉందని ఏడాది కిందట 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఇదే విషయంపై ఇటీవల నిపుణుల బృందం అధికారులు కూడా హెచ్చరించారు. ప్రాజెక్టు అధికారులు నీటి నిల్వ తక్కువగా ఉన్నప్పుడు డ్యామ్ కట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టకుండా అలసత్వం ప్రదర్శించారు. ప్రస్తుతం పూర్తి సామర్థ్యం కంటే 13 టీఎంసీలు తక్కువగా ఉన్నందున ఇప్పటికైనా శాశ్వత మరమ్మతులు చేపట్టడం అవసరం. గేట్ల లీకేజీ సమస్యలు కూడా ఉన్నాయి. తాత్కాలిక మరమ్మతుల కోసం కేటాయించిన నిధులు కూడా దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు లేకపోలేదు.

వేసవిలో ఇబ్బందులే..!

మిషన్ భగీరథ పథకం ద్వారా ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు సింగూరు ప్రాజెక్టు నీటిని అందిస్తున్నారు. ఇవే నీటిని హైదరాబాద్‌కు మంజీరా పథకం ద్వారా దశాబ్దాల కాలంగా సరఫరా చేస్తున్నారు. సింగూరులో లోటు ఉంటే హైదరాబాద్‌కు నీళ్ల కష్టాలు తలెత్తుతాయి. అందుకే ఎప్పుడూ సింగూరును నిండుకుండలా ఉండేలా చూస్తారు. మొదటిసారి పుష్కలంగా నీళ్లు ఉన్నా నిల్వ చేయలేకపోయారు. ఇక పుల్కల్, చౌటకూర్, అందోల్, మునిపల్లి, సదాశివపేట మండలాల్లో 40 వేల ఎకరాలకు కుడి, ఎడమ కాలువల ద్వారా సాగు నీటిని అందించడం కూడా కష్టమే అవుతుంది. ఇప్పటికే కాలువల ఆధునీకరణ పేరిట మూడు పంటలకు నీళ్లివ్వలేదు. ఈసారి ప్రాజెక్టులో నీళ్లు లేనందున రైతులు ఆందోళన చెందుతున్నారు.


కెనడాలోని విండ్సర్ నగరంలో లక్ష్మీనృసింహుల కల్యాణం

యాదగిరి క్షేత్రం.. భక్తజన సంద్రం

యాదగిరిగుట్ట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రం భక్తజనసంద్రమైంది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆదివారం ఆలయ తిరువీధులు కిక్కిరిశాయి. 52 వేల మంది భక్తులు నృసింహుడిని దర్శించుకోగా, ప్రత్యేక, ధర్మదర్శనం క్యూలైన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో రద్దీ కొనసాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 55.16లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవం కెనడాలో వైభవంగా జరిగింది. తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో విండ్సర్ నగరంలో స్వామిఅమ్మవార్ల కల్యాణాన్ని యాదగిరిగుట్ట ప్రధానాలయ విశ్రాంత ప్రధానార్చకుడు నల్లంథీఘళ్ లక్ష్మీనరసింహచార్యులు నిర్వహించారు.

నీటిలో విషం కలిపిన టీచర్‌పై హత్యాయత్నం కేసు

» ఉద్యోగం నుంచి తొలగింపు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తాగునీటిలో విషం కలిపి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడిన భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల ఉపాధ్యాయుడు పెండ్యాల రాజేందర్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. అతడిని పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలనుసారం ఈ చర్యలు తీసుకున్నట్టు డీఎస్పీ సంపత్ రావు తెలిపారు. మరోవైపు రాజేందర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్టు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ నెల 21 రాత్రి తాగునీటి ట్యాంకులో ఉపాధ్యాయుడు రాజేందర్ గడ్డి మందు కలిపినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. హాస్టల్ ప్రత్యేక అధికారిపై నెపాన్ని నెట్టేందుకు కుట్ర చేసినట్లు తేలింది.ఈ ఘటనలో 11 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నారు. విద్యార్థులపై విష ప్రయోగానికి పాల్పడిన రాజేందర్‌ను కఠినంగా శిక్షించాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దిలీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మద్యం తాగి వేధిస్తున్నాడని భర్తపై భార్య దాడి

తీవ్ర గాయాలు.. కేసు నమోదు

పెనుబల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి తరచూ వేధిస్తున్నాడని భర్తపై భార్య దాడి చేసిన ఘటన ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజర్ గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన పర్వతం గంగరాజుకు లక్ష్మీతో 25 ఏళ్ల క్రితం వివాహమైంది. గంగరాజు ఇటీవల తరచూ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య, పిల్లలతో గొడవ పడుతున్నాడు. దీంతో భార్యభర్తల మధ్య కొంత కాలంగా ఘర్షణలు జరుగుతున్నాయి. శనివారం మద్యం తాగి ఇంటికి వచ్చిన గంగరాజు.. భార్య లక్ష్మీతో గొడవకు దిగాడు. ఎదురుతిరిగిన లక్ష్మీ.. భర్త గంగరాజు నోట్లో గుడ్డలు కుక్కి దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన గంగరాజును పెనుబల్లి ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. లక్ష్మీపై వీఎం బంజర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.